
పోలీస్ లాకప్‌లో సుదర్శనను

చంపేశారా?

ఈ నెల 18 వ తేదీనుంచి కాజీపే...
...కి పోలీసుల చిత్రహింసలకు
...రంభమైంది. లాకప్ లో
...ఆ పోలీసు...



18వ తేదీ

బంద్ కు వరంగల్ జిల్లా పౌరహక్కుల సంఘం పిలుపు

వరంగల్ జిల్లా

మరో నక్సలైట్ మృతి

విరసం

సాహిత్య పాఠశాల

విచారణకు డిమాండ్

విరసం ఖండన

పోలీసు హింస

ఆర్.ఇ.సి. నిరవధిక మూసివేత

విప్లవ రచయితల విజ్ఞప్తి

వరంగల్ జనవరి 23 (టెలిన్యూస్):

...ను నిరవధికంగా
...క్ కౌన్సిల్ బుధ
...ము ఇంజనీరింగ్

బందిపోట్లనుమించిన పోలీసు దాడులు

సారంగపాణి హత్య

నక్సలైట్ గంగారాం మృతి

డి.ఐ.జి వివరణ

పౌరహక్కుల సంఘం

కార్యదర్శిపై కేసు

వరవరరావు అరెస్టు

వెంకొనివున్నదని
18

న్యాయవాది హత్య

న్యాయవాది హత్య:

కోర్టు బహిష్కరణ

నల్గొండలో న్యాయవాదుల కోర్టుల బహిష్కరణ

బెయిలు

సృజన

వరవరరావుకు

వరంగల్లో

అమ్మో.... వరంగల్లో

నక్సలైట్ల 24 మంది

పోలీసులు "

24వ మృతి

న్యాయవ్యవస్థపై చిన్నచూపు

వరంగల్ అరెస్టులపై

బాలగోపాల్ అరెస్ట్

సుప్రీంకోర్టు విచారణ

ఈ సంచికలో....

సృజన, హనుమకొండ 506 001

విడి ప్రతి రూ. 3
సంవత్సర చందా రూ. 30

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Printed, Edited & Published by P. Hemalath for 'Sahithee Mithrulu'
Printed at Navatha Printers, J. P. N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal

సవాల్

1971 ఆగస్టులో ముగ్గురు విప్లవ రచయితలను పిడి యాక్టు కింద అరెస్టు చేస్తే అన్యాయమని నలభై మంది రచయితలు హైదరాబాదులో ఒక సంయుక్త ప్రకటన చేసారు. ఒక దినపత్రిక సంపాదకుని దగ్గరినుంచి ఆ జాబితా సంపాదించి (ఆ సంపాదకుడే సత్యం కైలాసాలను ఎన్‌కౌంటర్ల పేరుతో వెంగళరావు కాల్చివేస్తే మహదానందంగా అభినందించారు) పోలీసులు ఆ నలభైమంది రచయితల ఇళ్ళమీదా దాడులుచేసి సోదా చేసారు. ఒకరి ఇంట్లో 'ఝంఝ' కవితా సంకలనం దొరికిందని కేసుకూడా పెట్టారు. అప్పటినుంచి ఎన్నోమార్లు విప్లవ రచయితలు అరెస్టయ్యారు. రచనల గురించీ, ప్రసంగాల గురించీ కుట్రకేసుల్లో ఇరికించబడ్డారు. భావాలగురించి అరెస్టు చేయడం అన్యాయం. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగకరం అని ఖండించే రచకుల సంఖ్య తగ్గింది. అంటే పోలీసులు తీసుకున్న మొదటి జాగ్రత్తేకొంత పనిచేసింది. అకాడమీలో, అరసంలో, అటువంటి సంస్థల్లో వున్న రచయితలకు విరసం పట్ల వున్న మౌలికమైన సైద్ధాంతిక వ్యతిరేకత వాళ్ళను ప్రజాస్వామిక హక్కులకు కూడ అంధుల్ని చేసింది.

ఎమర్జెన్సీ పౌరహక్కుల సంఘాల మీద, ఉద్యమం మీద కూడ తన ఉక్కుపిడికిలిని ప్రయోగించగలిగిందంటే ప్రజాస్వామ్య విలువలపట్ల మేధావులకు, రచయితలకు ఏర్పడిన ఈ దూరమూ, ఉదాసీన భావమే కారణం. కాకపోతే 'అభ్యుదయ' మేధావులు ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి ఎమర్జెన్సీ అనివార్యంగా వచ్చిందని ఆత్మవంచనలో ఉష్ట్రపక్షుల్లా తలదాచుకునివుండరు.

ఎమర్జెన్సీ ఎత్తివేసినాకగానీ తల తడుముకొని ప్రజాస్వామ్య భావాల ప్రశంస ప్రారంభించలేదు.

ఎమర్జెన్సీ దురాగతాల మీదనే కాదు 'ఎన్‌కౌంటర్ల' మారణకాండపై కూడ న్యాయవిచారణ జరగాలని దేశవ్యాప్తమైన ఉద్యమం పెల్లుబికింది.

మొదటినుంచీ పౌరహక్కుల సంఘాలను నక్సలైటు ఫ్రంటు సంస్థలుగా దుష్ప్రచారం చేస్తున్నా పోలీసులు రైతుసంఘాల పేరుతో కూడ ఈ ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి ప్రారంభించారు. విప్లవ పార్టీల సిద్ధాంతాలతో ఏకీభావం లేకపోవడమేకాదు ఎన్నో అభిప్రాయభేదాలు వుండి కూడ కొందరైతే కమ్యూనిస్టు వ్యతిరేకులై కూడ పౌరహక్కులపట్ల వుండవలసిన అవసరత జాగరూకతతో ప్రశ్నించినప్పటికీ పోలీసులు వాళ్ళను నక్సలైట్లుగానే చిత్రించారు.

ఇదంతా పోలీసులు నమ్మో, తెలియకో చేసిందికాదు మేధావులు, ప్రజాతంత్రవాదులు పోరాడే ప్రజల న్యాయమైన పోరాట హక్కును బలపరిచే వైఖరి కూడా తీసుకోకూడదనే.

అయినాసరే శ్రీకాకుళం మీదుగా నక్సల్బరీ అడవులూ నదులూ గడిచి మైదానాల్లో ప్రజాపథమై చాలుపెట్టేవరకు ప్రజాతంత్ర ఉద్యమంకూడ బలంపుంజుకున్నది.

ఈ విప్లవాన్ని అణచడం మాత్రమేకాదు ఈ విప్లవించే హక్కు ప్రజలకు ఉన్నదని ప్రకటించే భావాలను నిరోధించడం కూడా పోలీసులకు సాధ్యంకాని స్థితి వచ్చింది. ముందే కోతి అందులో కల్లు తాగింది. కళ్ళు కానక ముల్లుగుచ్చింది. ఆపైన నిప్పు దొక్కింది అన్నట్లు కుప్పిగంతులు వేస్తున్నది.

ఒక్క 84లోనే లాకప్‌హత్యలు 24 అయినవి పౌరహక్కులసంఘం అన్నది. వీటిమీద న్యాయ విచారణ జరిగి నేరస్తులను శిక్షించాలన్నది. ఇవేవీ సహజ మరణాలు కావనీ, అట్లాగే గుండెనొప్పో కడుపునొప్పో కూడ కాదని, వీళ్ళంతా పోలీసుల చిత్రహింసలతో చచ్చారని తనవద్ద సాక్ష్యాధారాలు వున్నవన్నది. ముఖ్యంగా కాజీపేట లాకప్‌లో హత్యచేయబడిన రాడికల్ యువకుడు సుదర్శన్ విషయం హైదరాబాదు ప్రెస్ కాన్ఫరెన్సులో సాక్ష్యం చెప్పించింది. ఈ లాకప్ హత్యపై న్యాయవిచారణ జరగాలని కరపత్రం వేసింది. పోలీసుల దృష్టిలో అదీ కుట్ర అదీ నేరం. 'వరంగల్ బంద్' సందర్భంగా అరెస్టు ఎందుకు చేసారని అడిగితే అరెస్టు చేసారు. మాకు 'బందు' తో సంబంధం లేదంటే యాసిడ్ బాంబులు పంచడంతో సంబంధముందన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని పోలీసులను ప్రశ్నిస్తే చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని సాయుధంగా కూల్చాలని కుట్రచేస్తున్నారని పౌరహక్కులబాధ్యుల్ని చట్టవిరుద్ధంగా అరెస్టు చేసారు. సుదర్శన్‌ను పోలీసులు అరెస్టు చేస్తుంటే చూసామన్న సోమిడి ప్రజల్ని ముప్పై మందిని అరెస్టుచేసి చిత్రహింసలు పెట్టారు.

లాకప్‌లో సుదర్శన్ హత్యపై న్యాయ విచారణ జరిగి నేరస్తుల్ని శిక్షించాలని 'వరంగల్ బంద్' పిలుపు ఇచ్చిన రాడికల్ యువజన సంఘం కార్యకర్తలను ఎందరినో అరెస్టుచేసి బాంబులు దొరికాయని కేసు పెట్టడమే కాదు, మరొక రాడికల్ యువకుడు కామ్రేడ్ సారంగపాణిని పట్టుకొని చిత్రహింసలు పెట్టి చంపేసి కాలు జారి బొందలో పడి చచ్చాడన్నారు. ఒక్క లాకప్ హత్యమీద న్యాయ విచారణ జరగాలన్నందుకు ఎందరెందరో లాకప్‌ల చిత్రహింసల్లోకి, అక్రమకేసుల్లోకి. పరాకాష్ఠగా ప్రతీకారంగా మరో లాకప్ హత్య జవాబు.

ఖాకీ దుస్తుల న్యాయం ఇట్లావుంటే ఈ న్యాయం కూడా భరోసా లేని ఖూస్వాములు కాషాయ వేషధారి బ్రిదర్‌లయి కాషాయం జెండాలెత్తారు. ఖాకీ యూనిఫారాలు కాగడా గుర్తులు, కాషాయం జెండాలు, కమలం గుర్తులు, ఓం జెండాలు అన్నీ ఇవి అవి అయిపోయాయి. 'జాతీయవాదుల' 'దేశభక్తి' వెల్లివిరిసి నక్సలైట్లు కావడం అలా వుంచి వాళ్ళ కేసులు కోర్టుల్లో వృత్తిధర్మంగా వాదించడం కూడా నేరమయిపోయింది. ఫాసిజం 'దేశభక్తి'ని గుత్తగొని పాలను, నీళ్ళను వేరుచేసే పని తనదే నని ప్రకటిస్తుంది. జగిత్యాలలో న్యాయవాది మాత్రమే కాదు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, చుట్టూ ఇరవై గ్రామాల్లో పరపతీ, పలుకుబడీ వున్నవాడు, జిల్లా సహకార బ్యాంకులో బాధ్యుడు, కేవలం వృత్తిధర్మం వల్ల నక్సలైటు కేసులు చేస్తూ, రాజ్యాంగం గ్యారంటీ చేసింది కనుక ప్రాథమిక హక్కులు పౌరులకు ఎవరికైనా కాపాడబడాలి అన్నవాడు రాజన్నను హిందూ రజాకార్లు చంపేసారు.

ఇంక నక్సలైట్ల కేసులు వాదించడానికి జగిత్యాల, మెట్‌పల్లిల్లో ఎవరూ ముందుకు రారనే ధీమాతో, ఆ కేసులు పెండింగ్‌లో వుండడంకన్న, ఆ ఫైళ్ళను మూయిద్దామని మళ్ళీ 'ఎన్‌కౌంటర్' హత్యలు ప్రారంభించి ఖైరి గంగారామ్‌ను చంపేసారు పోలీసులు (ఈ ఖైరి గంగారామ్ గురించి 'జాగృతి' పత్రిక, హిందూ రజాకార్లు చేసిన దుష్ప్రచారం తార్కిక పరిష్కారం ఈ హత్య)

నెలవంక నుంచి నెలవంక కోసం ఆకాశం అలమటించిన నెలరోజుల్లో ముగ్గురు విప్లవకారులను పోలీసులు చంపారు ఇది చట్ట విరుద్ధమన్నందుకు ముగ్గురు పౌరహక్కుల బాధ్యుల్ని నిర్బంధించారు. వాళ్ళపై కుట్ర కేసు మోపారు.

నక్సలైట్లకు రహస్య దళచర్యల్లో, తుపాకీలో హింసలో విశ్వాసమున్నదని, వాళ్ళు ప్రజల్లోలేరని ప్రజలు వాళ్ళతోలేరని బహిరంగ ప్రచారంచేసే సత్యాహింసల ధర్మమూర్తులు రహస్య దళంగా తుపాకులతో వచ్చి రాజన్నను కాల్చి ఆయన భార్యను తుపాకీ మడమతో కొట్టి పారిపోయారు.

పౌరహక్కుల బాధ్యుల మీద ఖాకీ దుస్తుల కాషాయ జెండాల తీర్పు ఇది. కాదు ప్రజాస్వామికహక్కుల కోసం నిలిచేవారిని పాలకవర్గాలు చేస్తున్న సవాల్ ఇది.

ఈ సవాల్‌ను ఎంత సంఘటితంగా పౌరహక్కుల, ప్రజాస్వామిక హక్కులసంఘాలు, శక్తులుమాత్రమే కాదు విప్లవోద్యమం కూడ ఎదుర్కొంటుంది అనే దాని మీద ప్రజాతంత్ర ఉద్యమ భవిష్యత్తు ఆధారపడివున్నది.

27-1-85

త్రీ చీర్స్

లాకప్‌లో నువు ఆయువు పట్టుమీద కొడితే
పోయిన ప్రాణం లావాయై ఎగజిమ్మింది
సుదర్శన్ చీకట్లో వెతుక్కునే చేతులకు
చూపు అందించాడు
అందుకే నువు
పగిలిన అగ్నిపర్వతం మీదకూర్చున్న
పశువులా పరుగు లెత్తావు

సాయుధ పాణి అయినా సారంగపాణి అయినా
నీమీదనే యాసిడ్ బాంబు వేసినట్లు అదరి పడ్డావు గానీ
నువ్వు ప్రజల బ్రతుకుల్ని బండలు చేసినపుడు
నీకు చీమకుట్టి నట్లైనాలేదు
సారంగాన్ని పరుగెత్తించి
వరంగల్ గుండెకు గురిచూపి మళ్ళీ కాల్చావు

నువు గంగజిమ్మను చంపి
గంగలో నెత్తుటిచేతులు కడుక్కుంటే
సముద్రం పసి గట్టింది
జన సముద్రం పగ బట్టింది

గంగ నీళ్ళుకాదురా ఆదిరక్తం
గంగారామ్ మనిషి కాదురామంట
ఆరక్తం మంటలు జగిత్యాల నాగేటిచాళ్ళ పంటలూ
గర్జించిన వసంతమేఘం
వర్షించిన తెలుగు బీళ్ళలో
మొలకెత్తిన రేపటి సూర్యులు

— రాహీ

దండకారణ్య భాస్కరుడు

గంగన్న

తూర్పు నుండి
తూర్పు కనుమల్లోకి
అరుణారుణ బింబం.........
కమ్ముకున్న చీకట్లను
చీల్చుకుంటూ ఉదయిస్తున్న
వినూత్న జీవన భాస్కరుడు
లోవలో,
గజ గజ వణికిస్తున్న చలి
తెరలు తెరలుగా కమ్మిన మంచు
రెపరెపలాడుతున్న ఎర్రనిజెండా
అరుణారుణ భాస్కరుని ప్రభాత కిరణాలు
'అరుణ తార'[1] లపై ప్రకాశిస్తుంటే
తూర్పున ఒరిగిన అన్నలకు వినమ్రులై
అరుణాంజలి ఘటిస్తున్న అరుణ భాస్కరుడా

విశాలమైన మైదానాలు దాటి
పంటపొలాలు, పచ్చిక బయళ్ళు నడచి
అడవులు, లోయలు, ఏరుల సవ్వడుల్లో కలసి
పొంగిపొంగి, పొర్లిపొర్లి
పోరాటం ఊపిరిగా ప్రవహిస్తున్న గోదావరి దాటి
ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి
విప్లవ సౌరభాలు వీస్తున్నాయి

ఇక్కడ
ఎత్తయిన పర్వత సానువులు
సువిశాలమైన అడవులు

మన్యం పోరాట వారసత్వాన్ని
తెలంగాణ కొనసాగింపుగా పుణికి పుచ్చుకున్న
అరుణ భాస్కరుల కవాతులో
పోరాట గానాలాపన గావిస్తున్న తూర్పు కనుమలు

కొండ కొండ — లోవ లోవ
దారకొండ — కోరుకొండ
కొండరెడ్డి — కొండదొర
ఎల్లవరం — చోడవరం
సామంతులు — సవరలు
విల్లు సారిస్తే
పర్వత సానువులన్నీ కల్లోలమైన వేళ
సానువులపైన వెదురుమొక్క పమ్మెతు నిలిచింది
ఘాటీలు,[2] గెడ్డలు[3] లోయలు
అరుణ భాస్కరుల అలవాలమైనాయి ...
తాండవ, శబరి, సీలేరులు దాటి
బస్తర్ ఆదివాసుల గూడాల గుండా
అబుజారీ[4] పర్వత శిఖరంపైన
విడిది చేసిన అరుణ భాస్కరుడు
దండకారణ్య పోరాట చరిత్ర మననంచేస్తూ
పేటల గుండా — మైదానాల గుండా
పరుగు పరుగున — ఎగసి ఎగసి
ఉరికి ఉరికి నడచి నడచి
అరుణ భాస్కరుడిని పెనవేసిన గతం
అదిలాబాద్ అడవుల గుండా
ఝు ... ఝు .. ఝు .... తుడుం పోరాటపు పిలుపు
కరీంనగర్ రైతు జైత్రయాత్ర
నిజామాబాదు లంబాడీల కళ్ళ వెలుగు

నిత్య నిర్బంధాల మధ్య నిలిచిన ఓరుగల్లు
దండకారణ్య చరితకు
బీజమై, మొక్కై ఎదిగితే
కొండ కోనల్లోని గిరిజనులు మొగ్గలై
ప్రజాపంథా పరిమళాల నిచ్చినవేళ
ప్రకాశిస్తున్న పరిమళిస్తున్న అరుణారుణ భాస్కరుడు
సమరశంఖ మూదిన దండకారణ్యంలో
ప్రపంచ విప్లవంలో భాగంగా
అనివార్యమైన ప్రపంచ యుద్ధంలో
భారత అంతర్యుద్ధాన్ని సాగించే ఫౌజు
అరుణారుణ భాస్కరుని కళ్ళలో ప్రతిబింబించింది
కదనానికి కదిలిన ఎర్ర సైన్యం
వింధ్య పర్వతాగ్రింపైన నిలిచి
ఢిల్లీ పాలకుల గుండెల్లో గుండు పేల్చుటకు
ఫిరంగి ఓగిస్తున్న సమయంలో
అరుణ భాస్కరుడు వెనుదిరిగి చూస్తే
వెదురు వనాలను — టేకు వనాలను దాటి
దక్షణాపథం నుండి — పోరాట సౌరభాలు వీస్తుంటే
దండకారణ్యమంతా — ఎర్రపూల వనంలా గోచరించింది

(తూర్పుకనుమల పోరాటం విన్నప్పుడు నేటి జాతీయ అంతర్జాతీయ పరిస్థితి 'పేర
ణగా తూర్పు కనుమలఆదివాసీలకు అంకితం)

1. గెరిల్లాల క్యాప్‌పై వుండే రెడ్ స్టార్
2 ఎత్తైన కొండలు 3. వాగు లేదా ఒర్రె
4. మహారాష్ట్ర–మధ్యప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు
ల్లోని కొండలు

పాటలు :

కదలండీ పోరాటంలోకి

రచన సూరీడు

(బాణీ: తారల్లుడు ఋల్లిరికాని — రగులుతున్నది రాయసీమ)

కదలండి పోరాటంలోకి
అరె ప్రాజెక్టులకు ప్రాణంబోసి
వస్తులు బండే కార్మికులారా ॥కద॥

నాగార్జున సాగరులోన — నలుగుతున్న ఓ కార్మికులారా
శ్రీశైలం ప్రాజెక్టును గట్టి — బతుకులు చితికిన తమ్ముళ్లారా
ఆనకట్టలు ఎన్ని గట్టినా — అన్నంలేని అన్నల్లారా
ఎన్ని పేరులని ఇలా సెప్పను — పేరులేని ఓ వీరుల్లారా
ప్రపంచములో ప్రాజెక్టులకు — ప్రాణంబోసిన కార్మికులారా ॥కద॥

కొండలల్ల ప్రాజెక్టులగట్టి — ఏటిపాయల గుండెలు దట్టి
మీ ప్రాణాలే పునాది రాళ్లుగ — ప్రాజెక్టులకు పణంగబెట్టి
ఊపిరినే నీటి ధారలకు — ఉక్కుబాహుగ అడ్డుగబెట్టి

కాలంతో కవాతు

హనీఫ్

ఈ రక్తప్రవాహంలో దూకుతాను
మోసాల మొసళ్ళతో కలబడి
యుద్ధ నైపుణ్యాన్ని నేర్చుకుంటాను

ఈ రక్తనాళాలను
యుద్ధ వీణా తంత్రులుగా చేసి
గుండు తాకిన యోధుని
గుండె గాయాల్ని గానం చేస్తాను

సాగుతున్న ప్రజాయుద్ధానికి కవచాన్నై
శత్రు మూకల
ఎదురు కాల్పుల బూటకాన్ని
బట్టబయలు చేస్తాను

తుర్పుదారులచుట్టూ
దడికట్టిన చీకటి చట్టాలను తోసేస్తూ
రేపటి ఉదయంకోసం
నడుస్తున్న చరిత్రతో నేను నడుస్తాను

మీ రక్తంతో సిమెంటు గలిపి — కాంక్రీటుతో ప్రాజెక్టును గట్టి
పొట్టబట్టుక వెళ్ళిపోయడి — అన్నల్లారా తమ్ముల్లారా ॥కద॥

పెద్ద పెద్ద [1]గర్డర్లనుగట్టి — ఏటవాలుగ తీగలుసుట్టి
ఐసా ఇలేసా అంటూ — దిమ్మలు లేపి సపోర్టుబెట్టి
వందల [2]ప్లేట్లు బిగించి పెట్టి — [3]రోటారూకు [4]షాఫ్టునుబెట్టి
[5]స్టాటరుకు [6]మేగ్నెట్లునుబెట్టి — కరంటుజేసే యంత్రిగట్టి
గుండెల్లో మంటను నొక్కి — బంగ్లా వెలుగుతో నింపేవాళ్ల ॥కద॥

కళ్లు మండినా, నీళ్లు గారినా — వెల్డింగులతో కడ్డీ అతికి
సుత్తులను, పానాలనుబట్టి — బోల్టులుబట్టి ఫిటింగులుజేసి
ఎత్తయినా స్థంబాలను లేపి — నీపైనా బలె లైన్లు వేస్తే
కార్మికులకు అప్పులు, తిప్పలు — ఈటి బాధలు ఎన్నో వచ్చే
గవర్నమెంటు కాంటాక్టరుకు — దోపిడిచేసే లైసెన్సిచ్చే
దోపిడీరాజ్యం అంతంజేయ — సుత్తులు, పానాలు బట్టుకొని ॥కద॥

[6]బలిగేటుకాడ మీరు — [7]కంఫ్రేషన్ కడ్డీలనుబట్టి
గుండేలన్నీ ఎగేసిపట్టి — జాక్ మిషనుకు గుండెనుబెట్టి
వచ్చే దారను వడేసి పట్టి — బలిగేటుకు బొక్కలు గొట్టి
కూలి పెంచమని సమ్మేజేస్తే — నక్సలైటులని జైల్లోబెట్టె
నగ్జల్బరీయో నాదారంటు — [8]జాకు కడ్డి లెగరేసి పట్టుకొని ॥కద॥

బహుళార్థక సాదకంగా — ప్రాజెక్టు బహు పసందుగుంది
ప్రాజెక్టుల్లో ప్రతి రాయికి — కార్మిక రక్తం రంగై ఉంది
పచ్చ పచ్చగా పాదరసంలా — పచ్చికతోటి పార్కున్నది
ఆఫీసర్ల విహార యాత్రికు — అందమైన బంగ్లా ఉంది
ఇన్ని గట్టిన కార్మికులకు — గోడలు కూలిన చీకటిగొంది
చీకటి గొందిలో చింతజేయక — పోరుబాటలో మంటల్లాగ ॥కద॥

కష్టపడేటి మీకు పస్తులు — కాంటాక్టర్లకు నోట్ల కట్టలు
రాజ్యాంగంలో చట్టాలన్ని — కంటాక్టర్ల సొంత బిడ్డలు
దిక్కు మార్చిన రివిజనిస్టులు — కాంటాక్టర్ల తొత్తులు వీల్లు
నల్లకోటుల అదాలత్తులు — కండ్లుబోయిన కబోదిప్పుడు

కంటాక్టర్ల పెంపుడు కుక్కలు — కటికబొయిన పోలీసు కుక్కలు
కంటాక్టరు కండలుదింటే — సర్కారోడు పేగులు తిన్నడు
సర్కార్‌పైన సవాల్‌జేద్దం — ఎర్రజెండ లెగరేసి పట్టుకొని "కద"

చికాగోలో చిందిన రక్తం — ఎర్రజెండ ఎరుపెక్కేను సత్యం
ప్రపంచానికి విముక్తి యోధులు — కార్మికులే సత్యం, సత్యం
భారతమాతను విముక్తి జేసే — రహదారికి అగ్రగామిగా
కరీంనగరము, ఆదిలాబాదు — మధ్యప్రదేశు మహారాష్ట్ర
మండుతున్నవి మెరస్తున్నవి — భూసాములను చెండుతున్నవి
సింగరేణి కార్మిక సమాఖ్య — సింగంలాగ పోరుతున్నది
పోరుబాటలో పోదాంరండి — అన్నల్లారా కార్మికులారా "కద"

(ఏండ్లకు ఏండ్లు విద్రోహాన్ని చావుదెబ్బదీస్తు, రివిజనిస్టుల, కాంటాక్టర్ల దుష్ప్రచారాన్ని ఎండగడుతు దుర్మార్గమైన పోలీసుదాడులు అరెస్టులమధ్య మొక్కవోని పోరాట దీక్షతో రాడికల్స్ అండతో 14 రోజుల సమ్మె పోరాటంతో పోలీసుల, కంటాక్టర్ల రివిజనిస్టుల గజగడలాడిస్తు విజయం సాధించిన నాగార్జునసాగర్ పవర్ హౌస్ కార్మికుల పోరాట ప్రేరణతో వారిగురించి ఈ పాటను ఏరుదాటించిన జాలరన్నకు కృతజ్ఞతతో అంకితం.)

---

1. గర్డస్లు = సపోర్టుగా లేపే పెద్ద పెద్ద యినుప బీమ్‌లు
2. ప్లేట్లు = టర్బన్‌లో ఉపయోగించే ఉక్కు పలకలు
3. రోటారు + షాఫు = ఇవి రెండు కలిసి ఉంటాయి వీటికి ప్లేట్లను బిగిస్తారు.
4. స్టాటర్ = స్టార్టర్
5. మెగ్నేట్ = అయస్కాంతం
6. బలిగేటు (బల్క్‌హేడ్) = బహూళార్థక సాధక ప్రాజెక్టులో టర్బన్ అమర్పుటకు వీలుగా ఏర్పాటు చేసిన ద్వారము. ఈ ద్వారమునుండి టర్బన్ లోనికి నీళ్ళు వేగంగా ప్రవహిస్తాయి. టర్బన్ బిగించటానికి, దీనికి లీక్ ఏమన్న ఉన్నదో లేదో చూడటానికి దానికి బొక్కలుగొట్టి చూసి తర్వాత టర్బన్ బిగిస్తారు.
7. కాంప్రెషన్ మిషన్ = దీనిని జాక్ అని కూడా అంటారు. దీనిని రంధ్రాలు వేయటానికి ఉపయోగిస్తారు.
8. జాక్‌కడీ — ఇది కాంప్రెషన్ మిషన్ కింద తిరుగుతు రంధ్రం చేసే రాడ్

నేవిజయానికి పాటుబడతా!

జాబిల్లి

పల్లెదిక్కు బాట బట్టి
బతుకుపోరు పాటగట్టి
గోండు గుండె జత గట్టి
నే సంగతంత విప్పి చెప్తా।

కొండలన్ని కలియబెట్టి
గుట్టలన్ని చుట్టబెట్టి
వాగులన్ని వేళ్ళముట్టి
నే అడవి తల్లి బిడ్డనవుతా।

మార్పు దిక్కు గాటగట్టి
మన్యమంత నడుచునట్టు
ఆదివాసి కళ్ళమాటు
నే రెచ్చిపోయే వెలుగవుతా।

చంద్రవంక సాగదీసి
ఏంత్రైన విల్లు చేసి
వెన్నెలనే సంధించి
నే వికాసాన్ని వెదజల్లుతా।

ఎర్రపూల గజ్జెకట్టి
వెతలబాధ కథగట్టి
జనశోకం పదునుబెట్టి
నే సమరానికి కత్తిబడతా।

తూటాల మాల గట్టి
తూరుపునే చేత బట్టి
తుడుంనే సంగీతించి
నే తుపాకీ పాట పాడుతా
భూమి భుక్తి విముక్తి కోసం
రగల్ జెండకు రక్తమిచ్చి
మానవత్వం పోరులోన
నే మరణానికి భాష్యం చెబుతా।

అనువాద కవిత :

హత్యాకాండ

జోస్. మా. సిజాన్

హత్యాకాండ ముగిసిన తొమ్మిది రాత్రిళ్ళకు
ధగద్ధగాయమైన గుర్రంపై స్వారిచేస్తూ
అతడు దుర్గమ మార్గం పట్టాడు
అతనివెంట రక్తంతో బురదలో తడిసి ఆరిన
గోధుమరంగు జెండాలు ఊపుతూ బలిబాతగా
గాయపడ్డ మనుషులు
ఆ జెండాలు ఓపిగా, కునుకులేక పడలి
పోతున్న స్త్రీలు నేసినవి
వాళ్లు తమకు తామే నవరాత్రిళ్ళ
దుఃఖపు ఛడీతో కొట్టుకుంటున్నారు

తొమ్మిది రాత్రిళ్ళకు ముందు నల్లటి మనుషులొచ్చారు
నల్లటి దుస్తుల్లో మనుషులు
మహాదాష్టీకంగా
దూషిస్తూ
గడపగడపకూ ఆజ్ఞల్ని జారీచేస్తూ
నిస్సహాయుల్ని నిద్రనుంచి నేలకీడుస్తూ
అపరిచితులైన ముఖాల్ని బూట్లతో తంతూ
ఒంట్లో సత్తువున్న వాళ్ళనందర్నీ గొర్రెల్లా
బయొనెట్ల బలంతో తప్పుడు కీర్తికై
అరుపులు చాస్తున్నవాళ్ళ రక్షణలో
ఏమాత్రం అలికిడి లేకుండా ఉన్న
వీధిమొగలో జమ చేశారు

నీటిబర్రెల కాటపట్టయిన ఆ యేటి పక్కన
పొలిమేర్లలోని పిల్లలాడుకునే చోట

మా భూమి నాటకంలో వ్యవసాయ సంబంధాలు

కాత్యాయనీ విద్మహే
జ్యోతిరాణి

భూమి—మనుషులు శ్రమచేస్తే వాళ్ళ మనుగడకు అవకాశాన్నీ, అభివృద్ధినీ కలిగించే ధనధాన్యాది సంపదలను ఉత్పత్తి చేసిపెడుతుంది. అంతేకాదు. మనిషి శ్రమచేయటంనేర్చుకొనేంతవరకు కొండలు, అడవులు, నదులూ, ఖనిజాలు మొదలైన తన సంపద రూపాలనుండి ఉదారంగా పోషకాహార పదార్థాలను సమకూర్చి శ్రమించటానికి ప్రేరేపిస్తుంది. ఇన్నిరకాల సహజ వనరులతో సమస్త చరాచర వస్తు ఉత్పత్తి వికాసక్షయాలకు పరాయణస్థానంగావున్న భూమి ఉత్పత్తి సాధనంమాత్రమే కాదు. అనేక వనరుల మాతృకకూడా.

మానవుడు ప్రకృతితో నిత్యసంబంధంలోవుండి దాని స్వరూపస్వభావాలను అర్థంచేసుకొంటూ పరిణమించేక్రమంలో భూమికి వున్న ఈ ప్రత్యేకతను అవగాహన చేసుకొన్నాడు. అవగాహన చేసుకొన్నదాన్ని క్రమంగా ఆచరణలో పెడితే ఫలితంగా వ్యవసాయం అస్తిత్వంలోకి వచ్చింది. మానవనాగరకతా పరిణామంలో

అడవిజాడల రహస్యాన్నిలాగే ప్రయత్నంలో
హింసకుని నేర్పు నిజాయితీ రోషం ముందు
తలవంచింది
గుడ్డి వెదురు గోడలు ఆ కడవల్లెగుల్ని చూశాయి
తండ్రీ, కొడుకూ, భర్తా, సోదరుడూ అందర్నీ
ఊగిసలాడే చర్చి వెనకాల ఉన్న నదికి
తోలుకపోతున్నపుడు

ఇండ్లల్లో భయంకర హాహాకారాలు పర్గులెత్తినవి
అక్కడ పెతల్లీ మనుషులు మరో పవిత్ర యుద్ధం చేశారు
ఒక తీపి గొంతు చీకట్లోంచి పలికింది
'ఈ ఒడ్డు వెంటనే వరసగా నిలబడండి
చెప్పినట్లు చెయ్యండి, త్వరగా ఇళ్ళకు పోతారు'
వాళ్ళట్లే చేశారు, కింద ప్రవాహం ఎర్రగా మారింది

వ్యవసాయాన్ని కనుక్కోవటం విప్లవాత్మకమైనదశ. ఈ దశ తరువాతే మానవుడు సామాజిక జీవిగా స్థిరపడ్డాడు. సమాజాలను నిర్మించుకొంటూ మార్చుకొంటూ తదనుగుణంగా తానూ మారుతూ పురోగమించాడు సమాజాలు మారేక్రమంలో భూమికీ మనిషికీ మధ్యవుండే సంబంధాలు కూడా కొత్తరూపాలను తీసుకొన్నాయి, మధ్య యుగాల నాటికి 'భూమిమీదవ్యక్తిహక్కు' అనే భావన స్థిరపడి ఆచరణలో అది బలవంతులయిన కొందరి చేతుల్లో చిక్కుపడిన ఫలితంగా భూస్వామ్యవ్యవస్థ ఏర్పడింది. భారతదేశంలో రాచరికాలు, వాటిననుసరించి వచ్చిన జమిందారీ విధానాలు భూస్వామ్యవ్యవస్థను పటిష్ఠంచేశాయి. ఈస్టిండియా కంపెనీ పాలనలో జమిందారుల నుండి, భూస్వాముల నుండి వీలయినంత ఎక్కువగా పన్నుల రూపంలో డబ్బును రాబట్టటమే లక్ష్యమైనందున అది జమిందారులకు భూస్వాములకు మధ్య ఎటువంటి సంబంధాలున్నాయన్న విషయాన్ని పట్టించుకోలేదు. ఫలితంగా బ్రిటిషు పాలకులను తృప్తి పరచటమే ధ్యేయంగా జమిందారులు, భూస్వాములు భూమితో ప్రత్యక్ష సంబంధం వున్న రైతాంగాన్ని ఎంతగా పీడించాలో అంతగా పీడించి పన్నులు వసూలు చేశారు. ఇది క్రమంగా భూకేంద్రీకరణను మరింత పెంచింది.

తెలుగు దేశంలో సర్కారు ప్రాంతాలలో జమిందారీ భూస్వామ్య విధానాలుంటే తెలంగాణాలో జమిందారీ భూస్వామ్య విధానాలుంటే తెలంగాణాలో జమిందారీ భూస్వామ్య విధానాలకు పైన బ్రిటిషు వాళ్ళ తాబేదారుగా ప్రవర్తించే నిజాం సంస్థాన పరిపాలన వుండి. భారతదేశంలోని అన్ని సంస్థానాలలోకి నిజాం సంస్థానమే పెద్దది. సంస్థానంలో సగం ప్రాంతం తెలంగాణం. అంటే తెలుగు మాట్లాడే ప్రజలున్న ప్రాంతం మిగిలిన ప్రాంతంలో మరాఠీ కన్నడ ప్రాంతాలున్నాయి. ఈ సంస్థానంలో వ్యవసాయం కింద వున్న భూమి అయిదుకోట్ల ముప్పైలక్షల యెకరాలు. అందులో మూడుకోట్ల ఎకరాలు అంటే వ్యవసాయ భూమిలో అరవైశాతం ప్రభుత్వభూము శిస్తు వ్యవస్థకింద వుండేది. ఒకకోటి యాభైలక్షల ఎకరాలు అంటే ముప్పయ్యోశాతం జాగీర్దారీ విధానం కింద వుండేది. [1]మిగిలిన పదిశాతం భూమి నిజాం స్వంత కమతంగా వుండేది.

జాగీర్ ప్రాంతాలలో జాగీర్దార్లు, ఇజారాదార్లు, మక్తేదార్లు, ఈనాందార్లు, అగ్రహారీకులు అనే వివిధపేర్లతో హోదాలతో కొందరు వ్యక్తులు భూమిపై స్వామ్యం కలిగివుండేవారు. తమ అధీనంలో వున్న భూమిపై పన్నులను విధించి

వసూలు చేసే అధికారం వీళ్ళదే. వీరిలో కొందరు పన్నులవల్ల తమకు వచ్చే ఆదాయంలో స్వల్పభాగం సంస్థానానికి చెల్లిస్తుండేవారు మరికొందరు అసలేమీ చెల్లించవలసిన అవసరం కూడా లేదు. ఈ అధికారం వాళ్ళకు సాగులోవున్న అతిసారవంతమైన భూములను కబళించటానికి అవకాశమిచ్చింది. సర్వే సెటిల్‌మెంట్ సందర్భాలలో కొంత ఆర్థిక మాంద్యకాలంలో రైతులకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి ఆ అప్పుల కింద మరి కొంత భూమిని స్వాధీనం చేసుకొన్నారు. రైతులకు తెలియకుండానే వారి భూములను తమ పేరిట పట్టాచేయించుకోవటం ద్వారా కూడా వీరు భూములను ఆక్రమించుకొన్నారు. ఈ క్రమంలో అయిదు వేల ఎకరాలు మొదలుకొని లక్షయాభై వేల ఎకరాల వరకూ భూములను ఆక్రమించుకొన్న భూస్వామ్య కుటుంబాలు కొన్ని ఏర్పడ్డాయి.[2]

ఈ వ్యవస్థలో రైతులు తాము సాగుచేసుకొనే ప్రతి ఎకరం భూమికీ 15 రూపాయలు లేదా 10 బస్తాల నుండి 15 బస్తాల ధాన్యం శిస్తుగా చెల్లించాల్సివుండేది 1940 కి పూర్వం మొత్తం హైదరాబాదు సంస్థానపు రెవిన్యూ ఆదాయం 8 కోట్లయితే కేవలం 110 మంది భూస్వాములు ఏటా పదికోట్లు పన్నులరూపంలో వసూలు చేసిన సందర్భాలున్నాయి.[3]

వీటినిబట్టి రైతాంగంమీద పన్నులభారం ఎంతగాపడిందో అర్థమవుతుంది. దీనికి తోడు లెవీ సేకరణ, ప్రపంచమాంద్యం కారణంగా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవటం కష్టమైనందున పట్టణాలలో ప్రజల ఆహారపు అవసరాలను తీర్చటం కోసం ప్రభుత్వం లెవీ ఆర్డినెన్సును జారీ చేసింది. దీని ప్రకారం మాగాణి భూములపై ఎకరానికి 12 రూపాయల వరకూ శిస్తు చెల్లించే వారంతా తాము శిస్తుగా చెల్లించే ప్రతి రూపాయికి ఎనిమిది శేర్ల చొప్పున ధాన్యాన్ని లెవీ కింద డిపాజిట్ చేయాలి. మెట్టభూముల విషయంలో ప్రతి రూపాయికి నాలుగు శేర్ల చొప్పున జొన్నలుగానీ తదితరమైన ఏ ధాన్యమైనాగానీ లెవీగా చెల్లించాలి. ఈ విధంగా సన్నకారు రైతాంగం పండించే పంటలో అరవ వంతు లెవీ కింద ప్రభుత్వం స్వాధీనపరచుకొనేది. అయితే పెద్దపెద్ద భూస్వాములందరూ రాజ్యాంగ వ్యవస్థలో తమ అధికారాన్ని, పలుకుబడిని ఉపయోగించుకొని 'లెవీ' నుండి తప్పించుకోగలిగారు. భూమిశిస్తు భూస్వామే చెల్లిస్తున్నా లెవీ మాత్రం కౌలుదార్లే చెల్లించవలసివచ్చేది. లెవీ పథకం

కింద అధిక పంటలు పండించటానికై రైతులను ఉత్సాహపరచటం కోసం ప్రభుత్వం కల్పించే సౌకర్యాలుగానీ, లెవీ ధాన్యానికి ప్రభుత్వం చెల్లించే డబ్బుగానీ-భూస్వాముల ద్వారానే రైతాంగాన్ని చేరవలసిరావటం వల్ల రెండు విధాలుగా రైతాంగం నష్టపోయింది.[4] వాళ్ళకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు అందలేదు. తమ లెవీ ధాన్యానికి చెల్లింపులో అందలేదు. ఈ విధంగా తెలంగాణాలోని జాగీర్దారీ విధానం, శిస్తువిధానం, లెవీ విధానం భూకేంద్రీకరణను విస్తృతంచేసి, భూస్వాముల అధికారాలను పెంచి రైతాంగం స్థితిగతులను హీనం చేశాయి.

ఈ రకమైన భూస్వాముల నిరంకుశాధికారాలు వెట్టిచాకిరిని, అక్రమవసూళ్ళను భూస్వామ్యవ్యవస్థకు ముఖ్య లక్షణాలుగా ముందుకు తీసుకొని వచ్చాయి. గ్రామాలలోని వివిధ వృత్తులవాళ్ళు తమ తమ ఉత్పత్తులలో నిర్ణీతభాగాన్ని భూస్వాములకు ఉచితంగా ఇవ్వకోవలసి వుండేది. ఇంతేగాకుండా భూస్వాముల భూములలో, ఇళ్ళల్లో ఉచితంగా సేవలు చేయాల్సి వచ్చేది. భూస్వాముల ఇళ్ళల్లో జరిగే శుభాశుభకార్యాలన్నిటికీ కానుకలు సమర్పించుకోవలసి వచ్చేది. మొత్తంమీద జాగీర్దారీ విధానంలో భూస్వామ్య పాలనాపద్ధతి 'మా ఇంటికి వస్తే ఏం తెస్తావు? మీ ఇంటికి వస్తే ఏం పెడతావు' అన్న సామెతగా సాగింది.

ఈ తీవ్రమైన అణచివేత ప్రజలలో తిరుగు బాటుభావాన్ని రేకెత్తించి, వ్యవసాయ సంబంధాలను తమకనుకూలంగా పునర్నిర్మించుకోవటానికి రైతంగానికి ప్రేరణనిచ్చింది. దాని ఫలితంగానే ఆంధ్రభాషా సంస్కృతుల పరిరక్షణకై 1922 లోనే ఏర్పడిన ఆంధ్రజనసంఘం క్రమంగా వెట్టిచాకిరికి, అక్రమ వసూళ్ళకు వ్యతిరేకంగా పరిక్రమిస్తూ తెలంగాణా రైతాంగ పోరాట ఉద్యమాన్ని నిర్మించింది. ఆర్థిక పునాదితో ముడిపడి వున్న ఈ ఉద్యమం ఉపరితలాంశమైన సాహిత్యాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. తెలంగాణాలో భూస్వామ్య సంబంధాలకు వ్యతిరేకంగా క్రమంగా జడత్వాన్ని వదిలించు కొంటూ చైతన్యాన్ని పెంచుకొంటూ ప్రజలు నిర్మించుకొన్న ఈ ఉద్యమాన్ని ప్రతిఫలిస్తూ ఎన్నో నవలలు, కథలు, కవితలు, పాటలు, నాటకాలు వచ్చాయి. అట్లా వచ్చిన ఉద్యమ సాహిత్యంలో భాగమే —సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు కలిసి రాసిన — మాభూమి నాటకం. ఈ నాటక రచనాకాలం 1947. దీనికి భూమిక సామాజిక చారిత్రిక వాస్తవికత. కాబట్టే సమకాలీన వ్యవసాయ సంబంధాలనది ప్రతిభావంతంగా చిత్రించ గలిగింది.

II

తెలంగాణాలో జాగీర్దారీ విధానం భూ సంబంధాలలో పొద్దులేని అగాధాన్ని సృష్టించింది. దీనిని మాభూమి నాటకం కథాపరంగా వ్యక్తం చేస్తుంది. రెండవ అంకంలో పట్వారీ వీరారెడ్డి మొదలైన రైతులను గడీకి పిలిపించి లెవీ కట్టమని నిర్బంధించినప్పుడు వీరారెడ్డి 'ముందు ఆరువందల ఎకరాలున్న మీరు కట్టండి' (పు 30) అంటాడు. దానిని సమర్థిస్తూ సుభాన్ "ఆరు వందల ఎకరాలున్న మీరు, ఇరవై వేల ఎకరాలున్న మీదొరగారూ ముందు గట్టండి, తర్వాత మమ్మల్ని అడగండి" (పు 30) అంటాడు. ఈ మాటలను బట్టి చూస్తే జగన్నాధరెడ్డికి 20 వేల ఎకరాల భూమి, పట్వారీకి 600 ఎకరాల భూమి వున్నట్లు. పట్వారీ భూమికంటే దొర భూమి ముప్పయి రెట్లకు పైగా ఎక్కువ. దొరకు పట్వారికీ మధ్య భూ సంబంధాలలోనే యింత తేడావుంటే మామూలు రైతాంగం విషయం చెప్పనే అక్కరలేదు.

ఇక ఊళ్ళో పెద్దరైతైన వీరారెడ్డికి మాత్రం నాలుగెకరాల భూమివున్నట్లు— జగన్నాధరెడ్డి వీరారెడ్డిని పిలిపించి కులం ప్రాతి పదికగా సంఘంలో చీలికలు తెచ్చే ప్రయత్నం చేసినప్పుడు 'ఎన్నాళ్ళు తంటాలు పడతావ్ ఆ నాలుగెకరాలతో' (69) అని వెంకటాద్రివు అన్నమాటలను బట్టి స్పష్టమవుతుంది. దాదాసాహెబ్, రామిరెడ్డి, సుభాన్ తదితరులు వీరారెడ్డితో సమంగానో, కాస్త అటూయిటుగానో, అంత కంటే తక్కువ స్థితిలోనో వున్నవాళ్ళు. కాస్తో కూస్తో సొంత భూములున్నా అవి వాళ్ళ అవసరాలను పూర్తిగా తీర్చలేక పోవటం వల్ల మొత్తం మీద రైతులంతా భూస్వామి దగ్గర కౌలుదార్లే. లెవీ చెల్లించమని అడుగుతూ 'కౌలంటే పాలంటే దొరగారితో పని గనుక, ఏదోవిధంగా సర్దిచెప్పి కొన్నాళ్ళు నెట్టు కెళ్ళగలను గానీ లెవీ అంటే సర్కారుతో పని' అని వెంకటాద్రివు అనటం వల్ల,(27) మంగలి రాముడు సంఘంలో చేరుతానని వస్తే దేశ్‌ముఖ్ మనిషని అతన్ని అందరూ అనుమానించి నప్పుడు వీరారెడ్డి 'అతను దేశ్‌ముఖ్ ఇంట్లో చాకిరి జేస్తున్నాడు. మనం బైట పొలంమీద పండించివాడింట్లో బోస్తున్నాం' (48) అని అన్నమాటలవల్ల రైతులు కౌలుదార్లుగానే బతుకు ఈడ్చుకు పోవటం సూచితమవుతున్నది.

భూమి, పశువులు, వ్యవసాయపు పనిముట్లు రైతుకు కన్నబిడ్డలకంటే ఎక్కువ. కౌలుదారుకు భూమి దున్నే బాధ్యతేగానీ భూమిపైహక్కులేదు భూమిని

దున్నటానికైన ఉత్పత్తి సాధనాలు నాగండ్లు ఎద్లు మాత్రం అతనివే అయితే అవి కూడా అతని స్వంత సాధనాలుగా వుంటాయన్న గ్యారంటీలేదు. ఏదో ఒకపేరుతో ఏదో ఒకనాడు వాటిని కూడా తమవేనంటారు దొరలు. నాటకంలో రామిరెడ్డి గిత్త విషయంలో అదే జరిగింది. చెరువుకు నీళ్ళకు పోయిన ఎద్దును దొరగారి ఎద్దుల మందలో కలిపి తోలుకెళ్ళి దివాణపు ముద్దరేసి కొట్టంలో కట్టేసు కొన్నరు. బడితె గలవాడిదే బర్రె అన్నన్యాయం యథేచ్ఛగా కొనసాగిన లక్షణమిక్కడ కనబడు తుంది. ఈ రకమైన దోపిడీ దురాక్రమణల వల్ల ఉత్పత్తిసాధనాలకు నానాటికీ దూర మవుతూ రైతాంగం అనుభవించిన వేదన ఎద్దు పోయిందని చెప్తు రామిరెడ్డి 'ఇవ్వాళ పళ్ళెం కాడ కూసుంటే నోట్లోకి ముద్దబోలేదే' (42) అని అనటంలో స్పష్ట మవుతుంది.

భూమి పరిణామం పెరిగేదికాదు. అందువల్ల ఒకడిదగ్గర భూమి ఎక్కువగా పోగుపడుతున్నదంటే ఆ నిష్పత్తిలో మరొకడిదగ్గర భూమి తరిగిపోతున్నదనే అర్థం. ఐశ్వర్యం అభివృద్ధి అయ్యే క్రమంలో మరోవైపు దారిద్ర్యం కూడా పెరిగిపోతూనే వుంటుంది. తెలంగాణాలో ఒక్కొక్క భూస్వామి దగ్గర లక్షల ఎకరాలభూమి జమ కావటంలో మూలసూత్రం ఇదే. ఈ మూలసూత్రాన్ని మాభూమి నాటకం విశదంగా వ్యక్తంచేసింది. రామిరెడ్డి గిత్తను దొరగారి దివాణానికి తరలించుకొని పోయిన విష యాన్ని గురించి మాట్లాడుకొనే సందర్భంలో 'ఇటువంటి వింకెన్ని చేస్తాడో' అని సీతమ్మ ఆరిదోళన పడుతుంది. దానికి సమాధానంగా కమల 'చేయాలిసిన పనులన్ని ఇదివరకే చేశాడు' (42) అంటుంది. దానికి సమర్థకంగా 'అవును....నిరుడేం చేశాడు.... మన సుబ్బయన్నగారి బీట్లో వాడి మందను దోలి అదేమిటంటే ఇది నా బీడే అనలా' అని వీరారెడ్డిచేత 'సరకారి పోరంబాకలకు కూడా కంపగొట్టి ఆకట్టు కొన్నాడుగా' అని యల్లమందచేత అనిపించి రచయితలు తెలంగాణాలో భూస్వాముల భూఆక్రమణ ఎంత యథేచ్ఛగా సాగిందో చూపించారు అట్లాగే అవసరాలకు అప్పు లిచ్చి వడ్డీలతో దానిని పెంచి బాకీ చెల్లుబాటు కింద భూములను ఆక్రమించుకోవటం కూడా ఎక్కువే. పంగలి రాముడి మాన్యం విషయంలో జరిగిందదే. రాముడు తన పెళ్ళి ఖర్చుల కోసమని పాతిక రూపాయలు అప్పు తీసుకొంటే అయిదేళ్లలో అది పెరిగి వందదాటి అతని మాన్యాన్ని మింగేసింది. ఈ విషయాన్ని గురించి మాట్లాడు కొనే సందర్భంలోనే యల్లమంద 'మాన్యాలేనా బంచరాయి కూడా నాదే అని లాక్కు

న్నాడుగా' (48) అంటాడు దొర నుద్దేశించి. అప్పులకింద వుళ్ళోవాళ్ళకు కాస్తో కూస్తో వున్న పొలాలనేకాదు- బంజర్లను కూడా దొరలు స్వంతభూములుగానే చేసుకొన్నారు. ఇన్నిరకాల అక్రమ ఆక్రమణల ఫలితంగానే జగన్నాధరెడ్డిలాంటి దొరలకు వేల యకరాలు స్వంతభూములుగా జమ అవుతున్నాయన్న చైతన్యం వీరారెడ్డిలాంటి వాళ్ళకున్నది. ఐశ్వర్యాన్ని పెంచే సూత్రాన్ని ఆ రకంగా తెలుసుకొన్నారు కనుక వాళ్లు ఆ సూత్రాన్ని తమ ప్రయోజనాల కనుకూలంగా మార్చాలనుకున్నారు. 13

భూసంబంధాలలో భాగమే అయిన వెట్టి, దండుగలు, అప్పులు మొదలైనవి కూడా ఈ నాటకంలో ప్రస్తావించబడ్డాయి. భూసామ్య విధానాన్ని అనుసరించి అస్తిత్వంలోకి వచ్చిన అత్యాచారాలివి. 'వెట్టి అంటే నిర్ణీతమైన పనిగంటలు లేకుండా, నిర్ణీతమైనకూలిరేట్లులేకుండా దొరలవ్యవసాయపు పనులలోనూ ఇంటిపనులలోనూ అట్టడుగు వర్గాలవారు ముఖ్యంగా వృత్తిపనులవారు కుటుంబాలకు కుటుంబాలుగానే పాల్గొన వలసిననిర్బంధ పద్ధతి.' 14 ఇటువంటి వెట్టికిగురయిన వృత్తిపనివాడుగా మంగలిరాముడు కనబడతాడు. దొరగారి బాకీ కింద అతని మాన్యం పోయి అతను దొరగారికి వెట్టివాడయ్యాడు. కోడికూసినప్పుడనగా లేచిసద్దిదాగి గడీకిపోయిన రాముడు పడిజాముకిగానీ కొంపకుచేరని రాముడుగడీలో రోజుకు పదిహేను పదహారు గంటలు పనిలో వుంటాడన్నమాట.

వెట్టివంటి మరో దోపిడీ విధానం వంతులు. ఇవి ప్రధానంగా గ్రామంలోకి వచ్చే ప్రభుత్వ అధికారులకోసం యివ్వవలసిన వస్తువులకు సంబంధించినవి. గడీకి పోలీసు అమీన్ వస్తే వేటపోతుకోసం దేశ్‌ముఖ్ రౌడీమస్తాన్ యల్లమంద గొర్రెలమీదికి వచ్చిపడి దేవరపోతును ఎత్తుకెళ్లటం, ఊళ్ళోకి దేశ్‌ముఖ్ పోలీసు బలగాన్ని పిలుచుకొచ్చుకొంటే వాళ్ల తిండికి కావలసిన సమస్త వస్తువుల జాబితారాసి కోమటింటికి పంపించటం- ఆ సరుకునంతా ఆ వ్యాపారి వీళ్ళకు ఉచితంగానే పంపవలసి రావటం ఇటువంటివే. దొరగారి ననుసరించి పట్వారీ, అతను తన కూతురి పెళ్ళికని ఇంటికి ఐదు రూపాయల చొప్పున వసూలు చేస్తాడు. బకాసురుడికి ఏకచక్రపురవాసులు ఇల్లు వరసన రోజుకొక మనిషిని, రెండెనుపోతులను బండెడు అన్నాన్నీ పంపించేవాళ్ళన్న కథలాగుంది వ్యవహారం.

భూస్వామ్య ఆర్థిక విధానం రైతులను కౌలుదార్ల స్థాయికి నెట్టి అంతటితో వూరుకోదు. ఇష్టం వచ్చినట్లు కౌలురేట్లను వసూలు చేయటంద్వారా, వాళ్ళ ఉత్పత్తి సాధనాలను వాళ్ళు సరియైన సమయంలో ఉపయోగించుకోకుండా చేయటంద్వారా వాళ్ల కనీసావసరాలను వాళ్ళు తీర్చుకోలేని స్థితికి దిగజారుస్తుంది. పట్వారీ వెంకటార్రావు రైతులను గడీకి పిలిపించి లెవీ కట్టమని నిర్బంధించినప్పుడు రైతులు తమకు పంటలు పండలేదు కనక కట్టమంటారు. పంటలెందుకు పండలేదంటే- చెరువులో నీళ్లుండవు కనుక- నీళ్ళెందుకుండవు? చెరువు మెరకేసింది కనుక. మెరకేసిన చెరువు నెవరు తవ్వించాలి? దేశ్‌ముఖ్ తవ్వించడు. పైగా ఆ మెరక వేసినంత మేరకు తాను దున్ని పైరు వేసుకొంటాడు. ప్రభుత్వమైన నిజామూ తవ్వించదు. పోనీ మెట్టపైర్లు వేద్దామంటే వర్షం కురిసి నేల పసరుపదనుగా వున్నప్పుడు దేశ్‌ముఖ్ రైతులను తన సొంత పొలంలోకి వచ్చి పని చేయవలసిందిగా బలవంతపెడతాడు. రైతులకది వృధా శ్రమే, కానీ పోకతప్పదు. అందువల్ల రైతులు ఆ జొన్న సజ్జ పైర్లను కూడా పదనుపోయిన తరువాత వేస్తారు. అందువల్ల అవీ పండవు. నాటకంలో రైతుల విషయంలో జరిగిందిదే. ఫలితంగా రైతులకు ఫలసాయంగా వచ్చే పంట వాళ్ల అవసరాలను తీర్చలేదు. వీటికితోడు పెళ్ళిళ్ళని, చావులని వాటికి సంబంధించిన సాంఘికాచారాల అవసరాలకు ఈపండిన కాస్తా అసలే సరిపోదు. ఫలితంగా రైతులు అప్పులు చేయటం అనివార్యమవుతుంది. సుభాన్, పట్వారీ వెంకటార్రావు దగ్గర తండ్రి చనిపోయినప్పుడు అంటే కథాకాలానికి ఆరేళ్ళక్రితం బస్తా గింజలు నాగుకు తీసుకొన్నాడు. ఈ ఆరేళ్ళలో బాకీకింద సుభాన్ వెంకటార్రావుకి 14 బస్తాల ధాన్యం జమ కట్టాడు. యింకా 14 బస్తాల బాకీ మిగిలేవుందంటాడు వెంకటార్రావు. ఇట్లా తెలంగాణాలో రైతాంగంచుట్టూ ఆర్థిక దిగ్బంధపు వల ఒక పథకం ప్రకారం నేర్పుగా అల్లబడిన విధానాన్ని 'మాభూమి' నాటకం దాని వాస్తవిక మూలాలనుండి ప్రతిఫలించింది. వ్యవసాయపు పన్లను వూరివారితో వుచితంగా చేయించుకోవటం భూమికి కావలసిన ఎరువును ఇంటికి బండి చొప్పున నిర్బంధంగా వసూలుచేయటం ఈ మొదలైనవన్నీ కలిపి దొరకు ఖర్చును ఆదాచేసి ఆస్తులను పెంచాయి. తత్ఫలితంగా తెలంగాణాలో దొరలకు భూమితోవున్న సంబంధాలకు రైతాంగానికి భూమితోవున్న సంబంధాలకు మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడింది. ఈరకంగా దొరలకు రైతాంగానికీ మధ్య శత్రు వైరుధ్యం ఏర్పడి కొనసాగింది.

వ్యవసాయానికి ఎక్కువ భూమి లేకపోవటం, ఉన్నదాన్లో కూడా వ్యవసాయం సక్రమంగా సాగించటానికి వీల్లేకుండా ఊళ్ళో దొరలు, పట్వారీలు కల్పిస్తున్న ఆటంకాలు, ఇవన్నీ కలిసి తమకు రెండుపూటలా సరిఅయిన తిండి సౌకర్యాలనే కల్పించని పరిస్థితులలో లెవీ ఎక్కడ్నించి తెచ్చి చెల్లించాలో తెలంగాణా రైతాంగానికి అర్థం కాలేదు. అటువంటి అనివార్య పరిస్థితులలో అప్పటికే అక్రమ వసూళ్ళకు, వెట్టికి వ్యతిరేకంగా ఉద్యమించటానికి సంగాలుగా సంఘటితమవుతున్న రైతాంగం నిర్బంధ లెవీకి వ్యతిరేకంగా ప్రతిఘటనా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమమే మాభూమి నాటకంలో సంగంగా ఏర్పడ్డ రైతుల మొట్టమొదటి ప్రతిఘటనా కార్యక్రమంగా కనబడుతుంది. పట్వారీ రైతులను పిలిపించి లెవీ విషయం ప్రస్తావిస్తే రైతులు ఎదిరించి నిలుస్తారు. క్రిందటి సంవత్సరం జమకట్టిన లెవీ ధాన్యపు డబ్బు సంగతి అడుగుతారు. లెవీ ధాన్యానికి సర్కారిచ్చిన డబ్బును రైతులకు ఇయ్యాలి. దేశముఖ్‌లు యివ్వరు. యుద్ధ నిధికి యిచ్చామంటాడు వెంకట్రావు. పట్వారీ మళ్ళీ లెవీ విషయం రొక్కించి అడిగితే క్రిందటి సంవత్సరపు లెవీ ధాన్యపు డబ్బే కళ్ళజూడని రైతులు కడుపు మండి వందల వేల ఎకరాల భూములున్న పట్వారీ, దొర- ముందు ఆ లెవీ ధాన్యమేదో జమకట్టి తరువాత తమని అడగమంటారు. ఇది గ్రామాధికారుల అహంకారం మీద ప్రజలు కొట్టిన మొదటి దెబ్బ. జీతగాళ్ళందరూ సమ్మె కట్టటం దెబ్బమీద దెబ్బ అయింది. ముందుగా డబ్బివ్వకుండా సరుకుల నియ్యనని ఊళ్లో వర్తకుడనటం, అతనికి అనుకూలంగా బడితలు పుచ్చుకొని పనిమంది నిల్చోవటం మరీ పెద్ద దెబ్బ అయింది

అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించి రైతాంగ ప్రయోజనాల కోసమై ఈ ఉద్యమంలోకి పేదలంతా జాతి మత భేదంలేకుండా కలిసి వచ్చిన నాటి సామాజిక వాస్తవికతను ఈ నాటకం అచ్చమైన మానవసంబంధాల పునాదినుండి ఆర్ద్రంగా ప్రతిఫలించింది. అందుకనే రామిరెడ్డి, వీరారెడ్డి దాదాసాహెబు సుభాన్ యల్లమంద, కమల, సీతమ్మ అందరూ పరస్పర ప్రేమానురాగాలు స్నేహ హృదయాలు కల ఒకే కుటుంబ సభ్యులుగా కనబడతారు. వీళ్ళంతా తాము ఏవర్గానికి చెందినవాళ్ళో ఖచ్చితమైన చైతన్యం వున్నవాళ్ళు కనుక దేశ్‌ముఖ్, పోలీసు అమీన్ – హిందూ ముస్లిమ్ మత ప్రాతి పదికల మీద ఉద్యమాన్ని చీల్చాలని చూస్తే ఎవరూ లొంగ లేదు. మామూలు

గృహిణిగా జీవితం ప్రారంభించి వీరారెడ్డి సాహచర్యంలో భూమికోసమైన ప్రజా పోరాటాల గురించి తెలుసుకొని 'మీతోపాటే మేము' అన్న చైతన్యాన్ని చూపిన సీతమ్మ పోలీసు బలాలు వచ్చి ఊరి మీద పడనున్నాయని తెలిసిన సందర్భంలో 'పదండినాయనా, పదండి, ఎన్నాళ్ళు బతుకుతాం ఈ పాడుబతుకు, ఎప్పుడైనా చావా లిసిందే (85) నని అందర్నీ ప్రబోధించటం 'భూమి, అబలలు అని వ్యవహరింప బడేవాళ్ళను, వంటింటికి పరిమితం చేయబడ్డ జీవితాలను కలవాళ్ళను కూడా ఎంతగా కుదిపి నిలబెడుతుందోనన్న విషయాన్ని సూచిస్తుంది.

లెవీధాన్యం ఇవ్వకుండా 'జన్మహక్కు' లకోసం పోరాడాలన్న విషయం వ్యవసాయ సంబంధాలలో ముందుకు వచ్చి నిలిచినప్పుడు సాయుధమైన ప్రభుత్వ యంత్రాంగంతో తలపడాల్సిన పరిస్థితులలో 1946 లో రైతులకు ఆత్మరక్షణ కొరకు శిక్షణ ఇవ్వబడింది. ఆత్మరక్షణకోసం ఆయుధం పట్టటంగురించిన ప్రస్తావన నాటకంలో సుభాన్ ద్వారా వస్తుంది. ఆత్మరక్షణ జీవితావసరమన్న విషయాన్ని ఏసిద్ధాంతాల ప్రబోధం లేకుండానే యల్లమంద అతిసహజంగా భావించటం కూడా ఇక్కడ కనబడుతుంది. ప్రజలు సాయుధులై — కర్రలు, వడిసెలలు, రాళ్ళు, రోకలి బండలు, కారప్పు ముంతలు — ఉపయోగించి ఊళ్ళోకి వచ్చిన పోలీసు బలగాన్ని, దేశముఖును వూరి నుండి వెళ్ళగొట్టి భూములను ఆక్రమించుకొన్నారు.

దొరలు జిల్లా కేంద్రాలకు పారిపోయారు, ప్రజలు భూములనాక్రమించు కొని, పంచుకొని 'దున్నేవారిదే భూమి హక్కు' ని ప్రతిపాదించి ప్రాణం బోయినా భూమి వదలమని నినదించారు. అయితే వ్యవసాయ సంబంధాలను మెరుగు పరచుకోవటంలో ఇది ప్రజలు సాధించిన తొలివిజయం మాత్రమే. ఈ విజయాన్ని ఎంతకాలం నిలుపు కోగలమా అన్న అనుమానం ప్రజలకు రాకపోలేదు. ఊళ్ళోనుండి పారిపోయిన దొర నుద్దేశించి యల్లమంద 'ఆపుదనట్టపోడు ఆడిదారినిఆడుపోయిండుగా' అంటే వీరారెడ్డి 'అప్పుడే ఎక్కడ బోయాడు? వాడు జేయాల్సిన కుట్ర అంతా చేస్తూనే వుంటాడు. పట్నం కూడ పోయి ఈ సారి మిలటరీనే తీసుకొస్తాడు. అవసరమైతే ఇంకా తెల్ల సైన్యాన్ని కూడా దింపుతాడు' (93) అనటంలో ఆ అనుమానమే ధ్వనిస్తుంది. ఆ అనుమానం నిజమైంది కూడా. 1946 చివరలో నిజాం ప్రభుత్వసాయుధ బలాల సహాయంతో దొరలు మళ్ళీ ఊళ్ళల్లోకి ప్రవేశించారు. తమ అధికారాన్ని కొన

సాగించారు. దానితో ఉధృతం తగ్గినట్లే కనిపించిన ఉద్యమం 1947 మధ్యకాలంలో అంతిమ విజయం కోసం సమధికోత్సాహంతో ముందుకు వచ్చింది. ఫలితంగా ప్రజలు గ్రామరాజ్యాలు నెలకొల్పు కొని గ్రామపరిపాలన సాగించుకొన్నారు. 3000 గ్రామాలలో గ్రామరాజ్యాలు స్థాపించుకొని 10 లక్షల ఎకరాల భూమిని పంచుకొన్నారు ప్రజలు. 1946 మధ్యకాలం నుండే నైజాం సంస్థానాన్ని స్వతంత్ర భారతదేశంలో విలీనం చేయటానికి నిజాంతో రాజీప్రయత్నాలు జరుగుతున్నా అవి ఒకంతట ఫలితానికి రాకపోవటం వల్ల 1948 సెప్టంబరులో యూనియన్ సైన్యాలు తెలంగాణా లోకి ప్రవేశించాయి. నిజాం లొంగి పోయిన తరువాత రెండు జిల్లాలకు పైగా జరిగిన భూమి పంపకాలను కాదని అభూమి రైతులు ఆక్రమించు కోవటానికి ముందు ఎవరి అధీనంలో వుందో వాళ్ళకు అప్పగించెయ్యాలని, ఆతరువాత కాంగ్రెస్ ప్రభుత్వమే భూములను పంచుతుందని ప్రచారం చేయబడింది.

నిజానికి జాతీయోద్యమంలోకి సామాన్య జనాన్ని అధిక సంఖ్యలో సమీకరించాలనుకొన్నప్పుడు మౌలికమైన భూసంబంధాలలో సంస్కరణల విషయాన్ని ముందుకు తీసుకురావటం కాంగ్రెసుకు అనివార్యం అయింది. దానితో కాంగ్రెసు భారతజాతి సర్వస్వతంత్రం కావాలంటే జమిందారీ విధానం రద్దయి దున్నేవాడికి భూమిమీద హక్కు లభించాలని సైద్ధాంతికంగా అంగీకరించింది. అందువల్లనే తన కార్యక్రమాలలో భూస్వామ్యవిధానాన్ని రద్దుచేయటానికి అధికతర ప్రాముఖ్యమిస్తానని పేర్కొంది.[15] 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాంగ్రెసు ప్రభుత్వాన్నేర్పరచింది. నష్టపరిహారం చెల్లించే ప్రాతిపదిక మీద 1948 నుండి 1954 వరకు మొత్తం ఆరు సంవత్సరాల మీద అన్ని రాష్ట్రాలలోను జమిందారీ విధానం రద్దుకోసం చట్టాలు రూపొందించబడ్డాయి. ఈ క్రమంలో హైదరాబాదు రాష్ట్రం 1949లో జమిందారీ రద్దు చట్టాన్ని ఆమోదించింది.

ఈ చట్టం వలన పన్ను వసూలు అధికారం జాగిర్దారు నుండి ప్రభుత్వానికి మారింది. కొంతమేరకు జాగీర్దారు విశృంఖల దోపిడీ విధానాలనుండి రైతాంగానికి విముక్తి లభించింది. కానీ భూకేంద్రీకరణ, భూమితో ప్రత్యక్ష సంబంధంలేని సంపన్నవర్గం యథాతథంగానే కొనసాగుతున్నాయి. అసలు ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దటంలోగానీ, కౌల్దారు జీవితానికి రక్షణ కల్పించటంలోగానీ ఈ

చట్టం ఏ ప్రభావాన్ని చూపలేకపోయింది. ఈ పరిస్థితిలో హైదరాబాదు రాష్ట్రంలో 1949లో వ్యవసాయ సంస్కరణల కమిటీ ఒకటి ఏర్పడింది. ఈ కమిటీ చేసిన సిఫార్సుల ననుసరించి 1950లో హైదరాబాద్ రాష్ట్రం కౌల్దారీ చట్టాన్ని రూపొందించింది. ఈచట్టప్రకారం 6సంవత్సరాలు వరుసగా కౌలుచేసిన రైతు 'రక్షిత కౌలుదారు'గా గుర్తింపబడతాడు. కౌలుదారును యథేచ్ఛగా తొలగించే హక్కు పరిమితం చేయబడింది. కౌలుదారు తాను కౌలు చేసుకొనే భూమిని యజమాని నుండి సులభమైన, సరళమైన నిబంధనలకు లోబడి కొనుక్కునే హక్కును ఈ చట్టం కల్పించింది

ఈ చట్టంద్వారా ఆరు లక్షల మంది కౌలుదార్లు రక్షిత కౌలుదార్లుగా ప్రకటించబడ్డారు. దానికి సంబంధించిన సర్టిఫికెట్లు తయారు చేయబడ్డాయి. ఈ రక్షిత కౌలుదార్లు సాగుచేస్తున్న భూమి హైదరాబాదు రాష్ట్రంలో సాగులో వున్న భూమిలో 4వ వంతు [5] 'దున్నేవాడిదే భూమి హక్కు' అన్న నినాదంతో ముందుకు వచ్చిన రైతాంగ పోరాటాన్ని అణచివేసిన ప్రభుత్వం ఈ చట్టంద్వారా దున్నేవాడికి కొన్ని రాయితీలు యిస్తున్నానన్నది. అయితే చిత్తశుద్ధి లోపించిన ప్రభుత్వ చర్యలవల్ల వాటి ఫలితాలు కూడా రైతాంగానికి అందుబాటులోకి రాకుండా పోయాయి. అదీకాక ఈ చట్టం కౌలుదార్లు చైతన్యవంతులై పోరాటమార్గంలో సాధించుకొన్నది కాదు; పెద్దవాళ్లు 'సానుభూతి'తో 'దయ'తో ఆలోచించి అట్టడుగు వర్గాలవాళ్ళ సంక్షేమం కోసం చేసిన చట్టమిది. అందువల్ల ఈ చట్టాలు రూపొందించబడ్డట్లుకూడా కౌలుదార్లకు తెలియదు. ఒకవేళ తెలిసినా, చట్టాన్ని అమలుపరచాల్సిన స్థానిక ఉద్యోగి వ్యవస్థయొక్క భూస్వామ్య అనుకూల విధానంవల్ల కౌలుదార్ల హక్కులు ఆచరణలో అమలుకు రాలేదు. ఎక్కడయినా ఒక ఉద్యోగి నిజాయితీతో చట్టాన్ని అమలుపరిచే ప్రయత్నం చేస్తే భూస్వామ్య వ్యవస్థకు ప్రభుత్వంమీద ఉన్న పట్టువల్ల- ఏ దూర ప్రాంతాలకో బదిలీ చేయించబడేవాడు. కౌలు వ్యవహారాలు కాయితాలమీద వుంటే కౌలుదారుకది కొన్ని హక్కులను యిస్తుంది కనుక దానిని ఎగర్కొట్టటం కోసం భూస్వాములు 'పరస్పర వ్యక్తిగత నమ్మకాల' మీద కౌల్దారీ ఏర్పాట్లకు సిద్ధమయ్యారు. కాకపోతే కౌలు కాగితాలు ఏడాదికొకసారి మార్చివ్రాస్తూ, కౌలుదార్లు ఏనాటికీ రక్షిత కౌలుదార్లుగా కాకుండా జాగ్రత్తపడ్డారు. ఫలితంగా రక్షిత కౌలుదార్లుగా ఆరులక్షల మంది లెక్కల్లో కనపడ్డప్పటికీ ఆచరణలో ఆ ఫలితాలను పొందింది చాలా తక్కువ

మంది. అరకంగా కౌల్దారీ చట్టం ఆచరణ క్రమంలో భూస్వామ్య సంబంధాలలో మౌలికమైన మార్పేదీ చేలేకపోయింది.9

భూస్వాముల, ధనికరైతుల 'భూదాహం' వలన స్వంతభూమిని కోల్పోయిన భారత రైతాంగం ప్రాథమిక అవసరాలు తీర్చటం కోసం భూమి యాజమాన్యం విషయంలో గరిష్ఠ పరిమితినేర్పరచవలసిన అవశ్యకతను సూత్రప్రాయంగా అంగీకరించి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 1950 చివరి నుండి భూగరిష్ఠ పరిమితి చట్టాలను రూపొందించటం మొదలు పెట్టాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1961లో ఒకసారి 1973 లో రెండవసారి భూ పరిమితి చట్టాలు చేయబడ్డాయి. అయితే ఈ రెండు చట్టాలు కూడా భూసంపిణీలోని అసమానతలను ఏమీ తగ్గించలేదు. ప్రభుత్వం భూసంస్కరణల చట్టాలు ఆమోదించిన వెంటనే, అమలులోకి రాకముందే భూ యజమానులు వాటిని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాలలో కేసులు వేయటం జరిగింది. ఆ కేసులు విచారణకు వచ్చి తీర్పులు వచ్చేలోగా—ఆ గందర గోళపరిస్థితులు చక్కబడేవరకు భూస్వాములు చట్టంలో వున్న లొసుగులవల్ల రకరకాల మార్గాలనవలంబించి తమ భూములను పోగొట్టు కోవలసిన అవసరం లేకుండా జాగ్రత్త పడ్డారు. ఫలితంగా రెండున్నర ఎకరాల కంటే తక్కువ స్వంత కమతం వున్నవాళ్ళ సంఖ్య 1960–61 లలో 30. 09 శాతం అయితే అది 1970–71 నాటికి 50.6 శాతానికి పెరిగింది. 1964–65 లలో 54, 700 ఎకరాలు మిగులు భూమిగా ప్రకటించబడితే 1970 లో అది 15 లక్షల ఎకరాలకు పెరిగింది. అయితే ఆనాడూ ఈనాడూ కూడా ఆ భూములను స్వాధీన పరచుకొనే ప్రయత్నమేదీ జరగలేదు. అంతో యింతో స్వాధీనం చేసుకొన్నా దాని పంపిణీ సంగతి పట్టించు కోలేదు. నిజంగా ఈ చట్టాలను అమలు చెయ్యాలన్న కోరికగానీ, రాజకీయ చిత్తశుద్ధి గానీ లేకపోవటం వలన ప్రభుత్వం భూ సంస్కరణల చట్టాలను అమలు పరిచే ప్రయత్నం చేయలేదు. ఫలితంగా శ్రీధనం పేరుతోనూ, సహకార వ్యవసాయక్షేత్రాల పేరుతోనూ చాల వరకు భూమిని భూ పరిమితి చట్టంకింద పోకుండా చూసుకోగలిగారు భూస్వాములు.

బినామీ ట్రాన్స్‌ఫర్లు కూడా ఇందుకు తోడ్పడ్డాయి. వీటివల్ల స్వంత భూములున్న వాళ్ళ సంఖ్య పెరిగినట్లు రికార్డులలో చూపబడింది. భూగరిష్ట పరిమితిచట్టం విధించిన నియమాలకు లోబడే భూకమతాలు వున్నట్లు కూడా చూపబడింది. కానీ వాస్తవానికి భూస్వాముల భూవిస్తీర్ణత ఏమాత్రం తగ్గలేదు. భూసంబంధాలలో ఏమాత్రం మార్పు రాలేదు. భూసంబంధాలలోని అగాధం యధాతథంగా కొనసాగుతునేవున్నది. కనుకనే రైతాంగం ఈ భూవ్యవసాయసంబంధాల పట్ల తీవ్రంగా అసంతృప్తి చెందుతున్నది. ఆ అసంతృప్తే జ్వాలలై లేచి అప్పుడు శ్రీకాకుళంలో ఇప్పుడు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో మళ్ళీ వ్యావసాయిక విప్లవాగ్నిని రగిల్చింది. భూమి కోసం, భుక్తికోసం అయిన జీవన్మరణ పోరాటం నేడు భారతదేశంలో నడుస్తున్న చరిత్ర.

పాద సూచికలు :

1. వివరాలకు చూడు : ఆంధ్రప్రదేశ్ దర్శిని (1976) పు : 160
2. పుచ్చలపల్లి సుందరయ్య – వీరతెలంగాణా విప్లవ పోరాటం – గుణపాఠాలు (1975 మే) పు : 19.
3. పైదే – పు : 19, 20.
4. పైదే – పు : 561
5. A. M. Khurso – Economic & Social effects of Jagirdari Abolition and Land reforms in Hyderabad – (1958) P: 21
6. పైదే పు : 44, 45

13 వరవరావు – తెలంగాణా విమోచనోద్యమం–తెలుగు నవల (1983) పు: 186

14. పైదే, పు : 268.

15. Uppala (Ed) Economic Problems of India – P; 131

నడుస్తున్న చరిత్ర :

అడవి విహారీ లారీ !

నక్సల్బరీ తర్వాత, ముఖ్యంగా కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటాల తర్వాత విప్లవకారుల మీద, ప్రజల మీద దౌర్జన్యం చేసే పని లేకపోతే తెలంగాణలో పోలీసు శాఖ పూర్తిగా నిరుద్యోగంలోకి వెళ్ళి పోవలసి ఉండేదని, నెలకోసారి మామూళ్ళు అడుక్కోవడం తప్ప వాళ్ళకింకే పనీ ఉండేది కాదని కొందరు వెలిబుచ్చుతున్న అనుమానం నిజమే అయి ఉండాలి. ప్రభుత్వాల మార్పులూ, ఎన్నికలూ కూడా పోలీసులను విప్లవకారుల, ప్రజలపట్ల దమనకాండను అమలు చేయడం నుంచి తప్పించ లేకపోయాయి తెలంగాణలోనే కాదు, రెండువందల కిలోమీటర్లవతలి గోదావరి సీమలోని నర్సీపట్నం, రాజ ఒమ్మంగి, కృష్ణదేవి పేట, అడ్డతీగల పోలీసుస్టేషన్లు కూడ ఈ కారణం వల్లనే ఆరు దశాబ్దాల కిందటి సంచలనాన్ని మళ్ళీ ఇవాళ పొందుతున్నాయి. అల్లూరి సీతారామరాజు రోజుల్లో తమ దమనీ నీతిని చెలాయించిన ఈ పోలీసు స్టేషన్లు ఆరు దశాబ్దాల దీర్ఘనిద్ర (మామూళ్ళ వసూలు, మామూలు దౌర్జన్యాలు వంటి ప్రజల పాలిటి పీడకలలు పోలీసుల నిద్రలో కలలే తప్ప మెలకువలు కావు) తర్వాత మళ్ళీ అచ్చువైన మెకం లాగ ఒళ్ళు విరుచుకుంటున్నాయి.

ఈ పోలీసు జాగృతిని, దాని ఫలితాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తే రాష్ట్రంలోకెల్లా సంపన్నమైన ఈ గోదావరీతీరాన అత్యధిక సంఖ్యాకులు ఎంత దారిద్ర్యంలో, దోపిడీలో మగ్గి పోతున్నారో, ఆ పీడనను తొలగించు కోవడానికి వాళ్ళు చేస్తున్న సంఘటిత, సామూహిక ప్రయత్నం ఎంత నిరంకుశంగా అణచి వేయబడుతున్నదో అర్థమవుతుంది.

తూర్పుగోదావరి జిల్లాలోని ఎల్లవరం తాలూకా, విశాఖ జిల్లాలోని చింతపల్లి తాలూకా రెండూ పూర్తిగా ఏజన్సీ ప్రాంతాలు. అడవులు ఎక్కువ. ఈ అడవులలో ప్రధానంగా టేకు, వెదురు, చింత చెట్లు ఉన్నాయి. 1839 చ. కి. మీ. విస్తీర్ణం ఉన్న ఎల్లవరం తాలూకాలోని 315 జనావాస గ్రామాలలో 95,788 మంది, 2478 చ. కి. మీ. విస్తీర్ణం ఉన్న చింతపల్లి తాలూకాలోని 439 జనావాస గ్రామాలలో 1,06,802 మంది నివసిస్తున్నారు. వీరిలో మూడింట రెండు వంతుల మంది షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారు. అందులోను కొండ రెడ్లు, కొండ

దొరలు, కొండ కమ్మర్లు, కోయదొరలు, కోదులు, సేనాపతులు, వాల్మీకులు, పెనికలు, దేవంగులు మొదలయిన గిరిజనులే అధిక సంఖ్యాకులు.

రెండు తాలూకాలలోను వ్యవసాయం జీవనాధారంగా గలవారు దాదాపు ౮౦ శాతంమంది ఉన్నారు. అడవులు, పశువుల పెంపకంపై ఆధారపడి జీవించే వారి సంఖ్య అధికార లెక్కల ప్రకారం రెండు శాతానికి లోపే అయినప్పటికీ వ్యవసాయం జీవనాధారంగా గలవారిలో అధిక సంఖ్యాకులు వెదురు పనుల కోసంగాని మరో రూపంలోగాని అడవులపై ఆధారపడుతున్నవారే.

ఈ రెండు తాలూకాలలోను పట్టణం అని చెప్పదగ్గ ఊరు ఒక్కటి కూడా లేదు. ఎల్లవరం తాలూకా మొత్తం మీద నాలుగే నాలుగు గ్రామాలకు విద్యుచ్ఛక్తి సదుపాయం ఉంది. వైద్య సదుపాయంకూడ అంతే. జిల్లా అంతటికీ కలిపి చిన్నవిగాని, పెద్దవిగాని 200 వరకు ఆస్పత్రులుండగా ఎల్లవరం తాలూకాలో వంద చదరపు మైళ్ళకు కూడా ఒక్క ఆస్పత్రిలేదు. జిల్లాలో పదివేలకు పైగా టెలిఫోన్లు ఉంటే ఈ తాలూకాలో (1971 గణాంకాల ప్రకారం) ఒక్కటి కూడాలేదు. తాలూకా మొత్తానికీ ఒకే ఒక హైస్కూలు ఉంది. చాల పల్లెల్లో నీళ్ళకోసం మైలున్నర మూడు మైళ్ళవరకు నడవ వలసిన పరిస్థితి ఉంది.

ఇక భూమి విషయానికి వస్తే ఉన్న కుటుంబాలకంటె లేని కుటుంబాల సంఖ్యే ఎక్కువ. అందులోనూ గిరిజనులదే మెజారిటీ. ఏజన్సీ భూములన్నీ గిరిజనులవేనని, వాటి మొదటి హక్కు వారికే ఉందని ప్రభుత్వం 1917లో చట్టం ద్వారా, ఆ తరువాత 1959, 1970 లలో రెండు రెగ్యులేషన్ల ద్వారా గిరిజనులకు రక్షణ కలిపించినప్పటికీ ఈనాటికీ వేలాది ఎకరాల ఏజెన్సీ భూమి గిరిజనేతరుల చేతుల్లోనే ఉంది. గిరిజనులకు ఎక్కడన్నా భూమి ఉన్నాకూడా అవి చిన్న చిన్న కమతాలే. గిరిజనేతరులలో మాత్రం నాలుగైదు వందల ఎకరాల భూస్వాములు కూడా ఉన్నారు. అంటే పైమూడు చట్టాలేకాక 1973 లో వచ్చిన భూకమతాల గరిష్ఠ పరిమితి చట్టం కూడా బహిరంగంగానే ఉల్లంఘించ బడుతోందన్నమాట!

ఉదాహరణకు తాలూకా కేంద్రమైన ఎల్లవరాన్ని చూస్తే ఈ గ్రామంలోని 1200 ఎకరాల వ్యవసాయ భూమిలో 1100 ఎకరాలకు పైగా కేవలం తొమ్మిది

కుటుంబాల చేతుల్లో ఉంది. వీరు గిరిజనేతరులే కాక ఆ ఊరి కాపురస్థులు కూడా కాదు. భూమినే నమ్ముకుని పల్లెలో నివసిస్తున్న 150 కుటుంబాలలో మూడంటే మూడు కుటుంబాలకు మాత్రమే కొద్దిపాటి భూమి ఉంది. మిగతా వారంతా బ్రతుకు తెరువు కోసం కూలి పనులకు, కూపు పనులకు వెళతారు.

ఈ రెండు పనుల్లో కూడా వాళ్ళకు లభించే కూలి రేట్లు చాల తక్కువ. రైతు కూలి సంఘాలు పెట్టుకున్నాక స్త్రీలకు ఎనిమిది రూపాయలు, పురుషులకు పన్నెండు రూపాయలు లభిస్తున్నాయి గాని అంతకుముందు స్త్రీలకు మూడు నుండి ఆరు రూపాయల లోపు, పురుషులకు ఎనిమిది రూపాయల లోపు లభించేది. అయితే రైతుకూలీ సంఘాలు అన్ని గ్రామాల్లోను లేవు కాబట్టి ఈ అన్యాయం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

అలాగే కూపు పనులు ఏజెన్సీలోని వెదురు అడవులను ప్రభుత్వం రాజమండ్రి లోని ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లుకు లీజుకిచ్చింది. ఒకప్పుడు ఇది ప్రభుత్వరంగ సంస్థేకాని ఇప్పుడుమాత్రం ప్రైవేటు సంస్థ. వీరు వెదురు నరికినవాళ్ళకు రోజుకు ఇంత అని కాకుండా, లాటుకు 40 రూపాయలు ఇస్తారు. ఏడుగురు మనుషులు కలిసి ఒక లాట్‌ను ఒక రోజులో నరుకుతారు. కాని ప్యాకింగ్ వెంటనే జరగదు కాబట్టి ఈలోపల అది ఎండిపోయి వాళ్ళకు 35 రూపాయలు మాత్రమే గిడుతుంది. అంటే మనిషికి రోజుకు దాదాపు తొమ్మిది రూపాయల కూలి.

ఈ పని కూడా అన్ని రోజుల్లోను ఉండదు. పనిలేక కాదు. ప్యాకింగ్ జరిగేంతవరకు మిల్లు వాళ్ళు కొత్త పని చూపరు. దీనివల్ల కూలీలు ఒక్కొక్కసారి రెండు మూడు వారాలదాకా ఖాళీగా ఉండవలసి వస్తుంది. వేరే ఊళ్ళనుండి వచ్చి ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లు పెట్టే క్యాంపులలో ఉండేవారి పరిస్థితి ఇంకా అధ్వాన్నం.

వీరిని తీసుకొచ్చేటప్పుడు అరచేతిలో వైకుంఠం చూపుతారు కాని తీరా వచ్చాక రోజూ పని చూపించరు. ఆరోగ్యం బాగా లేకపోతే చూసే దిక్కుండదు. వందల మంది ఉండే ఈ క్యాంపులలో కనీసం ఒక్క డాక్టరు కూడా ఉండడు. పని సమయంలో తగిలే దెబ్బలకు మందూ ఉండదు, నష్టపరిహారమూ ఉండదు. ముందే కొంత అడ్వాన్సు చెల్లించి ఉంటారు కాబట్టి మధ్యలో వెళ్ళిపోవడానికి వీలులేదు. ఒకవేళ బాకీ తీరక ముందు వెళ్ళిపోయినా ఆ డబ్బును ఆ ఊరికి చెందిన మిగతా వారం

దరి దగ్గర వసూలు చేస్తారు. ఇదంతా నిస్సందేహంగా వెట్టి చేయించుకోవడమే. మస్టరు వేయడంలో, కొలతలు తీయడంలో పేపరు మిల్లు యాజమాన్యం ఇంకా అనేక రకాల మోసాలు చేస్తుంది.

పేపరుమిల్లు వెయ్యి రూపాయల పెట్టుబడిపై మూడు వేల రూపాయలు సంపా దిస్తున్నదని ఒక అంచనా. అంటే 200 శాతం లాభం. ఇంత లాభం వస్తున్నా వెదురుకూపు కూలీల కనీసకోర్కెలను యాజమాన్యం అమోదించడం లేదు. పైపెచ్చు వారు లాటు ధర, మస్టరు, వైద్య సదుపాయం గురించి సమ్మె చేసినప్పుడు మిల్లు యజమాని పోలీసుల ద్వారా వారిని విపరీతంగా వేధించి, భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేశారు.

లాటు ధరను 70 రూపాయలకు పెంచాలని, కూపుకు ఒక డాక్టరును నియ మించి మందులు సరఫరా చేయాలని, కూపులకు తీసుకవచ్చినప్పటి నుండి కూలీలకు మస్టరు వేయాలని, ప్యాసింగ్ పనిలో ఆలస్యం జరిగితే ఆ తప్పు కూలీలది కాదు కాబట్టి ఆలస్యం జరిగినన్ని రోజులకు కూడా మస్టరు ఇవ్వాలని, పని చేస్తున్నప్పుడు జరిగే నష్టాలకు పరిహారం ఇవ్వాలని, లోడింగు, అన్‌లోడింగ్ పనికి 60రూపాయలు, డ్రాగింగ్ పనికి 150 మీటర్ల దూరానికి 20రూపాయలు యివ్వాలని కోరుతూ వెదురు బొంగు కూలీలు 1984 వేసవిలో నెలరోజులపాటు సమ్మె చేశారు.

ఈ సమ్మె సమయంలో కాకరపాడు, కొమరాపురం కూపుల పరిధిలోని డి. రామవరం, మడుపుకోటలవద్ద నాలుగు లారీలు, రెండు జీపులు దగ్ధమయ్యాయి. ఒకటి రెండు చోట్ల వెదురు కూపులు కూడా కాలిపోయాయి. వెదురు రవాణాను ఆపా లని కూలీలు ప్రయత్నించడం, వారి కోర్కెలను ఖాతరు చేయకుండా పేపరు మిల్లు యాజమాన్యం మొండిగా ప్రవర్తించడం ఈ సంఘటనలకు కారణాలు.

వాహనాలకు ఇన్సూరెన్సు ఉంటుంది కాబట్టి దీనివల్ల పేపరు మిల్లు నష్ట పోయింది ఏమీలేకపోయినా వారి ఏజెంట్లుగా పోలీసులు ఆ పరిసర గ్రామాలన్నిం టిపై పడ్డారు. నక్సలైట్లే ఈ పని చేశారని విస్తృతంగా ప్రచారం చేసి, అర్ధరాత్రి అప రాత్రులు కూడా ఇళ్ళపై దాడిచేసి కొట్టేవారు.

ఇక్కడి గిరిజనులకు దున్నుకోవడానికి చారెడు భూమి లేకపోయినా, ఆస్పత్రి, చౌకడిపో వంటి కనీస సదుపాయాలు ఏవీ లేకపోయినా పోలీసు క్యాంపులు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. జడ్డంగి, జంగాలతోట, మంప, వెదురు నగరం గ్రామాలు యిందుకు ఉదాహరణ. ఒక్క ఎల్లవరం తాలూకాలోనే పొదురుపాక, పాండవుల పాలెం, కేతనగిరి (సంచార పోలీసు స్టేషన్) మొదలైన చోట్ల పోలీసు క్యాంపులు, ప్రత్తిపాడు, అడ్డతీగల, రాజవొమ్మంగిలలో పోలీసు స్టేషన్లు, వారికి సహాయంగా ఏపీఎస్‌పి రిజర్వు పోలీసు దళాలు ఉన్నాయి. ఒక వూళ్ళో పోలీసు క్యాంపు ఉందంటే దాని ప్రభావం కనీసం పది గ్రామాలపై ఉంటుంది కనుక దాదాపు అన్ని గ్రామాల లోను పోలీసులు ఉన్నట్టే లెక్క.

హఠాత్తుగా ఇన్ని పోలీసు క్యాంపులు పుట్టుకురావడానికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. ఒకటి- గిరిజనులు కనీస వేతనాలకై అందోళన చేయడం, బంజరు భూములను ఆక్రమించుకొని దున్నుకోవడం, రెండవది- వెదురుకూపు పను లకు హెచ్చు వేతనాలు కోరడం, అందుకై సమ్మె చేయడం. కాని పోలీసులు చెప్పు తున్న కారణాలు వేరు. కేసు పెట్టడమంటూ జరిగితే వారు చెప్పిన కారణాలు ఇవేవీ కావు- అవి పూర్తిగా వేరే

నిజానికి కనీస వేతనాలు కోరడం నేరం కాదు. ఇవ్వకపోవడమే నేరం. సమ్మె చేయడమైనా అంతే. అయినా ఈ కోర్కెలు కోరుతున్నవాళ్ళను పోలీసులు అరెస్టు చేసి వారాలు, నెలల తరబడి అక్రమ నిర్బంధంలో ఉంచుతున్నారు. కొట్టి, తిట్టి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. ఇళ్ళపై దాడిచేసి కోళ్ళు, కల్లు, దొరికితే డబ్బులు ఎత్తుకుపోతున్నారు.

ఇందుకు పోలీసులు వారికి చెప్తున్న కారణం ఒకటే ఒకటి- అది అన్నలకు (తెలుగుదేశం అన్నలు కాదు, నక్సలైటు అన్నలు) అన్నం పెడుతున్నారని, మంచి నీళ్ళు ఇస్తున్నారని, ఆశ్రియం ఇస్తున్నారని, వారు చెప్పే మాటలు వింటున్నారని, వారి ప్రోత్సాహంతో హక్కులు అడుగుతున్నారని. ఎవరికైనా అన్నం పెట్టడం ఎలా నేరమవుతుందని అడ్డతీగల సబ్ ఇనస్పెక్టర్‌ను ప్రశ్నిస్తే "అలా అని ఎందుకు కేసు పెడతామండీ! సిఆర్‌పిసి, ఐపిసి సెక్షన్ల ప్రకారమే బుక్ చేస్తాం' అని చెప్పాడు. అంటే ఏవిధంగాను నేరంకాని విషయాన్ని, చట్టవిరుద్ధంకాని విషయాన్ని నేరంగా,

చట్ట వ్యతిరేక చర్యగా చిత్రీకరిస్తున్నారన్నమాట. ఈ ఎస్ఐ ఇలాంటి ఆసక్తికరమైన విషయాలు ఇంకా కొన్నికూడ చెప్పాడు.

15 గ్రామాలలో 63 మందిని అన్నలకు అన్నం పెడుతున్నారనే కారణంపై అరెస్టు చేయడమో లేదా కేసులు పెట్టి కోర్టులచుట్టూ తిప్పడమో చేశారు. ఇవికాక బంజర్లు ఆక్రమించారని, వెదురు కూపులు తగులబెట్టారని భూస్వాములు, ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్ వారు ఇచ్చిన ఫిర్యాదులపై ఈ గ్రామాలలోనే 117 మందిని నిర్బంధించారు. కేసులు పెట్టారు. 24 గంటల లోపల మేజిస్ట్రేటు ముందర హాజరు పరచాలన్న నిబంధన ఏ సందర్భంలోను పాటింపబడలేదు. దీనిగురించి ప్రశ్నించినప్పుడు కూడ ఎస్ఐ అది "అది బహిరంగ రహస్యమే"నని నిర్భయంగా చెప్పాడు. పోలీసులు అక్రమంగా లాకప్‌లో పడేసి కొట్టిన వారిలో 60 ఏళ్ళ వృద్ధుల నుంచి 16 ఏళ్ళ వివాహిత యువతులదాకా ఎందరో పురుషులూ, స్త్రీలూ ఉన్నారు. దుశ్చర్తికి చెందిన రాజులమ్మపై, పలకజీడికి చెందిన జుర్రా లక్ష్మిపై వెదురు నగరం, బంగాల కోట పోలీసు క్యాంపులలో అత్యాచార ప్రయత్నాలు జరిగాయి.

ఈ గ్రామాలన్నిటి నుండి ప్రతిరోజు 15, 20 మందిని తీసుకువచ్చి కొట్టడం పనులు చేయించుకోవడం, ఒకటి రెండు రోజుల తర్వాత వదిలేయడం రివాజుగా జరుగుతున్నది. ఇది ఒక్క అడ్డతీగలలోనే కాదు, రాజవొమ్మంగి, చోడవరం, దేవీపట్నం, నర్సీపట్నం, కృష్ణదేవిపేట పోలీసు స్టేషన్లలో కూడ సాంప్రదాయంగా కొనసాగుతున్నది.

ఈ గ్రామాలలో ప్రత్యేకంగా కొన్నిగ్రామాలను పరిశీలిస్తే అక్కడ దోపిడీ దౌర్జన్యాలు, అనివార్యంగా ప్రజలు తిరగబడవలసి వచ్చిన స్థితి, వారిమీద పోలీసులు అమలు చేస్తున్న దారుణ దమనకాండ అర్థమవుతాయి.

నాయుడుపాకల: నలుగురు భూస్వాములకు కలిపి 160, 120, 110, 50 ఎకరాల చొప్పున మొత్తం 440 ఎకరాలు ఉంటే మిగతా 30 కుటుంబాలకు కలిపి 30 ఎకరాలు మాత్రమే ఉన్నాయి. గిరిజన సంక్షేమ పథకాల కింద కొన్ని కుటుంబాలకు పట్టా ఇచ్చారు కాని ఇవి ఎక్కువ భాగం అడవి ప్రాంతాలు, నీటి సదుపాయంలేని మెరక భూములు. వీటిలో కొన్ని ఇప్పటికీ పట్టాదారుల అధీనంలోకి రాలేదు

కటోర్రాజు మూరిడీరాజు అనే వ్యక్తికి 28-10-75 న 3 ఎకరాల 41 సెంట్లకు నికర పట్టా ఇచ్చారు. రెండు సంవత్సరాలు శిస్తుకూడా కట్టించుకున్నారు. కాని యింత వరకు ఆ సర్వే నెంబరు గల భూమిని చూపించలేదు. గ్రామస్తులు అడగ్గా, అడగ్గా 1983లో మరో సర్వే నెంబరుగల భూమి 3 ఎకరాల 14 సెంట్లను చూపించారు. ఇది కొండ దిగువ భూమి, రాళ్ళమయం. మొదట యిచ్చింది సారవంతమైన భూమి అయి ఉండడం వల్లనే అది స్వాధీనం చేయకుండా బీడు యిచ్చి ఉంటారని గ్రామస్థుల అనుమానం

అలాగే కందా చెల్లమ్మ అనే స్త్రీకి 14 ఏళ్ళ క్రితం 4 ఎకరాల 60 సెంట్ల భూమికి పట్టా యిచ్చారు. అయితే ఎల్లవరం ప్రాజెక్టు కాలువ తవ్వకానికి దీనిలో రెండు ఎకరాలు పోయాయి. ఈ రెండు ఎకరాలకుగాని, దీనిలో ఆ కుటుంబం వేసుకున్న జీడి చెట్లకుగాని ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించ లేదు. స్వాధీనం చేసుకుని కూడా నాలుగేళ్ళయింది. సుంకర సూరన్న అనే మరో వ్యక్తికి ఆరేళ్ళ క్రితం 7 ఎకరాల 12 సెంట్లకు పట్టా లభించింది. 150 రూపాయల లంచం అడిగితే యివ్వలేదన్న కోపంతో కరణం ఆ భూమిని పాళం పెద్దిరాజు అనే రైతుకు అమ్మాడు. కడుపు మండిన సూరన్న రెండేళ్ళక్రితం తన భూమిని తానే 'ఆక్రమించుకున్నాడు'. ఇంతకాలమూ శిస్తు అతని పేరనే కట్టబడుతున్నా ఫలసాయం మాత్రం అతనికి దక్కలేదు.

ఇలా రకరకాల కారణాల వలన భూమి పోగొట్టుకున్న ఈ ఊరి ప్రజలు నాలుగేళ్ళక్రితం రైతుకూలి సంఘం పెట్టుకుని 8 ఎకరాల చెరువు షికం భూమిని సాగుచేసుకోవడం ప్రారంభించారు కూలి రేట్లను ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం స్త్రీకి 8 రూపాయలు, పురుషుడికి 12 రూపాయలు యివ్వాలని కోరారు. వీటికోసం సమ్మె చేశారు. వెంటనే పోలీసులు వచ్చి సంఘం అధ్యక్షుడైన బేతా నూకరాజును వీరాజు అనే మరో వ్యక్తిని అరెస్టు చేసి అడ్డతీగలకు తీసుకువెళ్ళారు. అక్కడ నుండి రాజవొమ్మంగికి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకువెళ్ళి మొత్తం రెండున్నర నెలలు నిర్బంధంలో ఉంచారు.

ఏదో కేసు పెట్టారని తప్ప అది ఏ కేసు అయిందీ కూడ వాళ్ళకు తెలియదు. ఎన్ని వాయిదాలకు వెళ్ళినా ఫలానా నేరం చేశారని చెప్పుతూ పోలీసులు ఒక అభి

యోగ పత్రం కూడా దాఖలు చేయలేకపోయారు. (సమ్మె చేయడం నేరం కాదు కాబట్టి వాడు యింకే నేరం చేశారో పోలీసులకు కూడా తెలిసినట్టు లేదు.)

చివరికి ఆర్‌డివోయే చార్జిషీట్ పెట్టేంతవరకు వాయిదాలకు రావద్దని ధర్మ సూక్ష్మం చెప్పాక వారు వెళ్ళడం మానుకున్నారు. సమ్మె ఫలితం యిలా ఉంటే ఆక్రమించుకున్న చెరువు శికం మరో కష్టం తెచ్చిపెట్టింది. వందల ఎకరాలున్నా ఈ ఎనిమిది ఎకరాల భూమి చేతుల్లోంచి జారిపోవడం సహించలేని భూస్వాములు ఫిర్యాదు చేయగా రెవెన్యూ శాఖ దీనిని వేలంవేసి అట్టతీగల షావుకార్లకు అప్ప గించింది. అయితే అప్పటికి మూడేళ్లుగా దాన్ని సాగుచేసుకుంటున్న రైతుకూలీలు ఎదురు తిరిగి పంటను కోసి తలాకాస్త పంచుకున్నారు. ఇది వాళ్ళు పట్టపగలు బహిరంగంగానే చేస్తే రాత్రిపూట దొంగతనంగా పైరు కోసినట్టు 14 మంది మీద కేసు పెట్టారు వీరిలో ఇద్దరు స్త్రీలుకూడా ఉన్నారు. ఇలా పంట కోసుకోవడం ఆక్రమమే అయితే ఈ కొద్ది పంటలో కూడా రెండు బస్తాల వాటా తీసుకున్న పోలీసుల చర్యను ఏమనాలి?

ప్రాథమిక హక్కులే కాదు, వీరికి ప్రాథమిక సదుపాయాలు కూడా లేవు. తేలు కుట్టినా, కాన్పుకే వచ్చినా, ఏ వైద్యంకోసమైనా 20 మైళ్ళకు పైగా వెళ్ళాలి. 30 మంది చిన్న పిల్లలున్నా ఓనమాలు నేర్పే బడి లేదు. రాష్ట్రమంతటా పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు యిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంకళ్ళకు సెంటు భూమి లేని ఈ గిరిజనులు మాత్రం పేదలుగా కనిపించ డం లేదు. ఈ ఊళ్ళో చౌకడిపోగాని, గిరిజన కార్పొరేషన్ దుకాణంగాని లేదు. బియ్యం, కిరసనాయిలు, ఏది కావాలన్నా మూడు మైళ్ళ దూరంలో ఉన్న పావంపేట వెళ్ళాలి. కోటా ఎప్పుడు వస్తుందో తెలియదు. అడవుల్లో సమృద్ధిగా లభించే చింత పండయినా సరే వాళ్ళు సంతకు వెళ్ళి కొనుక్కోవలసిందే.

ఇంత వివరంగా ఈ ఊరి పరిస్థితి ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే భౌతిక పరిస్థితుల్లో ఈ ఊరు ఈ రెండు తాలూకాల గిరిజన గ్రామాలన్నిటికీ దాదాపు ప్రతీక లాంటిది. అడవుల్లో, కొండల్లో తిరిగే ఈజనం ఎవరికీ కాళ్ళకు చెప్పులుకూడా లేవు. పేదరికం, వెనుకబడినతనంతోపాటు భూస్వాముల దోపిడీ, పోలీసుల దౌర్జన్యం ఈ గ్రామాలన్నింటిలోను కనిపించే సర్వ సాధారణ లక్షణాలు.

నాయుడు పాకలకు మైలుదూరంలో ఉన్న ఎల్లవరం గ్రామంలో (ఇది తాలూకా కేంద్రంకూడ) మొత్తం 1200 ఎకరాల భూమి ఉంటే అందులో 1100 ఎకరాలు తొమ్మిది కుటుంబాల చేతుల్లో ఉన్నాయి. ఈ కుటుంబాలకే మరికొన్నిగ్రామాల్లో కూడ వందలకొద్దీ ఎకరాలున్నాయి.

ఈ గ్రామంలో జనాభా 700 ఉంటే అందులో 70 మంది మీద కేసులు ఉన్నాయి. అంటే ప్రతి పది మందిలోనూ ఒకరు కోర్టులచుట్టూ తిరుగుతున్నారన్న మాట. వీళ్ళు చేసిన నేరం రైతు కూలి సంఘం పెట్టుకుని 40 ఎకరాల బంజరు భూమిని ఆక్రమించుకోవడం. దీనికి సంబంధించి గత ఏడాది జరిగిన ఘర్షణలో ముగ్గురు రైతు కూలీలు హత్య చేయబడ్డారు. ప్రభుత్వం కొంతమందికి పట్టాలు యిచ్చినా వాటిని అప్పులకింద భూస్వాములే **తీసుకున్నారు** వాటిమీద రుణాలు తెచ్చుకున్నారు. భూమిలేని 147 కుటుంబాలవారు ఏకం కాకుండా వారిమధ్య విభేదాలుకూడా సృష్టిస్తున్నారు.

ఒక్కొక్క యింట్లో మూడుకుటుంబాలవారు ఉంటున్నారు మంజూరైన ఇళ్ళుకూడా కట్టడంలేదు. తహసీల్దారు, రెవెన్యూ ఇనస్పెక్టర్ల సంతకం కావాలంటే వందనోటు యిచ్చుకోవలసిందే. ఆరు పడకల ఆస్పత్రి ఉంది గాని పడకలుగాని, వైద్యులుగాని లేరు. గ్రామస్తులు డాకరును చూసి ఆరు నెలలపైనే అయింది. అయినా ఈ ఆస్పత్రికి ఏటా లక్ష 30 వేల రూపాయలు ఖర్చవుతున్నట్లు లెక్కలుమాత్రం రాసుకుంటున్నారట.

కొత్తూరుపాడు అనే గ్రామంలో నలుగురిని అన్నలకు అన్నం పెడుతున్నారనే కారణంపై అరెస్టు చేశారు. మొదట అడ్డతీగలకు, ఆ తరువాత రాజవొమ్మంగికి, మళ్లా అడ్డతీగలకి యిలా పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పారు. ఊరంతా తగులబెడతామని బెదిరించి మొత్తం 13 మంది మీద కేసు పెట్టారు. ఎర్రిగుండ్లలో ఐదుగురుపోలీసులు కాకూరు బాలయ్య అనే అతని యింటిమీద పడి కల్లు లాక్కొని తాగారు. ఒంటరిగా ఇంట్లో ఉండడానికి భయపడి తోడుకోసం బాలయ్య ఇంటికి వచ్చిన ముల్లా లింగయ్య భార్యవెంట పడ్డారు. బాలయ్య భార్య ఎదురు తిరిగి బెదిరించాకగాని వాళ్ళు వెనక్కి తగ్గలేదు.

రేపులకోటలో కాపురం ఉంటున్న క్రీడిపాలెం ప్రెసిడెంట్ ఇత్తా నడిపవ్వాయి ఇంటికి కూడా వచ్చి వాళ్ళమ్మాయి జబ్బుతో ఉంది వాళ్ళువలు వంట చేసుకోకపోతే అప్పుడికప్పుడు తమకు వండిపెట్టమని బలవంతం చేశారు రెండు శేర్ల బియ్యం వండి చారుకాని పెడితే, చారు చాలదు, కోడికూర కావాలన్నారు. వాళ్ళింట్లో కోడి లేకపోతే పోలీసులే కోదులవీధికి వెళ్ళి పట్టుకొచ్చి వండుకు తిన్నారు. ఇంట్లో వున్న జీలుగు కల్లు లాక్కుని తాగి వాంతులు చేసుకొని నానా భీభత్సం చేశారు కోదులవీధి నుండి ముగ్గురు వ్యక్తుల్ని పట్టుకొచ్చి "లంజాకొడుకుల్లారా! మాకు కోడి యివ్వరా? అన్నలకయితే అన్నీ పెడతారా! మిమ్మల్ని కాల్చేస్తాం, జైల్లో పెడతాం" అని తిడుతూ బాగా కొట్టారు. ఊళ్లో చాలామంది దగ్గర ఇలాగే కోళ్ళు లాక్కునితిన్నారు. కల్లు లాక్కుని తాగారు అదేమని అడిగినవారందరికీ లాఠీలతోనే సమాధానం. అన్నల గురించి చెప్పమని, చూపెట్టమని దొండపందిరి అబ్బాయి, జుర్రి విష్ణు, సారలి వీరాస్వామి మొదలైనవారిని ఇళ్ళవద్దనే పట్టుకుని కొట్టారు.

పలకజీడికి చెందిన ఈ జుర్రి విష్ణు అనే యువకుడ్ని మొత్తం 22 రోజులు అడ్డతీగల లాకప్‌లో ఉంచారు, జ్వరంతో వున్న విష్ణుని అరెస్టు చేయడానికి రెండు జీపులనిండా పోలీసులు వచ్చారు. తుపాకులు గురిపెట్టి చుట్టుముట్టారు. పక్కనుండే జంగాలతోట పోలీసు క్యాంపుకని చెప్పి 18 కి. మీ. దూరంలో ఉన్న అడ్డతీగల పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. మూడు రోజులపాటు అడ్డతీగల చోడవరం ఎస్ఐలు అతణ్ని విపరీతంగాకొట్టారు. ఒంటిపూట తిండిపెడ్తూ బాగా పనులుచేయించుకున్నారు. కూతురికి బాగాలేదని బతిమిలాడితే జంగాలతోటకు మార్చారు. భర్తను చూడటానికి వచ్చిన లక్ష్మితో "నీ మొగుడికి యిక్కడ అన్నం ఎవరు పెడతారు? నువ్వేవచ్చి ఇక్కడ వుండు" అనిసలహాయిచ్చారు. వచ్చినరోజే సత్యనారాయణ అనే కానిస్టేబుల్ నాలుగు నెలల గర్భిణీ అయిన లక్ష్మిపై అత్యాచార ప్రయత్నం చేశాడు. అయితే ఆమె కేకలకు యిరుగు పొరుగువారు పోగపడంతో అతని ప్రయత్నం సాగలేదు.

అయితే యిలాంటివి మామూలే. మార్చిలో ఈ క్యాంపు పెట్టినప్పటి నుండి ఎన్నో రాత్రిలు పోలీసులు ఇలా యిళ్లలోకి దొంగతనంగా ప్రవేశించి ఆడవాళ్ళమీద చేయివేసిన సందర్భాలు ఉన్నాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ జరిగినా సమాజం

చూసే చిన్నచూపుకు, పెట్టిన కట్టుబాట్లకు భయపడి వాళ్ళు చెప్పుకోలేరు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని పోలీసులు యింకా పేట్రేగిపోతున్నారు. దుశ్చర్త్రిలో చెదల రాజులమ్మ అనే 16 ఏళ్ళ వివాహిత యువతిపై కూడా యిలాంటి అత్యాచార ప్రియత్నమే జరిగింది. ఆమెను కుటుంబ సభ్యులనుండి విడదీసి వెదురునగరం క్యాంపులో ఒకరాత్రింతా ఉంచారు. భర్త రాజారావును, మిగతా వారిని అడ్డతీగలకు తీసుకువెళ్లారు. వీళ్ళింట్లో నుండి 50 రూపాయలు, అరకాసు బంగారం కూడా కాజేశారట.

జంగాలతోట, వెదురునగరం పోలీసు క్యాంపులు ఎవరి భవనాల్లో ఉన్నాయో చూస్తే పోలీసుల అణచివేత వెనుక ఎవరి హస్తంవున్నదో స్పష్టంగా బోధపడుతుంది. మొదటిది రాయవరం దత్తుడు అని పిలవబడే ఉండవల్లి సత్యనారాయణ మూర్తికి చెందిన భవనంలో, రెండవది పేపరు మిల్లు ఆఫీసులో ఉన్నాయి.

రాయవరం దత్తుడికి పలకజీడిలో వంద ఎకరాలు, జంగాలతోటలో 50 ఎకరాల భూమి ఉంది. ఇవి చింతపల్లి, ఎల్లవరం తాలూకాల సరిహద్దుకు అటూ ఇటూ ఉన్న పల్లెలు. ఈ పొలాలు ఆయన పదేళ్ళక్రితం అడవి నరుక్కొని ఆక్రమించుకున్న భూములు. ఇప్పుడు వాటిని సాగు చేసుకోకపోయినా వేటకోసం వస్తుంటాడట. అతడు, అతడి బంధువులు "పెద్దాపురం నుండి ముండలను, బ్రాందీ బుడ్లను తెచ్చుకుని వేటకు వస్తుంటాడ"ని గిరిజనులు చెప్పారు.

నిజానికి ఏజెన్సీ అడవుల్లో వేట నిషిద్ధం ఊరి మీద పడి ఆవుల్ని, మేకల్ని పొట్టన పెట్టుకునే మెకాల్ని (పులులను) కూడా గిరిజనులు చంపడానికి వీలులేదు. కాని సంపన్నులకు మాత్రం ఇవేవి వర్తించవు. వాళ్ళకు వేట సరదా అని, గిరిజనులకు మాత్రం ఒక్కొక్కసారి ఆదొక్కటే తిండి పెడుతుందన్న విషయం మనం గుర్తుంచుకుంటే ఎవరికి ఎంత న్యాయం లేదా అన్యాయం జరుగుతున్నదో అర్థమవుతుంది.

రాయవరం దత్తుడి బంధువులు అలా ఒకసారి వేటకు వచ్చి ఒక కణుజును కొట్టారు. ఎద్దుకంటె పెద్దదైన ఈ జంతువును వాళ్ళు ఒక ఉలవ చేను మీదుగా లాక్కొస్తుంటే సహజంగానే గిరిజనులు అభ్యంతర పెట్టారు. దాన్ని జీపుదాకా మోస్తే మోసినందుకు కూలి, చేను పాడయినందుకు పరిహారం కింద ఇరవై రూపాయలు, కణుజు ముందుకాలు యిస్తామన్నారట. తీరా మోశాక అవి ఇవ్వకుండా

పేగులు యిచ్చారు. కడుపు మండిన గిరిజనులు వాటిని వాళ్ళ మొహం మీదే విసిరి కొట్టారు. ఆ తరువాత వాళ్ళు తుపాకులతో బెదిరించడం, గిరిజనులు ఆ తుపాకులను లాక్కోవడం జరిగింది. దాని ఫలితమే జంగాల తోట పోలీసు క్యాంపు. దీన్ని ఏకంగా దత్తుడి యింట్లోనే పెట్టి పోలీసులు తమ మిలాఖత్‌ను స్పష్టంగానే తెలియజేసుకున్నారు. ఈ ఒక్క క్యాంపు చింతపల్లి, ఎల్లవరం తాలూకా సరిహద్దులకు ఇరువైపులా ఉన్న కనీసం 12 గ్రామాలను గుప్పెట్లో ఉంచుకుంటోంది. అవి పలకజీడి, ఎర్రిగొండ, రేవులకోట, తీగలమెట్ట, గంగవరం, నీలవరం, ఎండకోట, ఈదులబంద, బంగరుబంద, బిల్లుపాలెం, దబ్బలంక, నక్కలపాడు గ్రామాలు. ఈ పల్లెల్లో మొత్తం 2950 ఎకరాల పొలం ఉంటే అందులో 160 ఎకరాలు మాత్రమే గిరిజనుల పేర పట్టా ఉంది. అదీ మూడు గ్రామాలలోనే.

వడ్డీ వ్యాపారుల చేతుల్లోకూడా వీళ్ల చాలా నష్టపోతున్నారు. పైరువేసే రోజుల్లో వందరూపాయలు అప్పుపెట్టి కోతకు రాగానే 54 కుంచాల ఉలవలు వసూలు చేస్తారు. వీటి ఖరీదు రెండువందల రూపాయల పైమాటే. అంటే వడ్డీ నెలకు వందకు 33 రూపాయలు గిడుతుంది. (ఉలవలు 3 నెలల పంట). ఇలా వడ్డీకి యిచ్చే వాళ్ళలో వేరే ఊళ్ళలో స్థిరపడ్డ ఇద్దరు గిరిజనులు కూడా ఉన్నారు. "కాస్త డబ్బు దక్కం పోగయితే మావాళ్ళయినా అంతేనండి" అని గిరిజనులు చెప్పారు. సకాలంలో డబ్బు తిరిగి యివ్వకపోతే ఈ వడ్డీ వ్యాపారులు భూమి, పశువులు, చింతచెట్లు ఏవి ఉంటే అదే స్వాధీనం చేసుకుంటారు.

ఒకొక్కొక్కసారి పోలీసులు వడ్డీ వ్యాపారస్తులకంటె కిరాతకంగా ప్రవర్తిస్తుంటారు. చింతపల్లి తాలూకా లంబసింగ్ కోరుకొండనుంచి వచ్చి మడికోటలో స్థిర నివాసం ఏర్పరచుకున్న కొంతమంది నుండి వారు గొడ్డళ్ళు, కత్తులు, ఇతర వ్యవసాయ పనిముట్లు కూడా ఎత్తుకుపోయారు. డబ్బు లాక్కున్నారు. ఇక్కడ ఉండడానికి వీలులేదని, ఉంటే కాళ్ళు చేతులు నరుకుతామని బెదిరించారు. పనులు లేకుండా చేశారు. వంతాల బురుగు, కురాకి కృష్ణ, వంతాల రాజారావు, వంతాల మనయ్య, వంతాల లక్కు, వంతాల తెలుసు లను కొట్టి రెండు నెలలు జైల్లో పెట్టారు. ఫారెస్టు గార్డుతో కలిసి వెయ్యి రూపాయలు యిస్తే ఉండనిస్తామని బేరంపెట్టి చివరికి 525 రూపాయలు వాళ్ళదగ్గర వసూలు చేశారు.

అక్షర చిత్రం :

చారిత్రక విభాత సంధ్య

1973లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం స్థాపించబడింది. ఈ సంఘానికి మొదటి అధ్యక్షుడు మహాకవి శ్రీశ్రీ. ఈ పౌరహక్కుల సంఘం తొలి సంవత్సరాల్లో రాజకీయ కార్యకర్తల హక్కుల రక్షణకై నినదించిన కొద్ది గొంతులతో తన గొంతును కలిపింది. ఈ సంఘం తాను ఉనికిలోకి రాగానే శ్రీకాకుళ గిరిజనోద్యమంలో దాదాపు 350 మందిని పోలీసులు 'ఎదురు కాల్పుల' పేరుతో విప్లవకారుల్ని సానుభూతిపరుల్ని హత్య చేయడానికి వ్యతిరేకంగా పోరాడింది. 1975లో భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల రద్దుకై ఉద్యమించింది. (వీరిని తరువాత ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో, డిసెంబర్ 25న 1975లో ఉరితీశారు)

ఎమర్జెన్సీలో పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ పత్తిపాటి వెంకటేశ్వర్లు, హైకోర్టు న్యాయవాది మీసాకింద అరెస్టు చేయబడి జైలుపాలయినాడు. ఈ కాలంలో ఇతర ప్రజాస్వామిక సంస్థల వలనే దీని కార్యక్రమాలు కూడా తాత్కాలికంగా నిలిచిపోయినవి.

ఎమర్జెన్సీ ఎత్తివేసినతరువాత మార్చి1977లో ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల సంఘం తన్నుతాను పునః వ్యవస్థీకరించుకున్నది. ఒకసంవత్సరం తరువాత శ్రీ కె.జి. కన్నాబిరాన్, హైకోర్టు న్యాయవాది ఎపిసిఎల్సి అధ్యక్షుడయి ఇప్పటికీ కొనసాగుతున్నాడు. ఎమర్జెన్సీలో జరిగిన దాదాపు 85 'ఎదురు కాల్పుల' హత్యలతో మొదలు

ఎర్రగొండలో సభల గురించి చర్చించడానికి వస్తున్న ముగ్గుర్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన జూన్ 26న జరిగింది. వాళ్ళదగ్గర డబ్బుల్ని లాక్కుని జంగాలతోట క్యాంపుకు తీసుకువెళ్ళారు. ఈ సంగతి తెలిసి అక్కడికి దగ్గరకూపులో ఉన్న 60మంది గిరిజనులు క్యాంపుకువెళ్ళి వాళ్ళను విడుదల చేయమని పట్టుపట్టారు. తుపాకితో కాలుస్తామని పోలీసులు బెదిరిస్తే దాన్ని లాక్కున్నారు. చివరికి వైర్‌లెస్‌ను ధ్వంసం చేస్తామని బెదిరించడంతో పోలీసులు రాజీకి వచ్చి డిఎస్‌పి వచ్చేదాకా శాంతంగా ఉండమని కోరారట.

ఆ డిఎస్‌పి మరో 55 మంది పోలీసులను వెంటబెట్టుకుని వచ్చి గిరిజనుల ఫిర్యాదులు విన్నాడు. పోలీసుల తప్పుల్ని సరిదిద్దుతానన్న హామీతో, అన్నలమాట వినకూడదన్న వార్నింగ్‌తో ఆయన చివరికి వాళ్ళను విడిచిపెట్టాడు.

పెట్టి పౌరహక్కుల సంఘం ఎన్నో సమస్యలను (issues) చేపట్టి వాటి న్యాయబద్ధ పరిష్కారానికై పోరాడింది. కరీంనగర్ జిల్లాలో 1978లో జగిత్యాల, సిరిసిల్లా తాలూకాలను 'కల్లోలిత ప్రాంతాలుగా' ప్రకటించడాన్ని వ్యతిరేకించడం, 1979లో హైదరాబాద్ అడికమెట్ పోలీస్ స్టేషన్లో రమేజాబీని చెరచడానికి వ్యతిరేకంగా ఉద్యమించడం, 1980లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో గిరిజనులను ఊచకోత కోయడాన్ని నిరసించడం, 1981–'82 లలో నల్గొండ, వరంగల్ జిల్లాల్లోజరిగిన 'ఎదురు కాల్పుల' హత్యలను వెలుగులోకితీసుకొనిరావడం ముఖ్యమైనవి వాటిలోప్రధానమైనవి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ వర్గాల ప్రజలపై సాధారణంగా పోలీసులు ప్రయోగిస్తున్న వ్యవస్థీకృతమైన హింసకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం దేశంలో ఒక శక్తివంతమైన పౌరహక్కుల సంస్థగా ఉన్నది.

1983లో యన్ టి రామారావు నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తెలుగు దేశం ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను ఉల్లఘించడం చేత ఎపిసిఎల్సి తన కార్యక్రమాలను మరింత ఎక్కువ చేసింది. ఈమధ్యకాలంలో 1983 ఆగస్టులో డా॥ కె బాలగోపాల్, కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత శాస్త్రోపన్యాసకుడు, ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయినాడు. గత రెండు సంవత్సరాల ఎన్టీఆర్ ప్రభుత్వ పాలనలో నూరుకుపైగా నిర్బంధానికి చెందిన కేసులను పరిశోధించింది పౌరహక్కుల సంఘం అక్రమంగా పోలీసు స్టేషన్లలో నిర్బంధించబడిన ఎంతో మందిని విడిపించడానికి జిల్లా అధికారులకు నివేదించడం జరిగింది. కోర్టుల్లో సెర్చ్‌వారెంట్లు, హెబియస్ కార్పస్ పిటీషన్లు వేయకుండా ఒక్క వారమయినా గడువలేదు. ఉత్తర తెలంగాణా జిల్లాల్లో దాదాపు 100 గ్రామాల్లో ఉన్న పోలీసు క్యాంపులకు, అదనంగా సిఆర్పి బలాల్ని దించడానికి వ్యతిరేకంగా ఇతర ప్రజాస్వామిక, పౌరహక్కుల సంస్థలతో కలసి దేశవ్యాపితంగా ఆందోళన చేయడం జరిగింది. ప్రజల ప్రజాస్వామిక హక్కులసంఘం (PUDR) ఢిల్లీతో కలిసి 1984 మార్చిలో తెలంగాణా గ్రామాల్లో ఉన్న పోలీసు క్యాంపుల రాజ్యాంగ బద్ధత సవాలుచేస్తూ సుప్రీం కోర్టులో ఒక కేసు పెట్టడం జరిగింది.

1984 సంవత్సరంలో పోలీసు లాకప్పులో జరిగిన 24 హత్యలను, 9 మాన భంగాలను వెలుగులోకి తీసు కొచ్చింది 1984 జులై నుండి ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం 'స్వేచ్ఛ' అనే పత్రికను ప్రచురించడం మొదలు పెట్టింది.

ప్రచారం, సభలు, నిర్బంధానికి గురి అయిన వారికి న్యాయ సహాయం కల్పించడం ద్వారా, చట్టాన్ని అమాలు చేయాల్సిన ప్రభుత్వాధికార సంస్థలు ఆచరణలో చట్టాన్ని ఎలా వ్యతిరేకిస్తున్నవో, ఎలా ఉల్లంఘిస్తున్నవో నిరంతరం క్రమబద్ధంగా పౌరహక్కు ల సంఘం వెలుగు లోకి తీసుకొస్తునే ఉన్నది.

ఈ విధంగా (Campaign) ప్రచారం, ఆందోళన పెరగడంతో ప్రజలు కూడా ప్రతిస్పందించడం మొదలుపెట్టారు దీనితో పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తలపై కూడా పోలీసు నిర్బంధం పెరుగుతూ వచ్చింది. రెండు సంవత్సరాల నుండి కరీం నగర్, వరంగల్, నిజామాబాదు జిల్లాల్లో పౌరహక్కుల సంఘం సభలు పెట్టుకోవ డాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందనే చెప్పాలి. ముఖ్యంగా చిన్న పట్టణాల్లో ఉన్న పౌర హక్కుల ఉద్యమ కార్యకర్తలు రోజు నిర్బంధానికి గురౌతున్నారు. మూడింట రెండు వంతుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులపై వివిధ రాష్ట్రాలలో కోర్టుల్లో తప్పుడు కేసులు నడుస్తున్నవి.

దీనికితోడు ప్రభుత్వ సంస్థలు పౌరహక్కుల సంఘాన్ని 'తీవ్రవాద సంస్థ' అని 'జాతి విద్రోహ సంస్థ' అని ముద్రవేసి తప్పుడు ప్రచారాన్ని నిర్మించాయి. దురదృష్టవశాత్తు ఈ ప్రచారానికి కొన్ని పత్రికలు గూడా తోడ్పడ్డవి. కాని నిజాన్ని ఎవ్వరూ దాచలేరు. కాని నిజాన్ని ఎవరైన గమనించదలిస్తే, స్కూలు పిల్లల నుండి భారతీయ విద్యాభవన్‌కు చెందిన సమస్యలదాకా. వేశ్య అని చెప్పబడుతున్న స్త్రీని లాకప్పులో చంపడం నుండి గోదావరిలోయ గిరిజనులపై జరుగుతున్న పోలీసు నిర్బంధందాకా, రాష్ట్ర నాన్-గెజిటెడ్ ఉద్యోగుల సమస్యల నుండి నక్సలైట్లని చెప్పి యువకులను చంపడందాకా ఎన్నోసమస్యలను పౌరహక్కుల సంఘం చేపట్టింది. చివరగా తెలుగుదేశం ప్రభుత్వాన్ని రాజ్యాంగ వ్యతిరేకంగా రద్దు చేయడాన్ని కూడా పౌరహక్కుల సంఘం వ్యతిరేకించి ఆందోళనలో పాల్గొన్నది. ఈ విధంగా ప్రజల రాజకీయ విశ్వాసాలతో నిమిత్తం లేకుండా ఎవ్వరి ప్రజాస్వామిక పౌరహక్కులకు భంగం కలిగినా పౌరహక్కుల సంఘం నిరసించింది. వెలుగులోకి తీసికొచ్చింది. ఆందోళన చేపట్టింది.

దీనితో పౌరహక్కుల సంఘంపై తప్పుడు ప్రచారం ఎంతచేసినా ఏమీకాదన్న విషయాన్ని తప్పుడు ప్రచారం మాత్రమే సరిపోదన్న అంశాన్ని రాజ్యం త్వరలోనే గుర్తించింది. అందుకే ప్రస్తుతం జరుగుతున్న భౌతిక దాడులు.

కరీంనగర్ జిల్లా తెలంగాణాలో వాయువ్య (North West) దిశగా ఉన్నది. ఈ జిల్లాలో ఎనిమిది సంవత్సరాల నుండి సి.పి.ఐ. (ఎం.ఎల్) పార్టీకి చెందిన వివిధ గ్రూపుల నాయకత్వంలో నడుస్తున్న రైతాంగ పోరాటం బలంగా వేళ్ళూను కొన్నది. జిల్లాలో మూడింట ఒక భాగాన్ని 1986, ఆంధ్రప్రదేశ్ కల్లోలిత చట్టం ప్రకారం కల్లోలిత ప్రాంతంగా ప్రకటించారు. ప్రస్తుతం ఈ జిల్లాల్లో 30 కన్న ఎక్కువ పోలీసు క్యాంపులు వివిధ గ్రామాల్లో ఉన్నవి. ఇక్కడ రాజ్యం, ప్రభుత్వ సంస్థలతోపాటు భూస్వాములు, సారా కంట్రాక్టర్లు పౌరహక్కుల సంఘం కార్య కలాపాల పట్ల వ్యతిరేకత పెంచుకున్నారు. ఈమధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం, ఈ ప్రాంతంలో 200 మందికి పైగా 'పౌరులకు' ప్రైవేటుగా తుపాకులు కలిగి ఉండడా నికి లైసన్సులు మంజూరు చేసింది. కాని కల్లోలిత ప్రాంతాల చట్టం (ప్రకరణం 3) ఏ ఆయుధంగాని, ఆయుధంగా ఉపయోగించగల వస్తువేదైనా పుట్టుకొని సంచరించడం నేరమని స్పష్టంగా తెలియచేస్తున్నది. ప్రభుత్వ సహాయ, ప్రోత్సాహాలతో పెరుగుతున్న భూస్వాముల దౌర్జన్యాలు హింస వల్ల జిల్లాలో ఒక రకమైన "పౌర వైరుధ్య" (Civil Conflict) పరిస్థితి సృష్టించబడింది. భారతీయ జనతాపార్టీ, దాని అనుబంధ సంస్థలు భూస్వాముల పూర్తి కాల సాయుధదళాలుగా మారినవి.

ప్రస్తుతం అధికారంలో వున్న తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతా పార్టీకి రాజకీయ ఎన్నికలపొత్తుండడంవల్ల బిజెపి చేస్తున్న కార్యకలాపాలపై అదుపులేకుండా పోయిందనేది బయటకు కనపడ్తున్న నిజం. పౌరహక్కుల సంఘానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రస్తుత ప్రచారంలో బిజెపి ప్రభుత్వ సంస్థల పక్షం చేరిపోయింది. నిజానికి ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే పౌరహక్కుల సంఘం సుప్రీం కోర్టులో గ్రామాల్లో, విద్యాలయాల్లో పోలీసు క్యాంపులు ఉండడానికి వ్యతిరేకంగా కేసు పెడితే ఎబివిపి జోక్యంకల్పించుకొని ప్రభుత్వ వాదనను, పోలీసు క్యాంపులను సమర్థిస్తూ జోక్యందారీ పిటిషన్ వేయడం జరిగింది. ఇటువంటి పరిస్థితులల్లో మెట్టుపల్లి తాలూకా ఫకీర్ కొండాపూర్ గ్రామస్తుడైన తోకల చినవెంకటి పోలీసులాకప్పులో

చిత్రహింసలకు గురియై మరణించడానికి వ్యతిరేకంగా పౌరహక్కుల సంఘం ఉద్యమించింది ఈ విషయంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పౌరహక్కుల సంఘం వేసిన పిటిషన్ కోర్టులో ఎటూ తేలకుండా నిలిచి వున్నది. ఈ మధ్యకాలంలోనే బిజెపి పౌరహక్కుల సంఘంపై దాడులను ఎక్కువ చేసింది.

వరంగల్ జిల్లాతోపాటు వరంగల్ పట్టణం మొత్తంగా 2 సం॥లుగా క్రమబద్ధంగా సృష్టింపబడుతున్న ఒక భయంకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నది. దూరాన అడవి ప్రాంతపు గ్రామాలతో పాటు కాకతీయ యూనివర్సిటీ ఆవరణలో కూడా పోలీసు క్యాంపులు నెలకొల్పబడ్డవి. వందలకొద్ది యువకులను అక్రమంగా నిర్బంధించడం, రకరకాల చిత్రహింసలతో పాటు లైంగికపరమైన హింసలకు గురిచేయడం, పోలీసు కస్టడీలో చంపేయడం వంటి వన్నీ నిత్యం జరిగే కార్యక్రమాలై పోయినవి. ఇటువంటి భయానక పరిస్థితికి, దాడులకు వ్యతిరేకంగా పౌరహక్కుల సంఘం ఎడతెరిపి లేకుండా తన ప్రచారాన్ని కొనసాగిస్తూనే వున్నది. ముఖ్యంగా ఆత్మకూరు, మడికొండ, మట్టెవాడ పోలీసు స్టేషన్లలో జరిగే క్రూరమైన, అసహజమైన లైంగిక చిత్రహింసలను బయటపెట్టడం జరుగుతున్నది. గత సంవత్సరం ఆగస్టు నెలలో పట్టణం నడిబొడ్డులో వున్న హన్మకొండ పోలీసు స్టేషన్లో ఒక కూలి చిత్రహింసలకు గురి చేయబడి చంపబడ్డాడు. ఈ విషయంలో ఎపిసిఎల్సి ఎన్నో కష్టాలకోర్చి సంఘటనను శోధించి వెలుగులోకి తీసుకొని రాకపోతే పోలీసులాకప్పులో అతని చావు బయటి ప్రపంచానికి తెలిసుండేది కాదు. కాజీపేట పోలీసు స్టేషన్లో రాడికల్ యువజన సంఘం కార్యకర్త సుదర్శన్ 18 డిసెంబర్ నాడు చిత్రహింసలకు గురిచేయబడి చంపబడ్డాడు. ఈ కేసు పరిశోధనలో తోడ్పడ్డ వ్యక్తులందర్నీ పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికి వారిలో చాలామంది పోలీసు కస్టడీలోనే వున్నారు. ఈ విషయం నిర్ధారించబడ్డ తరువాత రాడికల్ విద్యార్థి, యువజన సంఘాలు జనవరి 18న వరంగల్ బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగింది.

ఇదిలా ఉండగా జనవరి 12, 1985న కె. జి. కన్నాభిరాన్ నాయకత్వంలో బాలగోపాల్, కోదండరామిరెడ్డి తదితరులు కరీంనగర్ జిల్లా సిరిసిల్లా తాలూకాలోని కొన్ని గ్రామాలలో పోలీసుల అత్యాచారాలను పరిశోధించడానికి వెళ్ళినపుడు గోపి రాజన్నపై దాడి జరిగిన విషయం తెలిసింది. 30 సం॥ల వయస్సున్న

రాజన్న వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందినవాడు. జీవితంలో ఎంతో కష్టపడి ఎన్నో చిన్న చిన్న ఉద్యోగాలుచేసి (ఆర్ఎస్ఎస్ నిర్వహించిన ఒక స్కూల్‌లోగూడా ఉపాధ్యాయుడిగా పనిచేశాడు) లా కోర్సు చదివి జగిత్యాలలో న్యాయవాద వృత్తిలో చేరాడు. 1981లో జగిత్యాల పట్టణంలో న్యాయవాద వృత్తి చేపట్టినప్పటి నుండి అతను పౌరహక్కుల ఉద్యమానికి చేరువైనాడు. ఆ తరువాత తాలూకా పౌరహక్కుల సంఘానికి ఉపాధ్యక్షుడైనాడు. అతని ఇంటిముందు అతనిపై దుండగులు కాల్పులు జరిపిన రాత్రి అతను భార్యాపిల్లలతో సినిమాకుపోయి వస్తున్నాడు. అతన్ని కాల్చిన తరువాత దుండగుల్లో ఒకరిని పట్టుకోవడానికి ప్రయత్నించిన అతని భార్యను వారు తుపాకీ మడిమతో కొట్టడం జరిగింది. రాజన్న అక్కడికక్కడే మరణించాడు. మరుసటిరోజు ఉదయం పౌరహక్కుల సంఘం నాయకులు అక్కడికి వెళ్ళడం జరిగింది. పౌరహక్కుల సంఘం రాజన్నపై దాడిచేసి కాల్చి చంపిన వారి పేర్లను తెలిపి వీరంతా ఆరెసెస్, ఎబివిపి సంస్థలకు చెందినవారన్న విషయాన్ని కూడా జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు తెలిపింది. ఇంతవరకు పోలీసులు ఏ చర్య తీసుకోలేదు. బిజెపి తన చర్యలద్వారా పోలీస్‌శాఖ తన నిశ్శబ్దంద్వారా మొత్తం జిల్లాలో భయానక వాతావరణం సృష్టించాయి.

సిరిసిల్లా తాలూకా సముద్రలింగాపురం గ్రామానికి చెందిన ఒక రైతు స్త్రీ పౌరహక్కుల సంఘం కమిటీతో మాట్లాడిన 'పాపానికి' చెరచబడింది. జనవరి 21న సిపిఐ(యంఎల్) పీపుల్స్‌వార్ కార్యకర్త అయిన ఖైరి గంగారాం ఎదురుకాల్పుల పేరుతో హత్య చేయబడ్డాడు. ఇది కరీంనగర్ జిల్లాలో 3 సం॥ల తరువాత జరిగిన మొదటి 'ఎదురు కాల్పుల' హత్య. ఈవిధంగా పౌరహక్కుల సంఘం కార్యకర్తలు లేని సమయాన ఒకరిని చంపివేయడం మరొక స్త్రీని చెరచడం పోలీసుల దౌర్జన్యకాండకు నిదర్శనం.

ఈమధ్యలోనే, జనవరి 18న, రాడికల్ విద్యార్థి సుదర్శన్‌ను లాకప్పులో చంపడానికి వ్యతిరేకంగా యువజన సంఘాలు వరంగల్ బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. ఆ రోజున ఉదయం 9 గంటలకు పోలీసులు డా॥ పి. వరవరరావు (వయస్సు 42) ఇంటిపై దాడిచేశారు. అతడు స్థానిక సికెయం కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడు, ప్రస్తుత రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శి.

అంతకు ముందురోజు వరవరరావు అంతకు ముందు తనమీదున్న పాత కేసులో కోర్టుకు హాజరై కోర్టులో మాట్లాడుతూ న్యాయవాది గోపి రాజన్న హత్యను న్యాయవాదులంతా ఖండించాలని విజ్ఞప్తి చేసాడు. అంతేగాకుండా పోలీసుల సుదర్శన్‌ను చిత్రహింసలకు గురిచేసి చంపడాన్ని ఖండించాడు ఇదే పోలీసుల దృష్టిలో వరవరరావు చేసిన 'నేరం' కాబట్టి అతడు కూడా పోలీసుల దాడికి, దౌర్జన్యానికి మరోసారి గురికాక తప్పలేదు.

అతన్ని అరెస్టుచేసినపుడు పోలీసుఅధికార్లు అతనితో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దుర్భాషలాడుతూ ఇంటిలో నుండి పోలీసు జీబుదాకా నెట్టివేస్తూ తీసుకొని వెళ్ళారు. లుంగీపై ఉన్న అతన్ని, వేరు బట్టలు మార్చుకోవడానికి చెప్పులు వేసుకోవడానికీ కూడా అవకాశమివ్వలేదు. అతన్ని జీబులోకి ఎత్తి విసిరివేసారు. హన్మకొండ చౌరస్తా నుండి పోలీసు స్టేషనుదాకా (దాదాపు 3 ఫర్లాంగులు) జీబుముందు నడిపించుకుని తీసుకెళ్ళారూ అతన్ని పోలీసులాకప్‌లో నేలపైతోసి నానా దుర్భాషలాడారు వరవరరావును పోలీసు అధికార్లు ఇలా అరెస్టుచేసి తీసుకెళ్ళడం ఇదే మొదటిసారి. వరవరరావు పట్ల అతని ఇంట్లో పోలీసు అధికార్లు (సిఐలు రామస్వామి, లాజరస్) ప్రవర్తించినతీరు, అతన్ని అరెస్టు చేసి తీసుకొనిపోయిన విధానాన్ని చూసి ఆందోళన చెందిన అతని భార్య హేమలత, సృజన సంపాదకురాలు, స్థానిక పౌరహక్కుల సంఘం కార్యకర్తల సహాయంతో జిల్లా కలెక్టరు దగ్గరికెళ్ళి (మ॥ 12 గంటలప్పుడు) వరవరరావు అరెస్టుచేయబడ్డతీరును వివరిస్తూ ఒక దరఖాస్తునిచ్చారు, జిల్లా కలెక్టరు ఈ విషయంలో తగు విధంగా చర్య తీసుకొంటానని వాగ్దానం చేసాడు. 'తీవ్రవాదులు' సర్కిల్ ఇనస్పెక్టర్, (రాంచందర్) ఇంటిపై దాడి చేసారని చెప్పుకుంటున్న సంఘటన జరిగిన తరువాత రెండు గంటలకు (చెప్పుకోబడుతున్న దాడి 18 జనవరి ఉదయం 7 గంటలకు జరిగింది) వరవరరావు పోలీసులు అరెస్టు చేసారు. ఆ తరువాత పగలు 3 గంటల ప్రాంతంలో వరవరరావు అరెస్టు గురించి విచారించడానికి ఎస్పీ ఆఫీసుకెళ్ళిన డా॥ రామనాథం (48 ఏళ్లు, ప్రముఖ పిల్లల డాక్టరు, పౌరహక్కుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు), కె. సీతారామారావు, (లెక్చరర్, కాకతీయ విశ్వవిద్యాలయం, జిల్లా పౌరహక్కుల సంఘం కార్యవర్గ సభ్యుడు) లను 3-30 గంటల ప్రాంతంలో, ఎస్పీతో మాట్లాడి బయటికి రాగానే, అతని ఆఫీసు ఆవరణలోనే పోలీసులు అరెస్టు చేసారు. డా॥ రామనాథం,

కె. సీతారామారావు ఎస్పీ దగ్గరికి పోవడానికి ముందు, అంతకుముందే అతనితో మాట్లాడి వస్తున్న స్థానిక పత్రికా విలేకరులు (ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఉదయం, ఈనాడు) వీరిని ఆఫీసులో చూడడం జరిగింది. అప్పుడు జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో వరవరరావు, డా॥ రామనాధం, సీతారామారావులతో సహా మరి 50 మంది రాడికల్స్‌ను నేరం చేయకుండా నిరోధించే సెక్షన్' (నేర శిక్షాస్మృతి, సెక్షన్, 151) క్రింద అరెస్టు చేశామని వరంగల్ జిల్లా ఎస్పీ(శ్రీ అరవిందరావు) ప్రకటించాడు. ఇదే విషయం తెల్లవారి (19 జనవరి, 85) అన్ని దినపత్రికల్లో రిపోర్టు అయింది. డా॥ రామనాధం, సీతారామారావులతో ఎస్పీ తన 'అధికారయుత' కోపాన్ని తీవ్రంగా వ్యక్తంచేసాడు. వరవరరావును అరెస్టు చేసినపుడు పోలీసు అధికార్లు 'మర్యాద'గానే ప్రవర్తించారని, "అంతకంటే చెడుగా ప్రవర్తించి ఉండాల్సిందని" సంకోచం లేకుండా తెలియచేసాడు. అంతేగాకుండా 'మీరు ఆ రాస్కెల్స్‌కు మద్దతు నిస్తున్నారు కాబట్టి మీరుకూడా....' అనీ, "మీరు మీ పరిధుల్లో వ్యవహరించడంలేదు కాబట్టి మేంకూడా నియమాలేవి పాటించం" అనీ స్పష్టంగానే తెలియచేసాడు. ఇది ఓ 'ఐపియస్' అధికారికి రాజ్యాంగంపట్ల, చట్టంపట్ల, ప్రజాస్వామిక హక్కులపట్ల వున్న దృక్పథాన్ని తెలియచేస్తుంది. ఈ ముగ్గురిని జనవరి 19న రాత్రి 8-30 గంటలకు మేజిస్ట్రేట్ ఇంట్లో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ వీరిని తిరిగి 21న 11-00 గంటలకు కోర్టులో హాజరు పరచాల్సిందిగా ఆదేశించాడు. దీనివల్ల వీరిలో ఇద్దరు 3 రోజులు 'నరకకూప'మైన పోలీసులాకప్పులో గడపక తప్పలేదు. కాని డా॥ రామనాధం అనారోగ్యంగా ఉండడంవల్ల అతన్ని గాంధీ ఆసుపత్రిలో ఉంచాలని మేజిస్ట్రేట్ ఉత్తర్వులిచ్చాడు.

ఈమధ్య కాలంలో వరంగల్ చేరుకొన్న డా॥ బాలగోపాల్ డిఐజి ఆఫీసుకెళ్ళి ఈ పరిస్థితులపట్ల తన తీవ్రమైన నిరసన తెలియచేసాడు. జనవరి 19 సాయంత్రాని కల్లా ఎస్పీ పత్రికా విలేకరుల సమావేశంలో తెలియచేసిన దానికి భిన్నంగా అరెస్టు చేసిన ముగ్గురిని ఇతర తప్పుడు కేసుల్లో ఇరికించబోతున్నారన్న విషయం తెలిసింది. హనమకొండ పోలీసు స్టేషన్లో నమోదు చేయబడ్డ ప్రాథమిక సమాచార నివేదిక (First information report FIR) ప్రకారం వరవరరావును 18 సాయంత్రం 5-30 గంటలకు అరెస్టు చేసినట్టు చూపారు. (దీనికంటె 'రెండు గంటల ముందు'

ఎస్పీ పత్రికా విలేకరుల సమావేశంలో వరవరరావు తదితరులను అరెస్టు చేసినట్టు ప్రకటించాడు). పోలీసులు వరవరరావు ఇంట్లో రెండు నాటుబాంబులు స్వాధీనం చేసుకున్నట్లు FIR లో తెలియచేసారు. అతనిమీద పేలుడు పదార్థాల చట్టం సెక్షన్ 4, (పేలుడు పదార్థాలను తయారు చేయడానికి ప్రయత్నించడం) సెక్షన్ 5 (పేలుడు పదార్థాలు కలిగి ఉండడం) ల క్రింద నేరారోపణ చేసారు. ఇదిగాక వరవరరావును సుబేదారి పోలీసు స్టేషను పరిధిలో ప్రత్యేకంగా మరో తప్పుడు కేసులో డా॥ రామనాథం, కె. సీతారామారావులతోపాటు (నేరం సంఖ్య 11, 1985) ఇరికించారు. ఈ కేసుకు సంబంధించిన ప్రాథమిక సమాచార నివేదిక ప్రకారం, ఈ ముగ్గురు 17 జనవరి రాత్రి వరవరరావు గారింట్లో జరిగిన సమావేశంలో ఉపన్యాసాలిచ్చి రాడికల్ విద్యార్థి యువకులకు బాంబులు పంచినారని నేరారోపణ చేశారు. వీరిపై నమోదు చేసిన కేసుకుసంబంధించిన సెక్షన్లు. 120-B(నేరంచేయడానికి జరిపినకుట్ర), పేలుడు పదార్థాల చట్టం సెక్షన్లు 4 మరియు 5, భారత నేర శిక్షాస్మృతి సెక్షను 506 (బెదిరించడం). దీనికితోడు ప్రాథమిక సమాచార నివేదికలో వీరితోపాటు 'పేరులేని' 40మంది 'ఇతరులను' కూడా చేర్చారు. ఈ విధంగా అరెస్టు చేయబడ్డ ముగ్గిరిని (వరవరరావు డా॥ రామనాధం, కె. సీతారామారావులను) జనవరి 21న జుడిషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగింది.

జనవరి 22 సాయంత్రం వరంగల్ ఎస్పీ సర్కిల్ ఇనిస్పెక్టర్ ఇంటిపై దాడి చేసిన కేసులో 'ఉండి' పోలీసులకు 'కావాల్సి ఉండి' తప్పించుకుంటున్న సారంగపాణి (18 ఏళ్ళు, లాల్‌బహదూర్ కళాశాల విద్యార్థి) పోలీసులను తప్పించుకోవటానికి పరిగెత్తుతూ 'ప్రమాదవశాత్తు' ఒక కుంటలో పడి మరణించాడని ప్రకటించాడు. ఈవార్త జనవరి 23న అన్ని దినపత్రికలలో ప్రచురించారు. ఇదే విషయంలో తరువాత జనవరి, 30న సారంగపాణి మరణం విషయంలో ఎస్పీని హైదరాబాదు నుండి వచ్చిన పత్రికా విలేకరులు ప్రశ్నించగా, ఎస్పీ "మేము సారంగపాణిని కాల్చి చంపలేదని ఆపనే మేం చేస్తే సంతోషంగా ప్రకటించి ఉండేవాళ్ళమని" బహిరంగంగా చెప్పడమే కాదు నేనిలా అన్నానని రాసుకోమన్నాడు.

ఈమధ్య కాలంలో జనవరి, 23న హైదరాబాద్ వెళ్ళి లోకాయుక్త (జస్టిస్ ఆవుల సాంబశివరావు) కార్యాలయంలో వరంగల్ పోలీసులు జరుపుతున్న అత్యాచా

రాలపై తగు చర్య తీసుకోవాలంటూ బాలగోపాల్ ఫిర్యాదు చేసాడు. అదేరోజు సాయంత్రం వరకు అతను వరంగల్ చేరుకొన్నాడు. వచ్చిన వెంటనే సారంగపాణి చనిపోయిన పరిస్థితికి సంబంధించిన వివరాలను మిల్‌కాలనీప్రాంతంలో సేకరించడం ప్రారంభించాడు. సారంగపాణిని పోలీసులు జనవరి 21న ఆజంజాహి మిల్ కాలనీ ప్రాంతంలో అతని ఇంటివద్ద రాత్రి 9 గంటల ప్రాంతంలో అరెస్టు చేశారు. ఆ రోజు రాత్రే అతన్ని చిత్రహింసలకు గురిచేసి చంపివేయడం జరిగింది. ఆమరుసటి రోజు (జనవరి, 23న) అతని శవాన్ని ఒక చాపలో చుట్టి పోలీసులు అతని ఇంటికి తీసుకొనిపోయారు.

అతని తల్లి తండ్రులను కూడా ఆతని ముఖంతప్ప శవాన్ని పూర్తిగా చూడనీయలేదు. తరువాత పోలీసులు అతని శవాన్ని ఏనుమాముల స్మశానానికి తీసికొనిపోయి కాల్చి వేశారు శవాన్ని కాల్చినప్పుడు కూడా ఎవర్ని దరి దాపుల్లోకి రానీయలేదు. శవం పూర్తిగా కాలి పోయేదాక పోలీసులు అక్కడే ఉన్నారు రావడానికి ప్రయత్నించిన బంధువులను, స్నేహితులను లాఠీలతో బాది పారదోలారు. సారంగపాణి తల్లి రాధమ్మ జనవరి 30 న పత్రికా విలేకరులకు; "తన కొడుకును పోలీసులే చంపారని శవాన్ని తమకివ్వలేదని, ముఖం మాత్రమే చూపించారని, ముఖంపైలోతైన గాయాలున్నాయని, పోలీసులు 200 రూపాయలిస్తే వాటిని తిరిగి వాళ్ళ ముఖంమీదే విసిరి వేసానని" ఏడుస్తూ తెలిపింది. జనవరి, 23 న సాయంత్రం బాలగోపాల్ మిల్ కాలనీ ప్రాంతానికి పోయి సారంగపాణి హత్యకు సంబధించిన సమాచారాన్ని సేకరించి, రాత్రి చాలసేపటికి తన ఇంటికి చేరుకున్నాడు. జనవరి, 24 తెల్లవారక ముందే 3-30 గంటలకు సాయుధ పోలీసులు బాలగోపాల్ ఇంటిపైదాడి చేసి, అరెస్టు చేసి హన్మకొండ పోలీసు స్టేషన్‌కు తీసికొని పోయారు.

అదేరోజు ఉదయం 11 గంటల ప్రాంతంలో పౌరహక్కుల సంఘం ఈ విషయంపై కోర్టుకు పోవడం జరిగింది. ఆరోజు బాలగోపాల్‌ను మధ్యాహ్నం 3 గంటలకు కోర్టులో హాజరుపరిచారు. అతని పేరును సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని కేసులో ఉన్న 'ఇతరుల' జాబితాలో చేర్చారు. (సెక్షన్లు 120-B, ఇ. ఎస్. చట్టం సెక్షన్లు 445, ఐపిసి, 506). దీనికితోడు వరవరరావు, బాలగోపాల్- 'చనిపోయిన సారంగపాణి' కలిసి సర్కిల్ ఇనస్పెక్టర్‌ను హత్య చేయడానికి కుట్ర చేసినారని

(సెక్షన్ 307 హత్యా ప్రయత్న నేరం) తప్పుడు కేసు బనాయించి మరో FIRను సృష్టించారు పోలీసులు. బాలగోపాల్‌పై నేరారోపణ చేసిన అంశాలు: భారత నేర శిక్షాస్మృతికి చెందిన సెక్షన్లు 307 (హత్యా ప్రయత్నం), 148 (దొమ్మీ), 342 (తప్పుడుగా నిర్బంధించడం Wronful Confinement 436 (కాలపెట్టడం arson) భారత ఆయుధాల చట్టం, సెక్షను 25 (లైసెన్సు లేని ఆయుధాలు ఉపయోగించడం) మొదలైనవి. జనవరి 24న సాయంత్రం అతన్ని జ్యుడిషియల్ రిమాండుకు పంపించడం జరిగింది.

ఈ విధంగా మొత్తంమీద అన్నీ కలిపి, డా॥ రామనాథం, సీతారామారావులపై నాలుగు సెక్షన్లతో కూడిన ఒక్క కేసూ, బాలగోపాల్‌పై 9 సెక్షన్‌లతోకూడిన రెండు కేసులూ బనాయించారు 'మహా ఘనత వహించిన' వరంగల్ పోలీసులు.

తరువాత జరిగిన పరిణామాల్లో వరవరరావు, రామనాథం, సీతారామారావులను జనవరి, 21 న వరంగల్ సెంట్రల్ జైలుకు పంపిన తరువాత ఇతర నక్సలైట్ రాజకీయ ఖైదీలతోపాటు ఉంచడం జరిగింది. కానీ జనవరి, 24న జైలుకు పంపిన బాలగోపాల్‌ను విడిగా 150 మంది ఖైదీలను ఉంచగల ఒక పెద్ద బ్యారక్‌లో ఒంటరిగా ఉంచడం జరిగింది. జైలు అధికారులు అతన్ని చట్ట వ్యతిరేకంగా అక్రమంగా 'సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్'లో ఉంచారు. (ఇది జైలు అధికారుల పరిభాషలో సాలిటరీ కన్‌ఫైన్‌మెంటు కాకపోవచ్చు) అంతేగాకుండా అతనికి పుస్తకాలుగానీ, రాసుకునే సామగ్రిగానీ, వార్తా పత్రికలుగానీ ఏవీ ఇవ్వలేదు. న్యాయ విచారణలో ఉన్న రాజకీయ ఖైదీలను జైల్లో తమ తోటి ఖైదీలతో కలువనీయకుండా ఒంటరిగా ఉంచడం చట్ట వ్యతిరేకమని వరవరరావు, రామనాథం, సీతారామారావులు వరంగల్ జైలు సూపరింటెండెంట్‌కు జనవరి, 25న తమ నిరసనను తెలియచేసారు. దీనికి ప్రతి చర్యగా వరవరరావును జైలు అధికారులు సికింద్రాబాద్ జైలుకు మార్చారు. జనవరి 26 ఉదయం డా॥ రామనాథం, కె. సీతారామారావు జామీనుపై విడుదల చేయబడ్డారు. పౌరహక్కుల సంఘం కార్యదర్శి బాలగోపాల్‌ను మాత్రం జైల్లో ఒంటరిగానే ఉంచారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి దాడితో పౌరహక్కుల ఉద్యమాన్ని నాశనం చేయవచ్చునని భావిస్తున్నట్టు కనబడుతున్నది. ప్రజాస్వామిక శక్తులు గుర్తించాల్సిన విషయం ఏమిటంటే ప్రజాస్వామిక హక్కుల రక్షణకై కృషిచేసే వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడమే దీనిపై మౌనం వహించడం నేరం తప్ప మరొకటి కాదు.

వరంగల్ పట్టణంలో జనవరి 18 నుండి సెక్షన్ 144 అమలవుతున్నది. జనవరి 23న పోలీసులు ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాలపై దాడి జరిపి మూడు వందల మంది విద్యార్థులపై లాఠీచార్జ్ జరిపారు. ఇరవై మందిని అక్రమ నిర్బంధంలో ఉంచారు బాలగోపాల్‌ను అరెస్టు చేసిన రోజు రాత్రి కాకతీయ మెడికల్ కాలేజ్ హాస్టళ్ళపై పోలీసులు దాడిచేసి ఆరుగురు విద్యార్థులను అరెస్ట్‌చేసారు. ఎంతో మంది విద్యార్థులను అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వరంగల్‌లోని కళాశాలల్లో, ముఖ్యంగా లాల్‌బహదూర్ కళాశాలలో భయానకమైన వాతావరణం నెలకొన్నది. విద్యార్థులు లేక తరగతులు సరిగా జరగక కాలేజీలు పోలీసు క్యాంపులుగా మారిపోయాయి. మరోప్రక్క ఇంకోరకమైన నిశ్శబ్దం ఆవహించి ఉన్నది. హైదరాబాద్ నుండి వచ్చే 11 దిన పత్రికలలో కేవలం 4మాత్రమే ఈ సంఘటనల వార్తలను ప్రచురించాయి.

ఈ ప్రచురించబడ్డ వార్తలు గూడా ఆయా ప్రాంతీయ ఎడిషన్లలోనే రావటంతో ఇతర ప్రాంతాల ప్రజలకి ఈ వార్తలేమీ తెలిసే అవకాశం లేకుండా పోయింది. తమకోసం ఇతర ప్రాంతాల జన స్పందన గూర్చి తెలుసుకునే వీలు వరంగల్ ప్రజానీకానికి కలగలేదు. పత్రికల ప్రాంతీయ ఎడిషన్లవల్ల ప్రజల్లో కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడుతోందనటానికి ఇది నిదర్శనం.

ఇది ఇలా సాగుతుండగానే సికింద్రాబాద్ జైలుకు మార్చబడిన వరవరరావుకు జనవరి 31న బెయిలు వచ్చింది. ఆయన బెయిలుమీద విడుదలై వరంగల్‌కు రాగానే ఇంకో కేసులో అతన్ని అరెస్టుచేసి మళ్ళీ జైలుకు పంపారు. ఫిబ్రవరి నాలుగో తారీఖున బాలగోపాల్‌కు బెయిలు దొరికింది. తతంగమంతా పూర్తయాక అతన్ని సాయంత్రం 7.30 కి విడుదల చేశారు కానీ ఆయన జైలు ఆవరణ దాటి బయటికి రాగానే

పోలీసులు మళ్ళీ అరెస్టు చేసి మిల్ కాలనీ పోలీసుస్టేషన్ కి తీసుకువెళ్ళారు. ఆ రాత్రి మర్నాడు పగలూ, రాత్రీ పోలీసు స్టేషన్లో ఉంచి ఆరో తారీఖున ఆయన్ని కోర్టులో హాజరు పరిచారు. తర్వాత మామూలుగానే జైలు.

వీళ్ళద్దరికోసం బెయిలు అప్లయి చేస్తే ఏడో తేదీన బెయిలు వచ్చింది గానీ అప్పటికే సాయంత్రం ఆరు దాటింది గనక విడుదల చెయ్యలేదు. (ఇక్కడ ఒక విషయం గమనించాలి. నాలుగో తారీఖున బాలగోపాల్ని రాత్రి 7.30 కి విడుదల చేశారు. వెంటనే మళ్ళీ అరెస్టు చేస్తారని ఎలాగూ తెల్సు. కానీ ఈ రోజు ముఖ్య మంత్రి ఎన్టీఆర్ వరంగల్ కి వచ్చాడు పోలీసులంతా ఆ పనుల్లో ఉన్నారు. అరెస్టు చెయ్యడం కుదరదు గనుక విడుదలని మర్నాటికోసం టెక్నికల్ కారణాలు చూపి వాయిదా వేశారు.) మర్నాడు కూడా విడుదల అయితే తమని మళ్ళీ ఏదో కేసులో ఇరికి స్తారన్న అనుమానంతో వాళ్ళు విడుదల కాలేదు ఒకవేళ విడుదలయి ఉంటే పోలీసు లాకప్ లో మూడురోజులపాటు ఉండాల్సి వచ్చేది. అరెస్టు చేసినరోజు ఒకటి, రెండో రోజు రెండవ శనివారం, మూడో రోజు ఆదివారం. సోమవారం కోర్టులో హాజరు పరచి ఉండేవారు.

అసలు పోలీసులు వాళ్ళిద్దరినీ పది రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టుని అడిగితే కోర్టు నిరాకరించింది. దాంతో ఎలాగయినా వీళ్ళిద్దరినీ కస్టడీలోకి మళ్ళీ తీసుకుని తడాఖా చూపుదామని పోలీసుల ఉద్దేశమై ఉండాలి ఇదిలా సాగిస్తూనే ప్రతిరోజూ కుమార్ పల్లిమీద దాడిచేసి యువకుల్ని ఎత్తుకుపోవటం పరిపాటయింది.

ఈ జరుగుతున్న అణచివేత అంతా విప్లవోద్యమం మీద, విప్లవ సాహిత్యో ద్యమం మీద మరీ ముఖ్యంగా పౌరహక్కుల ఉద్యమం మీద జరుగుతున్నదే. ఈ కేసుల్లో పనిచేస్తున్న లాయర్ కృష్ణారావును ఫిబ్రవరి ఏడో తేదీన కోర్టు ఆవరణలోని ఒక కాంటీన్లోనే ఏబివిపి గూండాలు బెదిరించటంగూడా జరిగింది. ఈ క్రమం అంతా వెలుతురు రాబోయే ముందు చీకటి చర్య. చీకటి ఎంత నల్లగా తయారై వచ్చినా ఎంత భయపెట్టినా వెలుతురు రాకను ఆపలేదు. ఈ సంధ్యా సమయంలో పౌర హక్కుల సంఘం తన గొంతెత్తి స్వాతంత్ర్య రక్షణకై నినదిస్తూనే ఉంది. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య శక్తులకూ, మేధావులకూ తన పిలుపును అందిస్తోంది.

వేయి పడగల నీడల కింద...

కెవిఆర్

పాతివ్రత్యం (అరుంధతి), దేవదాసీత్వం (గిరిక), 'పావిత్ర్యం' నిష్ఠాగరిష్ఠత, సాంప్రదాయికత (ధర్మారావు) వంటి వాటికి పట్టం గట్టిన విశ్వనాథ సత్యనారాయణ గారి 'వేయి పడగలు' నవల స్వర్ణోత్సవాలట. ప్రజా పోరాటాలతో దద్దరిల్లిపోతూ ఢమరుకంగా మారిన వరంగల్లు (ఓరుగల్లు అనాలికాబోలు!) నగరంలో! పండితులూ పండితమ్మన్యులూ, పుట్టు-ఆచార్యులూ, పదవి - ఆచార్యులూ, ఎందరెందరో పాల్గొనబోతున్నారంటూ ఒక ఆహ్వాన పత్రం నాకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ పి. కోదండరామయ్యగారు ఈ సభలకు-ఉత్సవం-అధ్యక్షత వహిస్తారని తెలిసి ఆశ్చర్యపడలేదు. ఎందుకంటే ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుకుంటాయి గదా!

1934లో 'ఆంధ్ర విశ్వకళా పరిషత్తు' నిర్వహించిన నవల-పోటీలో అడివి బాపిరాజు గారి 'నారాయణరావు' విశ్వనాథవారి 'వేయి పడగలు' బ్రాకెట్ అయ్యాయి. బాపిరాజు నవ్యతలో ప్రాచీనత తొంగిచూస్తూ, జమీందారీ దర్జాలతో బాటుగా జాతీయోద్యమ సంరంభాన్ని కూడా ప్రదర్శించి, గతించి పోసాగిన భూస్వామిక సమాజ విలువలను ఆధునిక సామాజిక విలువలకు లోబరిచి వేస్తే—

'వేయిపడగలు' తద్విరుద్ధమైన పనిజేసింది. జరుక శాస్త్రి మాటల్లో "ప్రాచీన నవ్యుడు" అయిన విశ్వనాథకు మారుతూన్న సమాజం వికటించింది. కాటన్ దొర పుణ్యమా అని కృష్ణమీద గూడా ఆనకట్ట పడకముందు, పడిన కొత్తల్లోనూ, మెట్ట పొలాలు మాగాణి పొలాలుగా మారుతూ, సంపన్న, స్వతంత్ర రైతాంగ వర్గం తలెత్తసాగింది. వెనకటి నడతలూ నడకలూ కనుమరుగౌతున్నాయి. దేవదాసీ వృత్తి ఆ 'కులం' వారికే క్రమంగా రోతగొలప సాగింది 'బ్రాహ్మణ్యం' కూడా యీ మార్పుకి తల ఒగ్గక తప్పలేదు. సుబ్బన్నపేట అనే ఒక కుగ్రామం సుభాన్‌పేటగా ఎలా మారిందో వర్ణించే క్రమంలో విశ్వనాథ చూపు నిలిచింగల్లా ముచ్చెన గుంటలోనే, గొర్రెపొటేళ్ళపందెం మొగలు కూచిపూడి భాగవతందాకా, వెనకటి వినోదాలు కూడా మార్పుచెందుతూ 'ధర్మగ్లాని' జరుగుతూంటే ఊరకేచూస్తూ కూర్చోలేని పురాణ మనస్తత్వం కఠిన గ్రాంధిక సమాస తత్పరతతో పాటు 'భక్తి శృంగార' రసాల మిళాయింపు సొంపునీ కంపునీ మెచ్చుకునే గతైక దృష్టి, ఆ మార్పు భౌతి

కంగా జరిగిన డెబ్భై ఐదేళ్ళ తర్వాత గ్రాంథ రూపం ధరించింది. చాతుర్వర్ణ్య వ్యవస్థను యథాతథంగా నిలబెట్టాలని బలంగా కోరుకోడమే గాకుండా, బ్రాహ్మణుడైన వాడికి (రామేశ్వరశాస్త్రి), తక్కువ కులాల్లో ఒక్కో స్త్రీని భార్యగా వుంచుకునే ప్రత్యేక హక్కు (ప్రివిలేజ్) ఉందనే విపరీతసిద్ధాంతాన్ని ప్రతిపాదించటంతో పాటు, బాల్య వివాహాలను ప్రోత్సహించే వైఖరిని (చిన్న అరుంధతి) ప్రదర్శించడం విశ్వనాథ 'సంప్రదాయకత'ను సంప్రదాయ దాస్యంగా నిరూపిస్తాయి. 'చెలియలికట్ట'లో ప్రేమ వివాహాల వైఫల్యాన్ని చూపితే ఈ నవలలో మంగమ్మ పాత్రద్వారా అలాంటి ఆధునిక సామాజిక వైఖరులను హేళనచేసే విధంగా చిత్రించడం రచయిత మనస్తత్వాన్ని ప్రదర్శిస్తుంది. ఇది 'సుందరకాండ' అనబడే కిష్కింధ సీమా విశేషమైనా కాదు. వెయ్యి పడగలనాగు — సుబ్బన్న — సుబ్బారాయుడు — విప్పార్చుతుని కథలో నేమో 'రాజు' నీ, జీవితంలో ప్రజనీ కాటందు తుంది.

ఆ భూస్వామికం మిగుల్లు తగుల్లు మన సమాజంలో నేటికీ విలిచివుంటూ రాజ్యాధికారంలో ఎంతో అంత వాటా పొందుతూ వున్నాయి గనకనే, సజావైన బూర్జువా విప్లవం సొంతం జరగక, దేశం బలంగా ముందడుగు వెయ్యలేకపోతూంది. ఈ బూర్జువా వర్గానికి భూస్వామికంతోటి ఆజన్మ సంబంధ బాంధవ్యాలుంటున్నాయి గనకనే ఆర్. యస్. యస్; ఏ.బి.వి.పి; రామరాజ్య పరిషత్, విశ్వహిందూపరిషత్ వంటి సంస్థలకు నేటికీ నూకలు మిగిలివుంటున్నాయి. రాజకీయాన్నీ 'సంస్కృతి'నీ రంగరించి, అవి గతాన్ని వర్తమానకాలం మీద, శవాన్ని జీవితం మీద బేతాళుడిలా మోపినట్టు, మోపగలుగుతున్నాయి. ప్రజా జీవితంలో బండరాళ్లగా కంటకాలుగా అడ్డులేని చెడ్డతనానికి రూపాలు కల్పిస్తూ ప్రజాపోరాటాలను నెత్తుట్లో ముంచెత్త గలుగుతున్నాయి. ఈ క్రిమికీటకాల కన్నిటికీ మూలం విశ్వనాథ సృష్టించి లోకం మీదికి విడిచిపెట్టిన విషపురుగు — 'వేయి పడగలు' మనస్తత్వమే.

అసాధారణమైన తన సృజనాత్మక ప్రతిభను అపమార్గం పట్టించి అందులో అనన్యమైన విలక్షణత్వం సాధించుకున్న 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ రచనలను విమర్శనాత్మకంగా అధ్యయనం చేసి, వాటిలో దాగున్న కీడును నిర్దాక్షిణ్యంగా ఖండిస్తూ ఆ తత్వానికి గోరీ కట్టవలసిన అవసరంవుండగా స్వర్ణోత్సవమా? అంటే, ఇంకా మనలో అభివృద్ధి నిరోధకత్వానికి ఆధునిక, నాగరిక రూపాలు ధరించిన వ్యక్తులూ శక్తులూ ఎన్నైనా ఉన్నాయన్నమాట.

పాట:

వోట్ల రాజ్యంలోన...

రాజశేఖర్

(వోట్ల రాజ్యంలో.... నీటి తీవ్రతతో నలుగుతున్న 'మందస' మెట్టు ఉద్దానం ప్రజల ముఖాలు చూసి, ఈ పాట.

ఈ పాటలో పల్లవి బాణీ – తుపాకి రాజ్యంలోరన్నా – నువ్వు తుఫానువై లేవరన్న పల్లవి బాణీ మేరకు తీసుకున్నాను)

వోట్ల రాజ్యంలోన రన్నా
మనకు వొరిగేది ఏముందిరన్నా–
॥అన్నా వోట్ల॥

వోట్ల రాజ్యంలోన రన్నా
నల్ల దొంగలదె అధికారమన్న
॥అన్నా వోట్ల॥

అన్నన్న మాయన్న
ఓటున్న పేదన్న
రాడికల్ పిలుపుతో రైఫిలై లేవన్న
॥వోట్ల॥

కోటి కళ్ళతో మీరు
నీటికై చూస్తున్న
మీ కంట నీరంత
కాల్వలై పారింది
మీ కంటి తడితోటి
నేలంత తడిపింది
నీరు ఇంకిన కళ్ళు
నిలదీసె మీ కళ్ళు
ఎదిరించె మీకళ్ళు
ఎరుపెక్కె మీకళ్ళు
ఎర్రజెండా వెలుగు జాడలే చూసాయి
॥వోట్ల॥

తెల్లోడు నల్లోడు
తేడేమి లేదన్న
రంగు తేడే తప్ప
దొంగ లొకటేనన్న
నల్ల దొంగల్లోనె
నామాలు వేరన్న
ఇందిరా [illegible]ంటోడు
తోడు దొంగలురన్న
ఇందిరా చచ్చినా
వెళ్లు తెగలేదన్న
రాకాసి పుత్రుడే
రాజ్యపాలకుడన్న
రాజీవు గద్దెపై
ముడ్డి మోపాలంటు
పంటోడు ఎంటోడు
కలలు గంటన్నాడు
'తెలుగుదేశం' లోన

సంకెళ్ళపై :

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు

చేకూరి రామారావు

మనుషులకు జీవితం, స్వేచ్ఛ, సుఖాన్వేషణ అనేవి సహజమైన హక్కులనీ వీటికోసమే ప్రభుత్వాలేర్పడ్డాయనీ, వీటికి అధికారాలు పాలితుల ఇష్టాన్నిబట్టే ఉంటాయని, ఎప్పుడైనా ఏరకమైన ప్రభుత్వమైనా యీలక్ష్యాలకు వినాశకరంగా తయారయితే అట్లాంటి ప్రభుత్వాన్ని మార్చటానికిగాని, పూర్తిగా రద్దు చేయటానికిగాని ప్రజలకు అధికారం ఉందనీ అమెరికా మొదటి అధ్యక్షుడు థామస్ జఫర్సన్ తన 'స్వాతంత్ర్య ప్రకటన'లో చెప్పాడు.

తెగనీల్గి యిప్పుడు
'భారతదేశమ'ని పరుగు తీస్తున్నాడు
"వోట్ల"

రష్య రాజ్యానికి
రహదారి గున్నోల్లు
కాంగ్రెసు భజనకై
కాపి కూర్చున్నోల్లు
ఇందిరా పల్లకీ
మోసుకొచ్చినవాల్లు
ప్రతిపక్ష ముసుగులో
పొంచి చూస్తున్నోల్లు
కమ్యూనిజానికి
తల్లు పీకినవాల్లు
సి.పి ఐ సి.పి.ఎమ్. చీడపురుగులుంన్న
"వోట్ల"

మతపిచ్చి మూర్ఖులు
బీజేపి పార్టోల్లు
నక్కజిత్తులగాల్లు
నానా పార్టీవాల్లు

అధికార దాహంతొ
ఓటడగ వస్తారు
బిగబట్టె పిడికిలికి
బ్యాలెట్టు లిస్తారు
బ్యాలెట్ల చీటితో బతుకుమారదురన్న
"వోట్ల"

దున్నేవానికి భూమి
దక్కేంత వరకురా
కూలిరాజ్యం మనకు
చిక్కేంత వరకురా
భూస్వామి ఏలిక
బూడిదయ్యేదాక
ధనస్వామి ఏలిక
దౌడు తీసేదాక
దోపిడీ రాజ్యాలు
అంతమయ్యేదాక
వోట్లరాజ్యం కూల్చి
నోట్లరాజ్యం కాల్చి
ఒక్కొక్కదేకమై
కోట్లయిరండన్న "వోట్ల"

ఈ అధికారం ప్రజలకుందని చెప్పటమే విప్లవ రచయితలు చేస్తున్న నేరం. సుమారు 200 ఏళ్ళ కిందట థామస్ జఫర్సన్ తయారుచేసిన స్వాతంత్ర్య ప్రకటనలో భావం మన పాలకుల చెవికెక్కటంలేదు.

మిగతా ఆంధ్రదేశంలో సంగతి ఏమో కాని ఇవాళ వరంగల్లులో మనం అనుకుంటున్న ప్రభుత్వం లేదు. ప్రజలకు స్వేచ్ఛ లేదు. అక్కడి ప్రభుత్వాన్ని రద్దు చేసింది ప్రజలు కాదు ప్రజల హక్కులను రక్షించటానికే ఉన్నారని చెపుతున్న పోలీసులు. ఈ పోలీసుల రాజ్యంలో కోర్టులు పనిచెయ్యవు. న్యాయం కళ్ళు మూసుకుంటుంది. కళ్ళు తెరవండని చెపుతున్న విప్లవ రచయితల్నో ప్రజాతంత్రవాదుల్నో నోరుమూయించి కూర్చోపెడుతుంది. అక్కడి అధికార మదాంధులు అడ్డంవచ్చినవాళ్ళ నోళ్లు మూయిస్తారు. వాళ్ళ అహంకారానికి అడ్డు వచ్చారనే నెపంతో పసికందుల ప్రాణాలనయినా హరిస్తారు. ఇదేమని అడిగితే మళ్ళీ నోళ్ళు మూయిస్తారు. హైదరబాదులో ఉన్న ప్రభుత్వానికి వినపడు తున్నదో లేదో కాని మళ్లీ గుర్తు చేస్తున్నాను ఇవాళ వరంగల్లులో ప్రభుత్వంలేదు. పిశాచాలు ఊరేగుతున్నాయి, దయ్యాలు పండుగ చేసు కుంటున్నాయి.

అక్కడి విద్యాలయాల్లో విద్యార్థులు నోళ్లు తెరవలేక పోతున్నారు. ఉపాధ్యాయులు నివ్వెర పోయి చూస్తున్నారు.

ఎన్నికలు జరుగుతున్నాయి. వాగ్దానాలు విహరిస్తున్నాయి. ఈ వరంగల్లులో మాత్రం స్వేచ్ఛలేదు. ఇది ఇవాల్టి పరిస్థితి కాదు దాదాపు పదేళ్లనుంచీ ఇట్లాగే సాగుతున్నది.

ఇదంతా ఒక ఎత్తు. మిగతాచోట్ల ఏం జరుగుతున్నా చీమ కుట్టినట్టుగా కూడా అనిపించని నా మేధావి వర్గాన్ని చూస్తే మాత్రం సిగ్గవుతున్నది. తోటి ఉపాధ్యాయుల హక్కుల్ని హరించినప్పుడుకూడా నోరెత్తటానికి సాహసించలేని అధ్యాపకబృందాన్ని చూసి సిగ్గు పడుతున్నాను.

నేరమే అధికారమై
ప్రజల్ని నేరస్తుల్ని చేసి వేటాడు తుంటే
ఊరక కూర్చున్న
నోరున్న ప్రతివాడూ నేరస్తుడే.

నిజాలు ఫోయినెక్స్ పక్షులు

నారాయణస్వామి

నా కిప్పుడు నా ఆకాశం కన్పించట్లేదు
నేను కళ్ళలో నింపుకున్న నక్షత్రాల కాంతి
నా దోసిళ్ళతో తాగిన వెలుతురుగాలి
నేను నడుస్తున్న సుదీర్ఘ యానంలో
నా కాళ్ళ మధ్య ఒదిగి పోయిన వసంతాల పచ్చదనాల విశాలత్వమూ
నా నుండి దూరమయ్యా యిప్పుడు—
రాత్రి గోడల మధ్య బందీ అయిన చీకటి
భయపడ్డ జంతువుకు మల్లే బెదురు బెదురుగా

ఈ చెవిటి ప్రభుత్వాలకు ఒక పట్టాన చెవికెక్కవు. అందరూ కదిలి సాధించ
కుంటేనే నీనా హక్కులు దక్కేది, పౌరహక్కులు నిలిచేది. అందరూ ఇది అనా
యం అని అరవండంటున్నాను. ప్రజలమీద పాలకులు చేస్తున్న ఈ కుట్రను భగ్న
చెయ్యకపోతే మనందరం ఈ కుట్రలో భాగస్వాములయినట్టే.

నిరంకుశ ప్రభుత్వాలు పౌరహక్కులు ప్రసాదంగా ఇయ్యవు, ప్రజ
సంఘటితంగా సాధించుకుంటే వచ్చేవే పౌరహక్కులు. గద్దె మీద స్వాము
మారినా పౌరుల జీవనంలో అభివృద్ధికరమైన మార్పులు రాకపోగా ప్రజల స్వే
మాత్రం నానాటికి తగ్గి పోతున్నది. తమ అధికారం తాత్కాలికంగా పోయినప్
ప్రపంచం అంతా మునిగి పోయినట్టు గగ్గోలు పెట్టిన స్వాములు ప్రజల హక్కుల
గురించి పట్టించుకోక పోవటం విచిత్రం! విచిత్రంకాదు సహజమే: వాళ్లకు
ల్సింది వాళ్ళ అధికారాలు, మనకు కావాల్సింది మన స్వేచ్ఛ. మనం ఇచ్చిన
కారంతో మన స్వేచ్ఛను హరిస్తున్నారు వాళ్లు.

మన స్వేచ్ఛను మనం సంపాయించు కోవటం కోసం పోరాడకతప్పదు.
వరవరరావు స్వేచ్ఛ కోసం కాదు. బాలగోపాల్ స్వేచ్ఛ కోసం కాదు. మన
స్వేచ్ఛ కోసం.

[హైదరాబాద్ ప్రెస్క్లబ్‌లో 9–2–85 సాయంత్రం విరసం ఏర
చేసిన బహిరంగ సభలో చదివిన ప్రసంగ వ్యాసం]

ఈ జైలు కొట్లో—
కనురెప్పల నీలినీడల వ్యాకులనిర్జన భరితనిడారుల్లో
కను గుడ్ల మధ్య గరగరలాసలిగిపోయే ఇసుక రేణువుల తుఫానుల్లో
దుమ్ము పట్టిన కరకుజైలు గోడల నిర్బంధాల మధ్య
జీవితాస్తమయాల కన్నీటి గాధల్లో
వెల్తురు సందుల్ని వేళ్ళతో మూయాలని తాపత్రయపడుతున్న రాక్షసానందాలమధ్య
నేనిక్కడ ఒంటరిగానే బందీనై వున్నా!
పగిలి పోతున్న దర్పణంలో
ప్రతి బింబం ముక్కలై చెల్లాచెదరు కాదు—
ప్రతి అద్దం ముక్క ప్రపంచమంత నిజాన్ని ప్రతిబింబిస్తుంది—
నేను నిజాన్ని—
వెల్తురంత స్వచ్ఛమైన
ఆకాశమంత విశాలమైన
చీకటి జంతువును దగ్ధం చేయగల నిజాన్ని—
నేను సంచీలో బాంబుల్ని దాచుకోలేదు —
ఔను
నిజాలే బాంబులౌతాయి —
నిజాలని నేరాలుగా చేసిన వ్యవస్థలో
నిజం పలికిన నోట్లో బ్రహ్మజెముళ్ళు మొలిపించే వ్యవస్థలో
నా చూపుల్లో పదునెక్కిన నిజాలు
నా చేతి వేళ్ళలో వృసయించిన నిజాలు
నా శరీరం నరాల్లో విద్యుత్తించిన నిజాలు
నీ కోట గోడల్లో పేలుతున్నప్పుడు
నిజాలు బాంబులే ఔతాయి —
నువ్వు ఆకాశాన్ని నా నుండి దూరము చేసావేమోగానీ
నా ప్రజల కళ్ళ నుండి చెరిపేయగలవా?
నా పుచ్ఛ్వాస నిశ్వాసాల బండరాళ్ళ కింద నన్ను సమాధి చేయగలవేమో —
నా ఏకాకి తనం మంటల్లో నన్ను మాడ్చేయ గలవేమో —

సంకెళ్ళలో :

సర్కిల్లో చంద్రుడు

వరవరరావు

జైల్లో సర్కిల్[1]లో
శిశిర చంద్రుడు రిమాండయ్యాడు
సర్కిల్ తోటలో
మామిడిచెట్ల సిగలో
మాఘ మాసపు చిగురును
జడ్జీ [2]చేస్తున్న నియాన్ లైట్ ఆరిపోయింది
కోట[3] లో దోమలు ముసురుకున్న
గుడ్డి దీపాలన్నీ ఆరిపోయినవి
'జిమ్మేదారి కోయిలో జిమ్మేదారి కోయిలా'
జైలు కోకిలలు పక్క కోటలో
మామిడాల హరిభూషన్ పాట ఎత్తుకున్నవి

నామీద హోచిమిన్ జైలుడైరీ [4] నీడలాగ
కిటికీ ఊచలు కత్తిరించిన వెన్నెల
చంద్రుడు తన వెచ్చని చెయ్యి అందించినట్లు
ఆ వెన్నెల బాట పట్టుకొని
తోటలోని మల్లె పొదల మీదికి
విరబూసిన మామిళ్ళ మీదికి

బీజాలు ఫోయినెక్స్ పక్షులు —
నేను ఆకుల పత్రహరితంలో వ్యాపించిన వాణ్ణి —
నేను చరిత్ర గతితర్కంలో వెలుగుతున్న వాణ్ణి —
నేను ప్రపంచ పీడిత ప్రజానీకంపోరట పదముద్రల్లో నినదిస్తూన్న వాణ్ణి —
నీవు వేసిన సంకెళ్ళ నుండి
కట్లు తెంచుకుని
పాయలు పాయలుగా ప్రజల అరచేతుల్లో ప్రవహిస్తాను —

గోపురం మీదికి ఎగబాకితే
అక్కడినుంచి ఆకాశ ఔన్నత్యం చంద్రుడు

చంద్రునిలోంచి చూస్తే
బయళ్ళ నిండా వెన్నెల
బయళ్ళ దాపున మా బడి[5]పై వెన్నెల
బడి వెనుక గోదావరి గుండె కాలువలో[6] వెన్నెల
ఏటికి ఎదురీదితే
మూనేరుదాకా
గంగరాజం గజ్జె కదలిన పోచంపాడు దాకా
గంగ పుట్టిన అడవిదాకా
అడవిలోని కొండపైకి
ఎదురెక్కిన వెన్నెల

తల తిప్పిచూస్తే
తాటి తోపులో వెన్నెల
దేశాయిపేట సుధాకర్ అమరత్వంలో వెన్నెల
చిన్నాలు చిరునవ్వు వెన్నెల
గిరాయిపల్లి మృతవీరుల జ్ఞాపకం వెన్నెల
పైడిపల్లి పేదరికం గుడిసెల్లో వెన్నెల
ఏటూరునాగారం అడవుల్లో
సుదర్శన్ మృత్యు రహస్యం విప్పిన
విప్పురవ్వ రహస్తంత్రి వెన్నెల
ప్రాణహిత పెన్‌గంగలను
కాళేశ్వరం సిరొంచలను పెనవేసి కలిపిన
పోరాటం ప్రకృతి వెన్నెల
గడ్‌చిరోలీ భామ్రా గడ్‌ల మీంచి
బస్తర్‌దాకా విస్తరించిన వెన్నెల

శిశిర ఆకాశంనించి 'వసంత మేఘం' వరకు
చూపును స్మృతుల్లోకి నడిపించిన వెన్నెల

బురుజు చీకట్లలోంచి7
నాలుగు వైపులా పోలీసుల వెర్రి కేకలు

సర్కిల్ బురుజుమీద చంద్రుడు
ఖైదీలను పలకరిస్తూ
మల్లెపూల మనసుల్నీ
మామిడి చిగురు భవిష్యత్తునూ
బందీల స్వేచ్ఛనూ
లాకప్‌నుంచి
అన్‌లాకప్8చేస్తూ
గేట్లు గడిచి
గట్లు దాటించి
ఆవలిగట్టుకు నడిపిస్తూ
చల్లగా తెల్లగా
'సబ్ ఠీక్ హై' అంటున్నాడు

3-2-85

1 వరంగల్ జైయిలు మధ్యన వలయాకారం వుండి మధ్యన ఒక టవర్ (గోపురం) చుట్టూ తోట. 16 బ్యారక్‌లుగల 8బ్లాకులు వుంటాయి. ఈ ఆవరణనంతా సర్కిల్ అంటారు.

2 సెర్చ్ - ఏ వస్తువూ తీసుకపోకుండా వెతకడం

3 బ్యారక్‌ను ఖైదీలు కోట అని పిలుస్తారు.

4 హోచిమిన్ జైలులోరాసిన కవితలు– Prison Dairy లో కిటికీలోంచి చంద్రుడు పడుతున్న దృశ్యం

5 పికెఎం కాలేజ్

6 కాకతీయ కెనాల్

7 జైలుకు నాలుగు వైపులా కావలా బురుజులు వుంటాయి.

8 లాకప్ అన్‌లాకప్- బ్యారక్ గేటు వేయడం, తీయడం

ఇందరి ఆకాశంలో యిద్దరం

సీతారామారావు

కుట్రల మాత్రమే వేసే
'కాకీ మతం' కుట్రకేసు బనాయిస్తుంది
ఎప్పుడూ తలెత్తకుండా
'దోషి' ముఖంలోకైనా చూడని
'న్యాయమూర్తి'
శిక్షలు మాత్రమే వేస్తాడు
అయినా
ఉదయించే సూర్యుడి లాంటి నిజాన్ని
నేను మళ్ళీ మళ్ళీ ప్రకటిస్తూనే వుంటాను

* * * *

అమాయకంగా ఆందోళనతో
రోదించే నిన్ను
మృత్యువు లాంటి భయంలోకి
శాశ్వతంగా నెట్టజూస్తారు కొందరు
కొందరి సానుభూతి పేదవులపైనే
మిత్రులెవరో శత్రువులెవరో
అంచనా వేయాల్సిన పరీక్షా సమయమిది
ధైర్యంగా వెలుగు లోకి
చూడాల్సిన కాలమిది
సంకెళ్ళ చీకటిని విరిచే
సంగీతాన్ని వినిపించాల్సిన రోజులివి

మనందరి స్వేచ్ఛ కోసం
నిత్య నిర్బంధంలో సైతం
పోరాటమే ప్రాణవాయువై జ్వలిస్తున్న
అన్నలూ తమ్ముళ్ళూ అక్కలూ చెల్లెళ్ళూ
వీళ్ళూ మన కుటుంబం
ఇందరి ఆకాశంలో మనమిద్దరమై
త్యాగాల దాళ్ళలో నడువాల్సిన తరుణమిది

25-1-85
వరంగల్ కారాగారం

నేర పరిశోధన

కె. బాలగోపాల్

ఒక్క సంవత్సరంలో 24.

ఒక్క 1984 సంవత్సరంలో మన రాష్ట్రంలో 24 మంది పోలీసు కస్టడీలో మరణించారు. కొందరు లాకప్‌లో వుండగా మరణించారు. కొందరు లాకప్‌లో కొట్టినదెబ్బల ఫలితంగా ఆతరువాత మరణించారు. కొందరు ఇంకా లాకప్ చేరక ముందే తోవలోనే మరణించారు.

ఈ 24 అనే సంఖ్య ఎక్కువా తక్కువా ఫరవాలేదా అని తేల్చడానికి మన దగ్గర ప్రమాణాలు లేవు. అంతకుముందు సంవత్సరం, అంతకన్నా ముందు సంవత్సరం, ఎంతమంది చనిపోయారో మనకు తెలీదు. 1983లో 24 కంటె ఎక్కువ మందే చనిపోయారనీ వాస్తవానికి 1984లో 'పరిస్థితి మెరుగయింద'ని డిజిపి ఆచార్యులవారు గణాంకాలు బోధిస్తే కాదనడం మనకు కష్టమే. ఈ మధ్యనే గతించిన ఇందిరాగాంధీకి ఇటువంటి అలవాట్లుండేవి. ద్రవ్యోల్బణం ఎక్కువగా వుందంటే ప్రజానికి కిందటి సంవత్సరం కన్నా రెండూపాయింట్ మూడు శాతం తక్కువయిందనీ కాబట్టి మీరు సుఖంగా వున్నట్టే లెక్క అనీ సమాధానం ఇచ్చేది. కిందటి సంవత్సరం కాకపోతే వెనక్కి వెతుక్కుంటూవెళ్ళి ఫలానా అయిదేళ్ళనాటి పరిస్థితికంటే మెరుగేనని వాదించేది. ఫ్రెంచి రాణి మేరీ ఆంటోనెట్‌లాగ తిండి లేకపోతే గణాంకాలు భుజించి సంతోషించమనేది. అలా వాదించే వాళ్ళకు సమాధానం చెప్పడం అనవసరం.

పోలీసులు ఎవరినయినా చిత్రహింసలకు గురి చేసారనిగాని చంపారనిగాని ఆరోపిస్తే 'వాడు ఏదో చేసే వుంటాడు, లేకపోతే పోలీసులు చిత్రహింసలు ఎందుకు పెడతారు? ఏదో ఒక కారణం లేకపోతే నిన్నూ నన్నూ చంపనిది ఫలానా వాడినే ఎందుకు చంపుతారు?' అని ప్రశ్నించే విద్యావంతులు కొందరున్నారు (చదువుకోని వాళ్ల ఈ ప్రశ్న వేయగా నేను ఎప్పుడూ వినలేదు. ఈ రకమయిన మీమాంస విద్యాగంధం ఫలితమే). గత పంవత్సరం జరిగిన 24 కస్టడీ హత్యలలో ఒకటి మాత్రం నిజంగానే 'ఏదో ఒక కారణం' గూడ లేకుండ వట్టి కావరంతో చేసిన హత్య. 84 జనవరి 10వ తేదీన కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ అడవులలోని బోర్లగూడెం

గ్రామంలో జర్పుల అమ్రి అనే లంబాడా రైతు తాలూకు ఎద్దు ఒకటి పిఆర్‌పి జవా న్లను పొడవబోయిందని ఉక్రోశంతో వాళ్ళు ఆమ్రిను కొట్టి కొట్టి ఆ రాత్రికి చం పారు. అయితే ఇటువంటివి ఒకటి రెండు కేసులు మినహాయిస్తే అత్యధిక భాగం కేసులలో నిజంగానే చంపడానికి 'ఏదో ఒక కారణం' ఉంటుంది. చదువుకున్నవాళ్లు ఆ ప్రశ్న వేస్తున్నారంటే వాళ్ళు మరీ చవటలు కాదుగదా— సకారణంగానే వేస్తున్నారు.

ఈ 'ఏదో ఒక కారణం' అనేది మన వ్యవస్థలో పోలీసు యంత్రాంగం పాత్రతోనూ స్థానంతోనూ ముడిపడి వుంటుంది. ఆ పాత్ర ఏమిటో తెలుసు కోవాలంటే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌నూ పోలీస్ మాన్యువల్‌నూ చదివితే చాలదు. అయినా వాటితోనే ప్రారంభిద్దాం.

శాంతి భద్రతల నిర్వహణ, నేరాల పరిశోధన అనేవి రెండు పోలీసు యం త్రాంగం విధులు. మనదేశంలో పోలీసులు పనిచేసే తీరుతో పరిచయంవున్న వాళ్ళకు ఈ మాటలు వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. చిన్నప్పుడు అందరం దొంగ చాటుగానో బాహాటంగానో (తెలుగులోనో ఇంగ్లీష్‌లోనో) డిటెక్టివ్ పుస్తకాలు చది వాము. నేరపరిశోధన గురించి ఆ పుస్తకాల నుండి కొన్ని ఊహలు ఏర్పరచు కున్నాము. వేలిముద్రలు, అడుగుజాడలు, రక్తపు మరకలు, వెంట్రుకముక్కలు, వీటిని ఉపయోగించి డిటెక్టివ్‌గారు నేరస్తుడి ఆచూకీ తెలుసుకుంటారని ఒక చిత్రం రూపొందించుకున్నాము. నిజంగానే ఇటువంటి పరిశోధన చేయడానికి కావలసిన నేర పరిశోధనా పద్ధతులు చాలా అభివృద్ధి చెందివున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో వీటిని విరివిగా ఉపయోగిస్తారని ప్రతీతి. ఇంగ్లండులోనయితే పోలీసులు నేరపరిశోధనలో ఎవ్వరినీ కొట్టనే కొట్టరని పేరుంది. ('కొట్టకపోతే దొంగ వెధవ ఒప్పుకుంటాడండీ' అని చదువుకున్న పోలీస్ ఆఫీసర్లో పోలీసు ఆత్మలున్న చదువుకున్నవాళ్లూ చాలా తెలివిగా అంటుంటారు). ఇంగ్లండు సంగతి మనం చూడలేదుగాని, మనదేశంలో మాత్రం ఇటువంటి సున్నితమయిన పరి శోధనా పద్ధతులు ఉపయోగించే అలవాటు పోలీసులలో దాదాపుగా మృగ్యం.

కొట్లో పడేసి రోకలి బండలు ఎక్కించడమో లేక ముడ్డిలో కర్ర దూర్చడమో చేస్తే వాడే ఒప్పుకుంటాడు, దానికి వేలిముద్రలూ వేపకాయలూ ఎందుకు? ఇందులో ఒక ప్రాంతానికీ మరొక ప్రాంతానికీ సంప్రదాయాలలో తేడాయే తప్ప సాధనాలలో

లేదు. కొట్లో ఒప్పుకుంటే అది కోర్టులో నడవదుగదా అని మీకు చట్టబద్ధమయిన అమాయకపు సంశయం కలిగిందా? మరేం ఫరవాలేదు. ఒప్పుకోవడం అంటూ జరిగితే సాక్ష్యాలకేం కొదవలేదు.

ఒక చిన్న (సజీవమైన) ఉదాహరణ. ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం వరంగల్‌లోని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు ఒక 18 సంవత్సరాల కుర్రవాడిని తీసుకొచ్చారు. అతని దగ్గర ఒక చేతి గడియారం దొరికింది. ఆ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించబడ్డ ఆరు గడియారాలలో అది ఒకటి అని ఎస్ఐ గారికి అనుమానం. ఆ కుర్రవాడిని అడిగితే నాకు తెలియదన్నాడు. ఎవరో అమ్ముతూంటే కొన్నానన్నాడు. అతను నిజం చెబుతున్నాడో లేదో తెలియడానికి అడ్డు ప్రశ్నలు వేయవచ్చు. అతని ఇంటివాళ్ళనూ పక్కింటివాళ్ళనూ ప్రశ్నించవచ్చు అది దొంగిలించబడ్డ గడియారమనీ, దాన్ని తాను ఎవరి దగ్గర కొన్నదీ చెప్పకపోతే తనమీదే కేసవుతుందనీ చెప్పి అతని నుండి నిజం రాబట్టవచ్చు. ఇంకా చాలా పద్ధతులలో పరిశోధన చేయవచ్చు. కాని ఎస్ఐ గారికి అవేవీ రుచించలేదు. స్టేషన్‌లోకి వచ్చిన అయిదో నిముషంలో ఆ కుర్రవాడికి ముడ్డిలో కర్ర ఎక్కించాడు. పావుగంటసేపు అతను విలవిలలాడుతూ 'నాకు తెలీదు సార్' అని ఏడుస్తున్నాడు. ఆ తరువాత అతన్ని మూడు రోజులు ఇదే విధంగా హింసించారు. అతను ఏమీ చెప్పలేదు. నాలుగవరోజు అతన్ని రిమాండ్ చేయించి వరంగల్ కేంద్ర బందిఖానాకు తోలారు. ఏం కేసు కింద? వాచీలు దొంగతనం చేసాడనా? కాదు. దొంగతనం చేసిన వాచీలు బట్వాడా చేస్తున్నాడనా? అది గూడ కాదు సిఆర్‌పిసి సెక్షన్ 109 కింద. దీనిని పామరులు 'ఆవారా' కేసనీ 'పెట్టీ' కేసనీ అంటారు ఫలాన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా వుంది, అతనునేరం చేయబోయేలాగవున్నాడని పోలీసులుఅంటే, అతనినుండి ఈసమాజాన్ని కాపాడడం కోసం కోర్టువారుఅతన్ని 15రోజులు రిమాండ్‌చేస్తారు. ఆ 15రోజులతరువాత పోలీసులకు అనుమానంతీరకపోతే, అతన్నిజామీనుమీద వదిలిపెట్టడం కోర్టువారికి ఇష్టం లేకపోతే, మరొక15 రోజులు, ఇంకొక 15 రోజులు అట్లా మూడు నెలలపాటు ఏ నేరం చేయకుండానే చేయగలడనే సందేహంమీద జెయిల్లో ఉంచవచ్చును. మన దేశంలో జెయిళ్ళలో ఉండే ప్రతీ అయిదుగురిలోనూ ఒకరు ఈ కోవకు చెందిన 'నేరస్తులు'

ఉంటారు. మరి ఇంతకీ చేతి గడియారం సంగతి ఏమయినట్టు? అతని దగ్గర నుండి దానిని పోలీసులు తీసుకున్నారు. అది నిజంగా దొంగిలించినదే అయితే, దాని యజమాని గట్టిగా అడగ్గలవాడయితే, అతనికి ఫిబ్రవరి 5 నాటి విషయాలు చెవినబడితే, అతను కట్నంచదివించుకోగల వాడయితే, అతని వాచి అతనికి దక్కుతుంది. కాకపోతే ఇంతే సంగతులు. లేక, ఇవి ఎన్నికల రోజులు కాబట్టి, గడియారాల దొంగతనాలు పరిష్కారం కావడం లేదనీ, పోలీసులు నిద్రపోతున్నారనీ, దొంగలతో లాలూచీ పడ్డారనీ, స్థానిక కౌన్సిలర్లు కాబోయే ఎమ్మెల్యేలూ గొడవచేస్తే, అప్పుడు ఇట్లాగే మరికొందరిని పట్టుకొచ్చి కొట్లో సత్కారం జరిపి, దొరికిన గడియారాలలో సగం (సగం మాత్రమే) 'రికవర్' అయినట్టు కోర్టులో పెట్టి కేసు నడిపిస్తారు.

ఈ విధంగా సాగుతుంది 'నేర పరిశోధన'. రోజు రోజుకూ ఈ పరిశోధన తాలూకు పై మెరుగులు మహా ఆర్భాటంగా పెరుగుతున్నాయి. కాని లోపలి సరుకులో మార్పులేదు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ, వేరే ఎన్ని ఇబ్బందులున్నా పోలీసు యంత్రాంగం మీద మాత్రం అడిగినంత ఖర్చు పెడుతున్నాయి. ఇవ్వాళ సగటు ఎస్ఐ జీపు దిగడు. జీపులోనే వైర్‌లెస్ సెట్లుంటాయి. కావలసినన్ని స్పెషల్ స్క్వాడ్లుంటాయి. వాళ్ళు ఎంత ఖర్చు పెడతారో దేనికి ఖర్చు పెడతారో అడిగేవాళ్ళుండరు. ఐజిపి నుండి డిఎస్‌పి దాక పదవులు నూరు పూవులుగా వికసిస్తున్నాయి. కానిస్టేబిళ్ళను మినహాయిస్తే మిగిలిన వాళ్ళందరికీ వేరే ఏ గవర్నమెంట్ డిపార్ట్‌మెంటులోనూ రానంత వేగంగా ప్రమోషన్లు వస్తాయి. అడగినచోటనల్లా పోలీస్ స్టేషన్లు వెలుస్తాయి. నిర్మాణపరమయిన ఈ ఆర్భాటమంతా పైకి కనిపించేదే. దాని కడుపులో దాచుకున్నది అతి అనాగరికమయిన పరిశోధనా పద్ధతి. బహుశా పై నిర్మాణపు ఆర్భాటం పెరిగే కొద్దీ ఈ అనాగరికత గూడ పెరుగుతుందేమో. 20 ఏళ్ళ క్రితం, ఎస్ఐలు సైకిల్ మీద పెట్రోలింగ్ చేసిన రోజులలో, పోలీసు లాకప్పులలో చిత్రహింసలు ఇంత విరివిగా జరిగేవా? అనాడు చూసినవాళ్ళు చెప్పాలి.

గత సంవత్సరం పోలీసు కస్టడీలో చనిపోయిన 24 మందిలో చాలామంది ఈ 'పరిశోధన' ఫలితంగా చనిపోయిన వారే బోడపాటి గోపాల్ అనే విద్యార్థి, చిత్తూరు జిల్లా రంగరాజపురం నివాసి, ఉద్యోగాన్వేషణలో కాబోలు 3వేల రూపాయలు తీసు

కొని విజయవాడ వచ్చాడు. ఒక లాడ్జిలో దిగాడు. అది కనిపెట్టిన పోలీసులు ఆడబ్బు దొంగసొమ్మనే అనుమానం మీద కాబోలు అతన్ని (ఏప్రిల్ 5 నాటి సాయంత్రం) క్రైం స్టేషన్‌కు తీసుకుపోయి 'పరిశోధన' ప్రారంభించారు. రాత్రి అయేసరికి అతడు చనిపోయాడు. 'విషం తాగి చనిపోయాడ'ని పేపర్ ప్రకటన ఇచ్చి వదిలించుకున్నారు. అనంతపురం జిల్లా కూటాగుళ్ళ గ్రామానికి చెందిన వద్దె రాములు అనే వ్యక్తిని ఇదేవిధంగా దొంగతనం చేసాడనే అనుమానం మీద కదిరి పోలీస్ స్టేషన్లో 'విచారం' జరపగా అతను (మే 7వ తేదీన) చనిపోయాడు. అతను తాగుబోతులకు సహజంగా వచ్చే రోగాలవల్ల చనిపోయాడనీ పోలీసులు ప్రకటించారు. అదే జిల్లాకు చెందిన గుంతకల్లు పట్టణంలో జూన్ 12న కిష్టప్ప వెంకటప్ప, రామన్న అనే ముగ్గురిని అరెస్టుచేసి చిత్రహింసలకు గురిచేసిన ఫలితంగా 17వ తేదీన కిష్టప్ప చనిపోయాడు. పోలీసులు అతన్ని రాష్ట్రం సరిహద్దులు దాటి కర్ణాటకలోని బళ్ళారిలో ఆస్పత్రిలో చేర్పించి 'మేడమీదినుండి కిందపడి దెబ్బలు తగిలాయి' అని బుకాయించారు. అక్కడి డాక్టర్లు ఈకథ నమ్మకపోయేసరికి అసలు విషయం బయటకువచ్చింది. ఇటువంటివే మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయి. దాదాపు వీళ్ళలో ఎవ్వరూగూడ పెద్ద పెద్ద కేసులలో నిందితులు కారు. నిజంగానే నేరస్తులయినా కోర్టు వేయగల శిక్ష రెండు మూడు ఏళ్ళను మించేదికాదు. అయినా నేరపరిశోధన క్రమంలో ప్రాణాలనే కోల్పోయారు.

అయితే పాశవికమయిన పరిశోధనా పద్ధతులను అవలంబించడం మాత్రమే కాదు, పోలీసు యంత్రాంగం తన 'విధి'ని అర్థంచేసుకునే తీరులోనే చట్టానికీ వాళ్ల ఆలోచనలకూ వైరుధ్యం ఉంది. మీరు నేర పరిశోధన చేస్తున్నారా లేక నేరానికి శిక్ష వేస్తున్నారా అని మీరు పోలీసులనుగాని అడిగితే ఆ రెండింటికీ తేడా తెలియక తికమక పడతారు. వాళ్లు రెండు పనులూ చేస్తారు. రెండు పనులూ ఒకేసారి చేస్తారు. మొదటిదానికంటే రెండవదే ఎక్కువచేస్తారు. ఎందుకంటే పోలీసులకు కోర్టులమీద, జెయిళ్ళమీద, నమ్మకంలేదు. కోర్టులు శిక్ష వేయవు, వేసినా జెయిల్లో సుఖంగా తిని బయటికి వచ్చి మళ్ళీ దొంగ పనులు చేస్తారు. కాబట్టి 'దొంగవెధవ మళ్ళీ ఆ జోలికి పోకుండ' లాకప్‌లోనే ఒళ్ళు విరగ్గొట్టి బుద్ధిచెప్పి పంపించాలని వాళ్ళ అభిప్రాయం. అంతేకాదు, ఇదే తమ అసలు ధర్మమని పోలీసులు గాఢంగా నమ్ము

తారు. మరి నేరస్తుడు అవునో కాదో తెలియకుండ ఇట్లా 'బుద్ధిచెప్పే' కార్యక్రమం పెట్టుకుంటే అమాయకులు చాలా మందికి అన్యాయం జరుగుతుంది కదా అంటే అది తప్పనిసరి అనీ దానికేం చేయగలిగింది లేదనీ పెదవి విరుస్తారు. ఈరకంగా 'బుద్ధిచెప్పే' కార్యక్రమంలో భాగంగా చనిపోయినవాళ్ళు చాలామంది. విజయవాడలో ఏప్రిల్ 18 నాడు సమరం రమణ అనే స్త్రీని 5 టౌన్ పోలీసులు 'వ్యభిచార' నేరం మీద అరెస్టు చేసారు. ఇటువంటి కేసులలో పెద్దగా విచారణ జరపడానికి గూడ ఏమీ ఉండదు. అయితే ఆమెకు మళ్ళీ వ్యభిచారం చేయకుండ బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారేమో, బాగా కొట్టారు. ఆ దెబ్బల ఫలితంగా ఆమె 20వ తేదీనాడు రక్తం కక్కుకొని చనిపోయింది. హైదరాబాద్ పొలిమేరలలోని రోడామిస్త్రీ నగర్‌కు చెందిన మహమ్మద్ సాబిర్ అనే వ్యక్తి ఒక బేకరీ యజమానితో తగువు పెట్టుకోగా అతని ఫిర్యాదుమీద పోలీసులు సాబిర్‌ను (జూన్ 9న) అరెస్టు చేసారు. ఇందులోగూడ నేరపరిశోధనగాని విచారణగాని చేయడానికి ఏమీ లేదు. అయితే అతనికి మళ్ళీ ఎన్నడూ తగువులు పెట్టుకోకుండా బుద్ధిచెప్పే ఉద్దేశ్యంతో అతన్ని పోలీసులు కొట్టుకుంటూ తీసుకుపోగా అతను దారిలో తిరగబడ్డాడు. అప్పుడు పోలీసులు కోపంతో అతని గొంతు నులిమి పాడుబడ్డ బావిలో పడేసి 'అతనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నా'డని ప్రకటన ఇచ్చారు.

ఈ రకమయిన చిత్రహింసలు ఒక ఎత్తయితే డబ్బులకోసమో లేక రాజకీయ కారణాల వల్లనో పెట్టే చిత్రహింసలు వేరొక ఎత్తు నిజానికి పోలీసు యంత్రాంగం వ్యవహారాలలో లంచాలు ఎంతగా అలుక్కుపోయి ఉంటాయంటే వాళ్ల తమ కర్తవ్యంగా భావించి చేసే పనులనూ లంచాలకోసం చేసే పనులనూ వేరుచేయడం కష్టం నెల్లూరు జిల్లా కావలిలో సెప్టెంబర్ 13 నాడు మేక మస్తానయ్య అనే వ్యక్తి పోలీస్ లాకప్‌లో హత్యచేయబడ్డాడు. ఈ మస్తానయ్య తన గ్రామం సర్పంచ్‌కు వ్యతిరేకి. ఒక హత్య కేసులో అనుమానించబడి తానే స్వయంగా పోలీసులకు సరండర్ అయి నేరం ఒప్పుకున్నాడు గూడ. అయినాసరే అతన్ని 10 రోజులు లాకప్‌లో ఉంచి కొట్టి చంపారు పోలీసులు. అతన్ని లాకప్‌లో హింసించేందుకే వాళ్ళ గ్రామం సర్పంచ్ దగ్గర పోలీసులు లంచం తీసుకున్నారని అనుమానించక తప్పదు

అయితే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోనూ పోలీసు మాన్యువల్‌లోనూ ఎక్కడా రాయని కర్తవ్యం ఒకటి పోలీసు యంత్రాంగానికి ఉంది. అది ఈ వ్యవస్థను కాపాడడానికి ఒక సాయుధ సైన్యంగా పనిచేసే కర్తవ్యం. అది పోలీసు యంత్రాంగం రాజకీయ పాత్ర. అంతా ప్రశాంతంగా వున్నప్పుడు ఈ పాత్ర ప్రముఖంగా కనిపించదుగాని రాజకీయ సామాజిక కల్లోలం ప్రబలంగా వున్నప్పుడు ఈ పాత్రే ముఖ్యమైనదవుతుంది. అప్పుడే పోలీసు యంత్రాంగం అమానుషత్వమంతా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఈ స్థాయిలో జరిగే అత్యాచారాలు ఒక పోలీసు అధికారి తనస్వంత పూచీమీద అత్యుత్సాహంతో చేసేవో లేక ఒక జవాను తాగిన మైకంలో చేసేవో కావు. ఇవి రాజ్యాంగ యంత్రం ఆదేశంతో అనుమతితో ప్రోత్సాహంతో చేసేవి. వీటి మీద పిర్యాదుగాని విచారణగాని వుండవు. ఇంకా మాట్లాడితే ప్రమోషన్లు ఉంటాయి. గత సంవత్సరం జరిగిన 24 హత్యలలో మూడు ఈ కోవకు చెందినవి. కరీంనగర్ జిల్లాలో ఫకీర్‌కొండాపూర్ గ్రామం నుండి జూన్ 17 అర్ధరాత్రి 70 మందిని తోలుకుపోయి విపరీతంగాకొట్టి మెట్టుపల్లి పోలీసు స్టేషన్‌లో విపరీతంగా కొట్టిన ఫలితంగా తోకల చినవెంకటి 18 నాడు చనిపోయాడు. ఈ గ్రామస్థుల మీద ఆరోపణ 'నక్సలైట్లకు అన్నం పెట్టారు' అని. అదే విధంగా అదిలాబాద్ జిల్లా సిర్పూర్ తాలూకాలోని బ్రాహ్మణచిచ్చాల గ్రామస్తులను 30 మందిని సెప్టెంబర్ చివరివారంలో అరెస్టుచేసి కొట్టుకుంటూ తీసుకుపోయి కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్లో పెట్టి కొట్టి విడిచిపెట్టారు. వాళ్లలో ఒకడయిన సామెర్లనాని అక్టోబర్ 4న ఆ దెబ్బల ఫలితంగా చనిపోయాడు. ఈ గ్రామస్తుల మీద ఆరోపణ గూడ నక్సలైట్లకు అన్నం పెట్టారనే. వరంగల్ జిల్లా కడిపికొండ వాస్తవ్యుడయిన కొడవటి సుదర్శన్‌ను 'ఎన్నికల బహిష్కరణ' కార్యక్రమంలో ఉండగా డిసెంబర్ 17 నాడు అరెస్టుచేసి కాజీపేట లాకప్‌లో కొట్టి చంపారు.

ఇన్ని పేర్ల మీద ఇంతమందిని చంపుతూవుంటే మరి ప్రజలు నోరు మూసుకొని ఊరుకోవటమేనా? గత్యంతరంలేదా? ప్రజలు నోరుమూసుకొని ఊరుకోవడం లేదు. ఏదో ఒక రూపంలో అలజడి చేస్తూనే వున్నారు నిజానికి ప్రజలు అలజడి చేయబట్టే ఈ హత్యలు పత్రికల దృష్టికి వచ్చాయి. కదిరిలో వడ్డే రాములును (7మే)

చంపినప్పుడు, నిజామాబాద్ జిల్లా గిద్ద గ్రామంలో స్పెషల్ పోలీసులు పోతయ్యను (12 ఏప్రిల్) చంపినప్పుడు, అదే జిల్లా కామారెడ్డి పట్టణంలో మల్లారం పోచయ్య అనే హమాలీని (15 డిసెంబర్) చంపినప్పుడు, ప్రజలలో చెలరేగిన అలజడి మీద సెక్షన్ 144 సహితం ప్రయోగించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పోలీస్ స్టేషన్లో కె. వెంకయ్య అనే వ్యక్తిని (10 జులై) చంపినందుకు విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆలజడిచేయగా వాళ్లను అరెస్టుచేసి నెలరోజులు బెయిలు సహితం రానీయకుండ జెయిల్లో పడేసారు.

ఈఅలజడికి వేరేఫలితమేమయినా ఉంటోందాఅంటే లేదు. హత్యచేస్తేచట్టంలో పోలీసులకు ఒకసెక్షనూ పౌరులకు వేరేసెక్షనూలేదు. చంపినదిఎవరయినా హత్యానేరం కింద విచారించవలసిందే. అయినా ఈ24 కేసులలో ఒక్కదానిలోమాత్రమే చంపిన పోలీసులను హత్యానేరం కింద అరెస్టుచేసారు. అది బోర్లగూడెం గ్రామంలో అమ్రును చంపిన సి.ఆర్.పి. జవాన్లను. దీనికి కారణం గూడ స్పష్టమే. ఈ హత్యకు బాధ్యులు లా ఆర్డర్ పోలీసులుగాని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసులు గాని కాదు. సి.ఆర్.పి. వాళ్లను కాపాడాలనే 'బాపత్రియం' మన రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి లేదు. అందుకే ఆ ఒక్క కేసులో తీసుకోవలసిన చర్య తీసుకున్నారు. మిగిలిన కొన్ని కేసులలో బాధ్యులయిన పోలీస్ అధికార్లను సస్పెండ్ చేసినట్లు పేపర్లో ప్రకటించిచ్చారు. కాని ఇది కన్నీటి తుడుపు చర్య మాత్రమే. రెండు రోజులు గడిచి అందరూ విషయాన్ని మరచి పోయాక తిరిగి మళ్లీ ఉద్యోగంలోకి తీసుకుంటారు.

ఇదంతా ఒక రకంగా అర్థంచేసుకోగల విషయమే. ఎందుకంటే పోలీసు యంత్రాంగం 'తనవాళ్ళను' కాపాడుకోవాలనుకోవడంలో వింతలేదు. అయితే చట్టం మాటేమిటి, కోర్టుల మాటేమిటి? పోలీసు అత్యాచారాలకు సంబంధించిన ఆరోపణ వచ్చినా దానిమీద దర్యాప్తు జరిపించాలని జిల్లా కలెక్టరును చట్టం ఆదేశిస్తుంది. మామూలుగా మొక్కుబడిగా దర్యాప్తుజరిపించి రిపోర్టు ఫైలులో దాచుకుంటూ ఉంటారు కలెక్టర్లు. కాని రాజకీయ కారణాలవల్ల పోలీసులు చేసే అత్యాచారాలమీద కనీసం ఆపాటి కన్నీటి తుడుపు దర్యాప్తులుగూడ ఉండవు. తోకల చినవెంకటి,

సోమెల్ల నాని, కొడవటి సుదర్శన్‌ల హత్యల విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు (కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్) ఇంతవరకు విచారణ గూడ జరపలేదు.

మరి కోర్టుల మాటేమిటి? ఎవ్వరి ప్రాణాన్ని అయినా చట్టబద్ధమయిన పద్ధతిలో తప్ప ఇతరత్రా హరించడానికి వీలులేదనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో ఒకటి. ప్రాథమిక హక్కులను కాపాడడం కోర్టుల విధులలో ఒకటి మరి అటువంటప్పుడు ఇంతమందిని ఏ విచారణ లేకుండా కొట్టి చంపేస్తుంటే కోర్టులు ఏంచేస్తున్నాయి? ఏంచేస్తున్నాయో ఒక ఉదాహరణ చెప్తాను. అలకుంట పెదవెంకటి అనే ఒక 'బందిపోటు'ను వరంగల్‌లోని హనుమకొండ లాకప్‌లో కొట్టి చంపారు. అతన్ని చంపుతుండగా కళ్ళారాచూసి అతని మరణం తరువాత జైలుకు రిమాండు చేయబడ్డ అతనితమ్ముడు కొమురయ్య హైకోర్టుకు పిటిషన్ పెట్టుకున్నాడు. మేమసలు అరెస్టే చేయలేదని పోలీసులు సమాధానం ఇచ్చారు. ఇది అబద్ధమనీ, పెదవెంకటిని కొట్టి చంపి పోలీసులే శవాన్ని మాయంచేసారనీ, దీనిమీద విచారణ జరిపించమని కోర్టును అడిగితే 'కింది కోర్టులో కేసు పెట్టుకొమ్మ'ని తిరస్కరించింది. కింది కోర్టులో కేసు ఎవరు పెట్టుకోవాలి? చనిపోయిన 'బందిపోటు' తమ్ముడయిన (జైలులో వున్న) మరొక 'బందిపోటు' కేసు పెట్టుకుంటే అతన్నిగాని అతని కుటుంబాన్నిగాని పోలీసులు బ్రతకనిస్తారా? ఈ శంక హైకోర్టువారికి నిజంగా రానేలేదా?

చట్టంలో ఏదో రాసుంది కాబట్టి న్యాయం జరుగుతుందనుకుంటే పొరబాటే చట్టంలో ఎన్నో రాసుంటాయి. అలవాట్లు వేరే రకంగా ఉంటాయి. ఈ అలవాట్లు చట్టాన్ని అతిక్రమించినప్పుడు శిక్షించేధైర్యం న్యాయస్థానాలకు ఉండాలి. ఆ ధైర్యం ఉండడం లేకపోవడం అనేది వ్యక్తులమీద ఆధారపడ్డ విషయం కాదు. ఇవ్వాళ శాంతి భద్రతలు అనేమాట వినగానే హైకోర్టు జడ్జీల నుండి కలెక్టర్లదాకా అందరూ గజగజ వణుకుతున్నారంటే అది వ్యవస్థ ఎంతగా చితికిపోయిందో సూచిస్తుంది. ఈ వ్యవస్థ తన విలువలను తాను గౌరవించే స్థితిని దాటిపోయింది. తన చట్టాన్ని తాను ఆదరించగల స్థైర్యాన్ని కోల్పోయింది. తన విలువలనూ తన చట్టాన్నీ తానే అతిక్రమిస్తే తప్ప మనలేని స్థితికి చేరుకుంది. ఇక ఇప్పుడు న్యాయస్థానాలు సమకూర్చగల న్యాయం ఏమీ లేదు. ప్రజలు తమ న్యాయాన్ని తామే వెతుక్కోవాలి.

శివసాగర్ పోస్ట్‌స్క్రిప్ట్‌తో, వివరణలతో

శత్రుశిబిరమ్మునైన

శివసాగర్ జైబ్జైరీ

వెలువడింది సృజన ప్రచురణ వెల : రూ. 3/-

అడవిలో వెన్నెల

గిరిజన పోరాట కథలు

అడవిలో అన్ని ఋతువులూ అపూర్వంగా వుంటాయి. ఆదివాసులు అమాయకంగా వుంటారు. ఋతువుల సౌందర్యాన్నంతా దోచుకొని పాలక వర్గాలు ఆదివాసుల జీవితాల్లో చీకటిని మిగిల్చారు. ఆదివాసులు తమ పోరాటాలతో తమ జీవితాల్లోకి, అడవిలోకి వెలుగు వెన్నెలలు తెచ్చుకుంటున్నారు.

ఆదిలాబాదు, చంద్రపూర్, గడ్‌చిరోలీ జిల్లాల్లోని ఆదివాసులు విప్లవోద్యమ నాయకత్వంలో నిర్వహిస్తున్న పోరాటాల ప్రతిస్పందనలు ఈ కథలు. ఇది సృజనాత్మక పోరాట చరిత్ర రచన.

పదహారు కథలు - 152 పేజీలు 6 రూపాయలు

ప్రచురణ : కరీంనగర్ బుక్‌ట్రస్ట్, కరీంనగర్

పై రెండు పుస్తకాలు దొరుకుచోటు :

1. పీస్ బుక్ సెంటర్, 4-5-421, సుల్తాన్ బజార్, హైదరాబాద్ 500 001.
2. సృజన, హనుమకొండ 506 001.

వెలువడింది

కె. రాంమోహన్ రాజు కావ్యం

వసంత మేఘం

వెల : రూ. 2/- ప్రతులకు: సృజన, హనుమకొండ - 506 001

చదవండి

చదివించండి

సృజన వద్ద అమ్మకానికి సిద్ధంగావున్న కొత్త పుస్తకాలు

1	ఎన్నెలలో....	- భూపాల్ పాటలు	3.00
2	శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం	- కె. బాలగోపాల్	1-00
3	ప్రజానాట్య మండలి - జ్ఞాపకాలు	- కృష్ణ	2.00
4	తెలంగాణ పోరాట సాహిత్యం	- కె వి.ఆర్.	2.00

ప్రతులకు : సృజన, హనుమకొండ, వరంగల్ - 506 001.

బి. విజయరామిరెడ్డి

ప్రారంభం

(కవితా సంకలనం)

1975 నుండి 1984 వరకూ రాసిన కవితలు

వెలువడింది.

వెల : 3 రూపాయలు

ప్రతులకు : బి. విజయరామిరెడ్డి, ప్లాట్ నెం. 13, ఎల్.ఐ.సి. కాలనీ, యూసుఫ్‌గూడా, హైదరాబాద్ - 500 873.

SRJANA Telugu Monthly February '85 H/HNK-3
Regd. No. with Registrar of Newspapers 10953/67

చూస్తే
జైలుగోడకాదు హద్దు
ఆకాశం పరిహద్దు
ప్రాణాంతక తీగ[1] వెనుక
ప్రభాతం చూద్దూ

ఊహిస్తే
ఆకాశం కాదు హద్దు
సంఘర్షణ పరిహద్దు
ప్రభాతాన్ని ప్రసవించిన
ప్రకృతి వేదననూహిద్దూ

1. జైలుగోడపై వుండే ఎలక్ట్రిక్ లైవ్ (!) వైర్.

SRJANA
Hanumakonda 506 001.
Single copy Rs. 3-00
Yearly Subscription Rs. 30/-